www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 23-3-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 337 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: నవమి తె.5.38 తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాషాఢ తె.4.18 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: మ.1.21-3.00, అమృతఘడియలు: రా.11.19-12.58, దుర్ముహూర్తం: సా.4.46-5.34, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 6.23

వాటీజ్ దిస్ జస్టిస్!?



ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయన్న వార్త న్యాయ వ్యవస్థను ఉలికిపాటుకు గురిచేసింది. మిగతా వ్యవస్థల వలే న్యాయ వ్యవస్థలోనూ అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్నాయి.

దేశంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడల్లా న్యాయ వ్యవస్థ సాగిలపడిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో పాలకులు ఎంత శక్తిమంతులుగా ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడిన న్యాయమూర్తులను కూడా చూశాం. నిఖార్సయిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా అక్కడక్కడా కొంత మంది దారి తప్పుతారు. కాకపోతే ఇటీవలి కాలంలో గంజాయి మొక్కలు ఎక్కువ అవుతున్నాయన్న భావన ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది.

భారత్ వంటి అధిక జనాభా ఉన్న దేశాలలో ఎడా పెడా చట్టాలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అమలు చేయగలిగిన స్థితిలో ఉన్నప్పుడే చట్టాలను చేయాలి. అలా జరిగితేనే ప్రజల్లో అవగాహన ఏర్పడుతుంది.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

విడదల రజినీపై ఎఫ్ఐఆర్





కేసు నమోదు చేసిన ఏసీబీ.. ఐపీఎస్ జాషువాపైనా

నిందితులుగా మరిది గోపి, పీఏ రామకృష్ణ

- జగన్ హయాంలో మైనింగ్ వ్యాపారిని బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు
- కూటమి సర్కారులో బాధితుడి ఫిర్యాదు
- విజిలెన్స్ విచారణలో ఆధారాలు లభ్యం
- కేసు పెట్టాలని ఏసీబీకి సర్కారు ఆదేశం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మైనింగ్ వ్యాపారిని బెదిరించి, రూ.2.20 కోట్లు వసూలు చేసిన వ్యవహారంలో మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజినిపై ఏసీబీ ఎట్టకేలకు కేసు నమోదు చేసింది. నాడు ఆమె అరాచకాలకు కొమ్ముకాసిన ఐపీఎస్ అధికారి జాషువాను ఈ కేసులో రెండో నిందితుడిగా చేర్చింది. అలాగే డబ్బుల కోసం మైనింగ్ వ్యాపారిని బెదిరించిన విడదల రజిని మరిది

మిగతా 12వ పేజీలో...

చంద్రబాబు అనుభవమే నాకు ప్రేరణ

- ఆ స్ఫూర్తితోనే గ్రామసభల ప్రపంచ రికార్డు
- ప్రజల ఆర్థిక స్థిరత్వం మా ప్రభుత్వ లక్ష్యం
- ఉపాధితో అన్నదాతల జీవితాల్లో వెలుగులు
- కర్నూలు జిల్లాలో నీటి కుంటల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పవన్ కల్యాణ్

13

నెలాఖరులోగా నిధులు తెచ్చుకోవాలి

- కేంద్రంతో సత్వరం సంప్రదింపులు జరపాలి
- ఆర్థిక శాఖకు సీఎం ఆదేశం
- కేంద్ర పథకాలపై సమీక్ష

కొడుకుని గొంతు కోసి చంపిన కిరాతక తండ్రి!

- భార్యతో తరచూ గొడవలే కారణం
- మహారాష్ట్రలోని పుణేలో ఘటన.. నిందితుడు ఏపీలోని విశాఖ వాసి

పుణే, మార్చి 22: భార్యతో తరచూ గొడవల కారణంగా మూడున్నరేళ్ల కుమారుడిని దారుణంగా హత్య చేశాడో కిరాతక తండ్రి. కత్తితో గొంతు కోసి చంపేశాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణేలో జరిగింది. పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన తికేటి మాధవ సాధురావుగా గుర్తించామని ఇన్‌స్పెక్టర్ సీమా ధకనే తెలిపారు. 38 ఏళ్ల అతను ఐఐటీ బెంగళూరులో ఎంటెక్ చేశాడని, ఇంటి విషయాలపై మాధవ తన భార్య స్వరూపతో తరచూ గొడవ పడేవాడని పేర్కొన్నారు. మాధవ మగర్‌పట్టా సిటీలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేవాడు. అయితే రెండు నెలల క్రితం అతని ఉద్యోగం పోయింది. బీటెక్ చేసిన స్వరూప.. ఇంట్లోనే గృహిణిగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఉద్యోగం పోయినప్పటి నుంచి వీరిద్దరు తమ సేవింగ్స్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారు. 2016 నుంచి పుణేలోని చందన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. డీసీపీ హిమ్మత్ జాదవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం మాధవ తన కుమారుడు హిమ్మత్‌ను ఇంటి నుంచి బైక్‌పై బయటకు తీసుకెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు చేసింది. మాధవ సెల్‌ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేయగా.. వాడ్గావ్ షెరి ఏరియాలో ఐలా స్టే అనే లాడ్జిలో లోకేషన్ చూపించింది. అక్కడ ఒక రూమ్‌లో ఉన్న మాధవ.. తలుపు తీయకపోవడంతో పోలీసులు బద్దలు కొట్టారు. ఆ సమయంలో అతను మద్యం మత్తులో పడి ఉండటాన్ని గుర్తించారు. అయితే అతని వద్ద కుమారుడు లేకపోవడంతో.. పోలీసులు అనుమానంతో స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించారు. మొదట సరిగా సమాధానాలు చెప్పకపోవడంతో.. పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో తన కుమారుడిని గొంతు కోసి హత్య చేసినట్లు మాధవ ఒప్పుకున్నాడు. పోలీసులు బాలుడి మృతదేహాన్ని ఫారెస్ట్ పార్కు సమీపంలోని దట్టంగా పొదలు ఉన్న ప్రాంతంలో గుర్తించారు. కొడుకుని హత్య చేసిన తర్వాత ఒక దుకాణంలో బట్టలు కొనుక్కొని, రక్తం అంటిన దుస్తులను మార్చుకొన్న తర్వాత లాడ్జికి వెళ్లాడని, అక్కడ మద్యం తాగి నిద్రపోయాడని డీసీపీ జాదవ్ తెలిపారు.

విశాఖ మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీస్

- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌కు అందజేసిన కార్పొరేటర్లు, నేతలు



జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు నోటీస్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నేతలు

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానానికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు, నేతలు శనివారం జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు నోటీస్ అందజేశారు. తక్షణం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ 70 మంది కార్పొరేటర్ల సంతకాలతో కూడిన నోటీస్ ఇచ్చారు. పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసిన కార్పొరేటర్ల వివరాలను జీవీఎంసీ అధికారులు నిర్ధారించుకున్న తర్వాత బల నిరూపణకు కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులకు నోటీసులు జారీ చేస్తారు. నోటీసు జారీ చేసిన 15 రోజుల తర్వాత ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానంపై చర్చకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కూటమికి 70 మంది కార్పొరేటర్లు, 11 మంది ఎక్స్ అఫీషియో సభ్యుల బలం ఉంది. దీంతో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడం లాంఛనమే. జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందించేందుకు జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద, జీవీఎంసీలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, పలువురు కార్పొరేటర్లు వచ్చారు.

వాతావరణ అనిశ్చితితో వర్షాలు

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ నుంచి మధ్యప్రదేశ్ మీదుగా మధ్య మహారాష్ట్ర వరకు, కర్ణాటక నుంచి తమిళనాడు వరకూ వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించి ఉన్నాయి. వీటి ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమగాలులు వస్తున్నాయి. ఇవి వాయవ్య భారతం నుంచి వీస్తున్న పొడి గాలులతో కలవడం వల్ల వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీంతో శనివారం సాయంత్రం కోస్తాలో అక్కడక్కడ, రాయలసీమలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో పలుచోట్ల, కోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. సోమ, మంగళవారాల్లో కూడా రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాగా, శనివారం రాష్ట్రంలో పలుచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దేచర్లలో రోడ్డు మెటల్ తవ్వేసిన ప్రాంతం(ఫైల్)

'ఇసుక మాదే. మట్టీ మాదే... మద్యం నాదే. పేకాట క్లబ్బులూ మావే!'... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో ఒక నియోజకవర్గ స్థాయి నాయకుడి దందా ఇది! ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్ద పెద్ద నాయకులున్నప్పటికీ... ఈ చోటా నేతదే హవా! అధికారులు ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేస్తున్నా.. ఆ నాయకుడు చెలరేగిపోతూనే ఉన్నాడు. ఆయనతోపాటు మరికొందరు నేతలూ ఎవరికి వారుగా సంపాదనలో పడ్డారు.

రాజమహేంద్రవరంలోని కొందరు నేతలతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తోడేస్తున్నారు. వంతెనల పక్కనే పడవలతో ఇసుకను తవ్వుతున్నారు. రెండు రోజుల కిందట బల్లిపాడులో మైన్స్, రెవెన్యూ అధికారులు స్వయంగా డ్రెడ్జింగ్ మిషన్‌ను పట్టుకుని స్వాధీనం చేసుకుని కేసు పెట్టారు. వంతెనలను ఆనుకుని ఇసుక తోడుతున్న పడవలను పోలీసు అధికారులు పలుమార్లు సీజ్ చేశారు.

కొవ్వూరులో 'కంత'కులు!

- కూటమి ముసుగులో ఇసుక మాఫియా
- లిక్కర్, గ్రావెల్, మెటల్, మట్టి ...అన్నింటా దోపిడే
- డ్రెడ్జింగ్ ద్వారా కూడా ఇసుక తవ్వకాలు
- ఓపెన్ రీచ్‌ల్లో సొంత సామ్రాజ్యాలు
- రోజుకు రూ. 15 లక్షల మామూళ్లు
- బోట్స్‌మన్ సొసైటీల నుంచి టన్ను లెక్కన దందా
- డిపాజిట్లు వసూలు చేసి బెల్టు షాపులు
- చోటా నేతలే చెలరేగుతున్న వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



కొవ్వూరు మండలం చిడిపి, కుమారదేవం గ్రామాల్లోని గోదావరి మీదుగా మట్టి తవ్వకాలు జరపడానికి నిర్మించిన రహదారి

రాష్ట్రంలోనే అతి పెద్ద నది గోదావరి! అందునా... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు వద్ద కిలోమీటర్ల వెడల్పునా విస్తరించి ఉంటుంది! అక్కడే... లెక్కలేనంత ఇసుక! అధికారంలో ఎవరున్నా... ఆ ఇసుకపైనే కన్ను. వైసీపీ హయాంలో... ఇసుక 'కలెక్షన్ల' ఒత్తిడికి తట్టుకోలేక అదే పార్టీకి చెందిన ఓ ఇసుక వ్యాపారి రైలు పట్టాలపై తల పెట్టి బలవన్మరణానికి పాల్పడ్డారు. వైసీపీ పోయిన తర్వాత పరిస్థితులు మారతాయని ప్రజలు భావించారు. కానీ... అధికార కూటమిలో నేతలుగా చలామణీ అవుతున్న కొందరు డబ్బు సంపాదనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారు. ర్యాంపులు, బోట్స్‌మన్ సొసైటీల పాలిట 'కంత'కులుగా తయారయ్యారు. గట్లు, నదుల గర్భాలు... వేటినీ వదలకుండా తవ్వేస్తున్నారు. ఇసుక, లిక్కర్, గ్రావెల్, రోడ్డు మెటల్, లంక మట్టి.. ఇలా అన్నింటా దోపిడీకి తెగబడుతున్నారు. చివరకు పేకాట క్లబ్‌లు కూడా నిర్వహిస్తున్నారు. అధికారులు నోటీసులు ఇస్తున్నా, కేసులు పెడుతున్నా మాఫియా దందా మాత్రం ఆగడం లేదు. ఒక నాయకుడు కొవ్వూరు కంతకుడిగా మారిపోగా... మరికొందరు సొంత దుకాణాలు తెరిచేశారు. దీంతో వారి మధ్య వర్గ పోరు కూడా మొదలైంది. ఎమ్మెల్యేతోపాటు ఇతర ముఖ్య నేతలు నామమాత్రంగా మిగిలిపోగా... చోటా నాయకులే నియోజకవర్గాన్ని దున్నేస్తున్నారు.

డ్రెడ్జింగ్‌తోనూ దోపిడీ...

కొవ్వూరు నియోజకవర్గంలో బోట్స్‌మన్ సొసైటీల ముసుగులోనే దోపిడీ జరుగుతోంది. డిసెంబరు నెలలో సొసైటీలకు అవకాశం ఇచ్చినప్పుడు కేవలం వాడపల్లి ర్యాంపు నుంచే రోజుకు సుమారు 400 లారీల ఇసుక రవాణా సాగేది. ఆరు యూనిట్ల లారీ ఇసుకకు రూ.ఆరు వేలు సొసైటీ వసూలు చేస్తే... అందులో చిన్న లారీకి రూ.500, పెద్ద లారీకి రూ.వెయ్యి, మార్కెట్ లారీకి రూ.రెండు వేలు కప్పం కట్టాల్సిందే. జనవరిలో ఈ పాలసీ మార్చి టన్నుకు రూ.50 వంతున మామూళ్లు తీసుకోవడం మొదలుపెట్టారు. అది చాలదని, అదనపు లోడుకు వచ్చే మొత్తం సొమ్మునూ లాగేస్తున్నారు. దీనికోసం కొందరిని గుమస్తాలుగా వారికి ఓ స్కానర్ ఇచ్చి, దానికి నేరుగా డబ్బు జమ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు రూ.15 లక్షలకు పైగానే వసూలు చేస్తున్నారు. వాడపల్లి నుంచి తాడిపూడి వరకు సదరు నేతలు చెప్పిందే రేటు! నిజానికి, నిర్ణీత ధర ప్రకారం టన్ను ఇసుక రూ.88కి అమ్మాలి. ఇక్కడ ర్యాంపు పాడుకున్న ఓ అధికార పార్టీ నేత రూ.255కు అమ్ముతున్నాడు.తాళ్లపూడి మండలం బల్లిపాడు, వేగేశ్వరపురం, కొవ్వూరు మండలం కుమారదేవం-1,2 ర్యాంపుల్లోనూ ఇదే వరుస.

బెల్ట్ షాపునకు రూ.50వేలు డిపాజిట్

కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 40 వరకూ బెల్ట్‌షాపులు ఉన్నట్టు సమాచారం. ఒక్కో బెల్ట్ షాపునకు డిపాజిట్‌గా రూ.50 వేలు సదరు నేతలు వసూలు చేశారు. గత ప్రభుత్వంలో వీరంతా అప్పటి అధికార పార్టీతో అంటకాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. నాడు మునిసిపల్ ఎన్నికల్లో వైసీపీకి సహకరించారన్న విమర్శలు వచ్చాయి.




కొవ్వూరు మండలం దేచర్లలో ఎస్సీ, బీసీ రైతుల భూముల్లో అక్రమంగా తవ్వేసిన గ్రావెల్ ప్రాంతం (ఫైల్)

ఎస్సీ భూములనూ వదల్లేదు..

కొవ్వూరు మండలంలోని చిడిపి, కుమారదేవం గ్రామాలకు చెందిన 97 మంది ఎస్సీలకు 65 సెంట్ల చొప్పున గతంలో ప్రభుత్వాలు లంక భూములు ఇచ్చాయి. వీటిపై కూడా మాఫియా కన్నుపడింది. ఇటీవల గోదావరి నదికి అడ్డంగా మట్టి రహదారి నిర్మించి రాత్రింబవళ్లూ వందలాది లారీల మట్టిని తరలించారు. లారీ మట్టి రూ.6 వేల వంతున అమ్మేశారు. ఈ మట్టి ఇటుక బట్టీలకు, కడియం నర్సరీలకు తరలిపోతోంది. ఇంకా లే అవుట్ల ఫిల్లింగ్, పల్లపు ప్రాంతాలు మెరక చేసుకోవడం కోసం ఈ మట్టిని అమ్ముతున్నారు. దీనిని స్థానికులు అడ్డుకోవడంతో పాటు అధికారులు కూడా స్పందించడంతో ప్రస్తుతం ఇక్కడ తవ్వకాలు ఆగాయి. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు కొవ్వూరు తహశీల్దార్ ఆర్ఐ, వీఆర్వో, సీనియర్ అసిస్టెంట్, వీఆర్ఏలతో టీమ్‌లు వేసి ప్రతిరోజు రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకూ పహారా పెట్టి తవ్వకాలకు బ్రేకులు వేశారు.

లోకం తీరు



రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణ

- జిల్లా కలెక్టర్‌కు జెండా అందజేసిన బృంద సభ్యులు



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు బ్లూ ఫ్లాగ్ జెండాను అందిస్తున్న బ్లూఫ్లాగ్ ఇండియా సభ్యులు

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపును పునరుద్ధరిస్తున్నట్టు బ్లూఫ్లాగ్ ఇండియా నేషనల్ ఆపరేటర్ డాక్టర్ శ్రీజిత్ కురూప్ వెల్లడించారు. బ్లూ ఫ్లాగ్ జ్యూరీ సభ్యుడు అజయ్ సక్సేనాతో కలిసి శుక్రవారం బీచ్‌ను సందర్శించి, సదుపాయాలను పరిశీలించిన సంగతి తెలిసిందే. అన్నింటిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ గత నెల ఉపసంహరించుకున్న గుర్తింపును పునరుద్ధరిస్తూ దానికి సంబంధించిన జెండాను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు శనివారం అందజేశారు. భద్రత, పర్యావరణ నిర్వహణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రే వాటర్ నిర్వహణ వంటివి ప్రణాళికాబద్ధంగా కొనసాగించాలని సూచించినట్టు జిల్లా పర్యాటక శాఖాధికారి సుగుణ సుధాకర్ తెలిపారు.

'లెవెలింగ్' తనిఖీల్లో తాత్సారం!

- 3 నెలల్లో 40 శాతం మాత్రమే పూర్తి
- కేవలం 2.43% పనులకే నివేదికలు
- మార్గదర్శకాలకు ఉపాధి క్వాలిటీ సిబ్బంది తిలోదకాలు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఇంటి స్థలాల చదును పనుల తనిఖీలను నిర్వీర్యం చేసేందుకు కొందరు ఉపాధి క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, అధికారులు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అప్పటి కాంట్రాక్టర్లు, అధికారులను రక్షించేందుకు తనిఖీ సిబ్బంది నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అవసరమైతే కొంత సమయం తీసుకుని సమగ్రంగా విచారణ చేపట్టాలన్న కమిషనర్ ఆదేశాలను అవకాశంగా తీసుకుంటున్నారు. డిసెంబరు 15న లెవలింగ్ తనిఖీలు ప్రారంభం కాగా.. మూడు నెలలవుతున్నా సగం కూడా పూర్తి చేయలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లో 9,688 పనులను తనిఖీ చేయాల్సి ఉంటే.. 3,900 (40%) మాత్రమే నిర్వహించారు. సంబంధిత నివేదికలు కూడా 6 జిల్లాల్లోని 236 పనులకు(2.43%) మాత్రమే సమర్పించారు.

మార్గదర్శకాలు బేఖాతరు

గత ప్రభుత్వంలో రాష్ట్రంలో రూ.1,125 కోట్ల మేర లెవెలింగ్ పనులను వైసీపీ కార్యకర్తల ద్వారా చేపట్టారు. అయితే రూ.1,500 కోట్ల వరకు పనులు చేసినట్లు దొంగ బిల్లులు పెట్టారు. సుమారు రూ.1,260 కోట్లను గత ప్రభుత్వం ఎన్నికల ముందే చెల్లించింది. రూ.240 కోట్ల మేర బకాయిలున్నాయని కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించడంతో వారికి బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. విత్‌హెల్డ్‌లో ఉన్న బకాయిలు చెల్లించడానికి క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ తనిఖీలు చేపట్టాల్సి ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అప్పట్లోనే మార్గదర్శకాల్లో పేర్కొంది. లెవలింగ్ పనుల్లో అక్రమాలు జరిగాయని పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేవనెత్తిన నేపథ్యంలో తనిఖీలు చేపట్టాలని కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాలిచ్చారు. పంచాయతీరాజ్, ఇతర శాఖల ఇంజనీర్లతో బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. పనుల వాస్తవ పరిస్థితి, లెవలింగ్ పనులు చేశారా.. లేదా? నమోదిత పరిమాణంలో ఉన్నాయా.. లేదా? పరిశీలించాలని పేర్కొన్నారు. మట్టి కొనుగోలు చేసినట్లు దొంగ రికార్డులు సృష్టించారా? తహసీల్దార్ అనుమతి లేకుండానే క్యూబిక్ మీటర్ మట్టికి రూ.50 అదనంగా నమోదు చేసి సొమ్ము స్వాహా చేశారా? అనే అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. అలాంటి పనుల్లో రూ.50 కోత విధించాలని, ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాలని సూచించారు. పనుల కొలతల్లో తేడాలున్నా, అసలు పనులు లేకున్నా.. పరిశీలించి అవసరమైతే తాజా కొలతను అప్‌లోడ్ చేయాలన్నారు. అయితే ఆ మార్గదర్శకాలను పట్టించుకోకపోవడంతో తనిఖీలు తప్పుదారి పట్టాయి.

నిర్వీర్యం చేసేందుకు యత్నాలు

కమిషనర్ ఒక విధంగా ఆదేశిస్తే సిబ్బంది మాత్రం మరో రకంగా తనిఖీలు చేపడుతున్నారు. నివేదికల్లోనూ ఆయా కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన చెల్లింపులను జీరో చేశారే తప్ప.. అధిక చెల్లింపులు పొందిన వారి నుంచి రికవరీ చేసే యోచన ఉన్నట్లు లేదు. కాంట్రాక్టర్లు ఎవ్వరూ తహసీల్దార్ల నుంచి మట్టి క్వారీ పర్మిషన్లు తీసుకున్న దాఖలాల్లేవు. కొన్ని జిల్లాల్లో అధికారులు అత్యుత్సాహంతో తహసీల్దార్లు క్వారీ పర్మిషన్ ఇచ్చినట్లు పాత తేదీలతో పత్రాలు తేవాలని కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తున్నారు. తాత్సారంతో తనిఖీలు నిర్వీర్యం చేయవచ్చన్న యోచనలో ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకుని విచారణ వేగవంతం అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ సొమ్ము వైసీపీ కార్యకర్తల జేబుల్లోకి..

జగనన్న కాలనీల్లో స్థలాల చదును పనులకు గ్రావెల్ కొనుగోలు కోసం క్యూబిక్ మీటర్‌కు రూ.134 చెల్లించారు. మట్టి ప్రైవేట్‌గా రైతుల నుంచి కొనుగోలు చేసి ఉంటే ఆ ధర చెల్లించాలి. రైతు పొలం నుంచి మట్టి తీసుకునేందుకు తహసీల్దార్ అనుమతి ఉండాలి. ప్రభుత్వ స్థలంలో మట్టిని సేకరిస్తే డబ్బులు చెల్లించే అవసరం ఉండదు. రవాణా ఖర్చు మాత్రమే లెక్కించాలి. అయితే చదును పనులకు మట్టిని క్యూబిక్ మీటర్ రూ.50కు కొనుగోలు చేసినట్లు, తరలించినందుకు రూ.84 చొప్పున మొత్తంగా క్యూబిక్ మీటర్‌కు రూ.134 చొప్పున రికార్డు చేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టి సేకరించి రూ.50 అదనంగా వసూలు చేశారు. దీంతో భారీగా ప్రభుత్వ సొమ్ము వైసీపీ కార్యకర్తల జేబుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం వడగండ్ల వర్షం కురిసింది. అనంతపురంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వానకు పంటలు దెబ్బతిన్నాయి.

పత్తి పంటను ప్రోత్సహించేందుకు

కపాస్ క్రాంతి

- రూ.2500 కోట్లతో కేంద్రం కొత్త కాటన్ మిషన్
- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యాదవ



అఖిల భారత కాటన్ వార్షిక సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న డాక్టర్ యాదవ, చిత్రంలో డాక్టర్ సీడీ మాయి, శారదా జయలక్ష్మి, వైజీ ప్రసాద్, డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ

గుంటూరు సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేశంలో సాగు విస్తీర్ణం పడిపోతున్న పత్తి పంటను ప్రోత్సహించేందుకు కేంద్రం కపాస్ క్రాంతి అనే మిషన్ ప్రవేశపెట్టనున్నట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డీకె యాదవ తెలిపారు. గుంటూరు సమీపంలోని లాం ఫాంలో జరుగుతున్న అఖిల భారత కాటన్ వార్షిక సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.2500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన కపాస్ క్రాంతి ద్వారా పత్తి రైతుకు అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలు అందుబాటులోకి తేవడంతో పాటు, ఉత్పాదకత పెంచనున్నట్టు వెల్లడించారు. కపాస్ క్రాంతిలో మూడు మినీ మిషన్లు ఉంటాయని తెలిపారు. ఏటా రూ.500 కోట్లు వ్యయం చేసి పత్తి పంటకు పునర్వైభవం తెచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రెండో మిషన్‌లో వెయ్యి జిన్నింగ్, ప్రెస్సింగ్ యూనిట్లను ఆధునీకరించే అంశం కూడా ఇందులో నిక్షిప్తమై ఉందని పేర్కొన్నారు. భారత దేశం పురాతన సమన్వయ పరిశోధనా కార్యక్రమాల్లో ఒకటైన ఆలిండియా కోఆర్డినేటెడ్ కాటన్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ప్రాముఖ్యాన్ని ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20 కేంద్రాలు, 190 మంది శాస్త్రవేత్తలతో, సంవత్సరానికి రూ.40 కోట్ల బడ్జెట్‌తో పనిచేస్తోందన్నారు. పత్తి పంట సాగులో డ్రోన్లతో పాటు ఇతర యాంత్రీకరణ విధానాన్ని ప్రవేశపెట్టాలని డాక్టర్ యాదవ సూచించారు. దేశంలో పత్తి సాగును ప్రోత్సహించేందుకు కస్తూరి కాటన్‌ను కేంద్రం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న కాటన్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ సీడీ మాయి మాట్లాడుతూ కాటన్ రెండో మిషన్ లక్ష్యాలను నిర్దేశించారు. ప్రతి హెక్టారుకు 850 నుంచి 900 కిలోల లింట్ ఉత్పత్తి లక్ష్యంగా రెండవ విషన్ పనిచేయాలని అన్నారు. గులాబీ రంగు పురుగు నియంత్రణలో బీటీ సాంకేతికతలు మాత్రమే సరిపోతాయనే భావనను విడనాడాలని సూచించారు. ఇ-డయాగ్నోస్టిక్ విధానాలతో పత్తి సమస్యకు పరిష్కారాలు, సంస్కరణలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ డైరెక్టర్ వైజీ ప్రసాద్, వీసీ శారదా జయలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ, డాక్టర్ దుర్గా ప్రసాద్, వివిధ రాష్ట్రాలకు చెందిన 160 మంది పత్తి పంట పరిశోధనా శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బట్టకట్టాలంటే 'పత్తి' బతకాలి

- నాగ్‌పూర్ ఐసీఏఆర్ - సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. ప్రసాద్



గుంటూరు సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు అత్యవసరమైనవి అయిన కూడు, గూడు, దుస్తులకు కొరత లేకుండా చూస్తే దేశంలోని శాస్త్రవేత్తలు సఫలీకృతులు అయినట్లే అని నాగ్‌పూర్ ఐసీఏఆర్-సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్ అన్నారు. అఖిల భారత పత్తి వార్షిక సమావేశం-2025లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. "పత్తి సాగు విస్తీర్ణం భారతదేశంలో పూర్తిగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమావేశం ఆ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి దిక్సూచి అవుతుందని ఆశిస్తున్నాను. ఒకప్పుడు 90 లక్షల దూది బేళ్ల ఇతర దేశాలకు ఎగుమతి చేసిన చరిత్ర మన దేశానిది. ప్రస్తుతం దేశం 30 లక్షల దూది బేళ్లను దిగుమతి చేసుకుంటోంది. రైతులు పత్తి సాగు నుంచి మళ్లిపోవడానికి గల కారణాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. కాలానికి అనుగుణంగా అన్నిటినీ తట్టుకునే వంగడాలు రావాలి. కాటన్ మిషన్-2లో కేవలం బీటీ మీదే ఆధారపడకుండా వాతావరణ మార్పులు తట్టుకునే వంగడాలపైనా శ్రద్ధ పెట్టాలి. రైతులు కూడా తక్కువ వ్యవధిలో పంట చేతికి వచ్చే రకాలను ఎంచుకోవాలి. సాగు విధానంలో మార్పులు వస్తేనే పత్తి లాభసాటిగా ఉంటుంది. హైడెన్సిటీ పత్తి సాగు, యాంత్రీకరణపై కూడా దృష్టి సారించాలి. పొడుగు పింజ పత్తిని సాగు చేయటం మంచిది. ఇక ఆంధ్రాలో సాగు విస్తీర్ణం తగ్గిపోవడం బాధ కలిగించే అంశం. రాష్ట్రంలో పూర్వవైభవం సాధించే దిశగా ప్రయత్నాలు జరగాలి. అందుకు శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు కృషి చేయాలి" అని పేర్కొన్నారు.

రేపటి నుంచి తెలంగాణ సిఫారసు

లేఖలపై శ్రీవారి దర్శనం

- ఏపీ ప్రజాప్రతినిధులకు సోమవారం బ్రేక్ కట్

తిరుమల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు శ్రీవారి దర్శనం సోమవారం నుంచి అమలు కానుంది. ఆదివారం సిఫారసు లేఖలను టీటీడీ స్వీకరించనుంది. అయితే, 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 30న ఉగాది రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినందున, 24, 29 తేదీల్లో మాత్రం సిఫారసు లేఖలు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై సోమ, మంగళవారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు.. బుధ, గురువారాల్లో రూ.300 ప్రత్యేక దర్శనాలు కల్పిస్తారు. ఈ క్రమంలో ఏపీ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఇకపై సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉండవు. దీనికి బదులుగా ఆదివారం అనుమతిస్తారు.

విపత్తు నిర్వహణకు నైట్ విజన్ డ్రోన్లు

- రసాయన కర్మాగారాల వద్ద గాలి నాణ్యత పరికరాలు
- తీరప్రాంతాల్లో తహశీల్దార్, కలెక్టర్లకు శాటిలైట్ ఫోన్లు
- రెవెన్యూ, విపత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హానికర, రసాయన కర్మాగారాల సమీపంలో గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ఆదేశించారు. వాయు కాలుష్యాన్ని ముందుగానే గుర్తించి దాన్ని నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలా ఆ పరికరాలు ఇచ్చే ఇన్‌పుట్స్ ఉండాలని చెప్పారు. వేసవిలో అత్యధిక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున విపత్తు నిర్వహణ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు పరిశ్రమలు, కర్మాగారాలు కూడా విపత్తు నిర్వహణ విధానాలను సర్వం సిద్ధంగా ఉంచుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు నిర్వహణపై తాడేపల్లిలోని రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాయంలో సమావేశం జరిగింది. ఇందులో సిసోడియా మాట్లాడారు. ప్రమాదాలు, ఇంకా ఊహించని భారీ విపత్తులు వచ్చినప్పుడు వాటిని అధిగమించేందుకు నైట్ విజన్ (రాత్రిళ్ల కూడా స్పష్టంగా కనిపించే) డ్రోన్‌లను సమకూర్చుకోవాలని ఆయన విపత్తు నిర్వహణశాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. అవసరమైన డ్రోన్ పైలట్లను ఎంప్యానల్ చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. తీరప్రాంతాల్లో విపత్తుల సమయంలో తహశీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు శాటిలైట్‌ఫోన్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే, ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో అమలవుతున్న డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టులో.. ఇప్పటిదాకా చేసిన ఖర్చులు, ఉన్న పరికరాలు, ప్రస్తుతం వినియోగంలో ఉన్నవాటి గురించి సమగ్ర నివేదిక ఇవ్వాలని సిసోడియా అదేశించారు. సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ డైరెక్టర్ కూర్మనాథ్, అధికారులు పాల్గొన్నారు.

మే 7న ఏపీ ఐసెట్

విశాఖపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన 'ఏపీ ఐసెట్-2025'కు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కన్వీనర్ ఎం.శశి తెలిపారు. శనివారం నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆ తరువాత ఏప్రిల్ 14 వరకూ రూ.1,000 అపరాధ రుసుముతో, 15 నుంచి 19వ తేదీ వరకు రూ.2,000.. 20 నుంచి 24 వరకు రూ.4,000, 25 నుంచి 28 వరకు రూ.10,000 అపరాధ రుసుముతో దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. మే ఏడున పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు http:// cets.a psche. ap. gov. in/APSCHE Home.aspx వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

శ్రీవారి సేవలో జస్టిస్ సుజాత



తిరుమల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

విచారణకు సిద్ధమయ్యేందుకు గడువు కావాలి

- ఏకసభ్య కమిషన్‌కు నాటి క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ విజ్ఞప్తి
- తొక్కిసలాట ఘటనలో ముగిసిన మూడవ దశ విచారణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ ఉద్యోగిగా ఎన్నో బ్రహ్మోత్సవాలు, ఉత్సవాలు చూసుంటారు. అలాంటిది వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం పెద్దయెత్తున భక్తులు వస్తారు కదా.. మరి ఎలా పార్కులోకి పంపించేశారు..? అది మీ నిర్ణయమా, టీటీడీ నిర్ణయమా, పోలీసు శాఖ నిర్ణయమా? అసలు అది హోల్డింగ్ పాయింట్ కాదు కదా' అని తిరుపతి తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిని ప్రశ్నించినట్టు తెలిసింది. తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం కూడా తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా హరినాథరెడ్డిని విచారించారు. ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్‌లో భక్తులకు టోకెన్ల పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తే పార్కులోకి ఎందుకు పంపించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అంతమంది భక్తులు ఒకచోట గుమికూడినపుడు గేటు తాళాలు ఎందుకు తీశారు? మీరు ఆ సమయంలో అక్కడున్నారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అయితే భక్తులను పార్కులోకి పంపి హోల్డ్ చేసిన నిర్ణయం తనది కాదని కమిషన్ దృష్టికి హరినాథరెడ్డి తీసుకెళ్లినట్టు తెలిసింది. జనవరి 8వ తేదీ రాత్రి విధుల్లో ఉన్న విజిలెన్సు సిబ్బందిని కూడా కమిషన్ విచారించింది. అసలు ఆ సమయంలో ఏం జరిగింది. ఎందుకు గేటు తీయాల్సి వచ్చింది అని ఆరా తీసింది. అయితే ఈ ఘటనలో సస్పెండైన నాటి క్రైమ్ డీఎస్పీ రమణకుమార్ మాత్రం 'సార్.. నేను విచారణకు సంసిద్ధం కావాల్సి ఉంది. కొంత సమయం కావాలి' అని కమిషన్ చైర్మన్‌కు విన్నవించుకున్నారు. టీటీడీ పూర్వ సీవీఎస్వో శ్రీధర్ కూడా ఘటనపై అఫిడవిట్ సమర్పించారు. కాగా, ఈ నెల 15న కమిషన్ మూడవ దశ విచారణ తిరుమల నుంచి ప్రారంభించిన విషయం విదితమే. శ్రీవారి దర్శనానికి భక్తులు వెళ్లే క్యూలైన్ల నిర్వహణను పరిశీలించారు. ఆ తర్వాత కలెక్టరేట్ వేదికగా కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ప్రస్తుత ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, నాటి ఎస్పీ సుబ్బరాయుడు, పూర్వ సీవీఎస్వో శ్రీధర్, అప్పటి జేఈవో గౌతమితో పాటు సుమారు వంద మంది గాయపడిన బాధితులు, టీటీడీ ఉద్యోగులు, పోలీసులను విచారించారు. ఇక నాలుగో దశ విచారణ ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కానుంది.

టెన్త్ సంస్కృతం పేపర్లు తారుమారు!

- ఇన్విజిలేటర్ నిర్లక్ష్యంతో ఆరుగురు విద్యార్థులకు తిప్పలు



మారిన ప్రశ్నా పత్రాన్ని చూపుతున్న విద్యార్థిని తేజస్వి

ఇబ్రహీంపట్నం/రణస్థలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్ నిర్లక్ష్యంతో ఆరుగురు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు తారుమారవడం కలకలం రేపిం ది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్ కేంద్రంలో ఈ వ్యవహారం వెలుగు చూసింది. శనివారం నిర్వహించిన సంస్కృతం పరీక్షలో ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పేపర్‌ను, మరో ముగ్గురు సప్లిమెంటరీ విద్యార్థులకు రెగ్యులర్ ప్రశ్నాపత్రాన్ని ఇన్విజిలేటర్ ఇచ్చారు. ఈ విషయాన్ని విద్యార్థిని కరణం తేజస్వి గుర్తించింది. దీనిపై మరో విద్యార్థిని అడిగి నిర్ధారించుకుంటున్న సమయంలో మాట్లాడితే బయటకు పంపేస్తానని ఇన్విజిలేటర్ వారించడంతో మౌనంగా ఉండిపోయింది. పరీక్ష పూర్తయి బయటకు వచ్చిన తర్వాత తోటి విద్యార్థుల ప్రశ్నాపత్రంతో పోల్చి చూసుకొని ఈ ఆరుగురూ కంగుతిన్నారు. దీనిపై వారి తల్లిదండ్రులు కొద్దిసేపు పాఠశాల వద్ద ఆందోళన చేశారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. కాగా, ఇన్విజిలేటర్ పొరపాటు కారణంగా సంబంధం లేని పేపర్‌తో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు. ప్రశ్నాపత్రం మార్పు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్ ఎస్. శైలజను సస్పెండ్ చేయడంతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ కేజేఎస్ లక్ష్మి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జె. విద్యాసాగర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వివరించారు.

కుప్పిలిలో ఆరుగురిపై కేసు

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూలు పరీక్ష కేంద్రంలో టెన్త్ పరీక్షల కాపీయింగ్ వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదైంది. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుండగా డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఆకస్మిక తనిఖీ నిర్వహించి 15మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేశాయి. ఈ ఘటనపై ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎచ్చెర్ల ఎస్ఐ వి. సందీప్ కుమార్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ ఆర్కే RK

కొత్తపలుకు



వాటీజ్ దిస్ జస్టిస్?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయని వెలువడ్డ వార్త న్యాయ వ్యవస్థను ఉలికిపాటుకు గురిచేసింది. న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వెలువడిన ఈ వార్తతో సదరు వ్యవస్థపై ప్రజలలో నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ ఉదంతంతో పలు మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టలు ఈ నెల 14న బయటపడగా, వారం రోజుల వరకు అది వెలుగు చూడకపోవడానికి కారణం ఏమిటి? ఆ నోటా ఈ నోటా ఈ ఉదంతం వెలుగులోకి రావడం ఏమిటి? సదరు న్యాయమూర్తిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఏమిటి? లెక్కల్లో చూపని నగదు దొరికినప్పుడు హడావిడి చేసే ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు మౌనంగా ఉండటం ఏమిటి? ఈ సంఘటనపై సమాచారం సుప్రీంకోర్టు కొలీజియంకు నిజంగానే ఆలస్యంగా తెలిసిందా? లేక ఈ వ్యవహారం గాలివానగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కొలీజియం స్పందించిందా? ఈ సంఘటనపై

> కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెట్టింగ్ యాప్‌లను, జూదాన్ని పోలిన గేమ్‌లను నిషేధిస్తూ గేమింగ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత యథావిధిగా అందరూ ఆ చట్టాన్ని మరచిపోయారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గేమింగ్ యాప్‌ల కోసం సినీ ప్రముఖులు ప్రచారం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అప్పుడు పట్టించుకోలేదు. దీంతో అది నేరమే కాదనుకొని ప్రముఖ హీరోలు కూడా ప్రచారం చేశారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు మేల్కొన్నారు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రచారం చేసిన వారిపై పోలీసులు అప్పుడే ఎందుకు కేసులు పెట్టలేదు? ఇప్పుడు మాత్రమే ఎందుకు హడావిడి చేస్తున్నారు? చట్టాలను అమలు చేయని అధికారులపై కూడా చర్యలు ఉండాలి కదా? చట్టాలంటే ప్రజల్లో భయం ఉండాలి. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్ష పడుతుందన్న భయం ఉండాలి. అలా కాకుండా గిట్టని వారిని ఇబ్బంది పెట్టేందుకు... మూలన పడి ఉన్న చట్టాలను దుమ్ము దులిపి అమలు చేయాలనుకోవడం వల్లనే తంటా అంతా.

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ చేపట్టగా 'అబ్బే, సదరు న్యాయమూర్తి ఇంట్లో డబ్బే దొరకలేదు' అని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రకటించడం ఏమిటి? ఇందులో నిజానిజాలు తెలుసుకొనే హక్కు ఈ దేశ పౌరులకు లేదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయా?

అవినీతికి అతీతం కాదా??


మిగతా వ్యవస్థల వలే న్యాయ వ్యవస్థలో కూడా అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కారణంగా న్యాయమూర్తుల అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది. కీలకమైన, సున్నితమైన అంశాలపై విచారణ జరిపి తీర్పులు ఇచ్చే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రక్షణలు కల్పించారు. ఇప్పుడా రక్షణలను కొంతమంది న్యాయమూర్తులు దుర్వినియోగం చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. తీర్పులు అనుకూలంగా రాని సందర్భాలలో కక్షిదారులు న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించకుండా రాజ్యాంగ నిర్మాతలు ఈ రక్షణలు కల్పించారు. న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించే వారిని కోర్టు ధిక్కరణ కింద శిక్షించే వెసులుబాటును న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించింది. న్యాయమూర్తులకు కల్పించినంత రక్షణ న్యాయాధికారులకు కల్పించలేదు. కింది స్థాయి కోర్టులలో పనిచేసే న్యాయాధికారులు అవినీతికి పాల్పడినా లేదా ఇతర అనైతిక చర్యలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకొనే అవకాశం హైకోర్టులకు కల్పించారు. అదే హైకోర్టు న్యాయమూర్తి ఎవరైనా అవినీతికి పాల్పడ్డారని వెల్లడైనా సదరు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు కూడా నేరుగా చర్య తీసుకోలేదు. పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించడం ద్వారానే సదరు న్యాయమూర్తులను తొలగించగలరు. స్వతంత్ర భారతావనిలో రామస్వామి, సౌమిత్రసేన్ అనే ఇద్దరు న్యాయమూర్తులు మాత్రమే అభిశంసన ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు లభించిన విషయం వాస్తవమేనని రుజువైతే ఆయనపై ఏమి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశం అయింది. న్యాయాధికారులను అవినీతి కేసులలో అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇనుప ఖనిజం గనుల వ్యవహారంలో గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కో నుంచి ఐదు కోట్ల రూపాయలు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలపై పట్టాభి రామారావు అనే న్యాయాధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో సీబీఐ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో అవమాన భారంతో కుంగిపోయిన పట్టాభి రామారావు కొంతకాలానికి ఆత్మహత్య చేసుకున్నారు.

నిజమేనా? నిజమైతే ఏం చేస్తారు?

ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ వ్యవహారం రచ్చగా మారింది. వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కొలీజియం నిర్ణయించడంతో, 'మా హైకోర్టు ఏమైనా చెత్త బుట్టా?' అని అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. దీంతో వర్మ బదిలీకి, ఆయనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేపట్టిన అంతర్గత విచారణకూ సంబంధం లేదని సుప్రీంకోర్టు కొలీజియం వివరణ ఇచ్చింది. డబ్బు కట్టలు లభించిన విషయం నిజమా? కాదా? అని నిర్ధారించుకోవడానికి వారం రోజులు చాలవా? ఇంకెంత కాలం కావాలి? ఒకవేళ అది నిజం కాని పక్షంలో యశ్వంత్ వర్మ ప్రతిష్ఠకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత తీసుకుంటారు? అంతర్గత విచారణలో అది నిజమే అని తేలితే సదరు న్యాయమూర్తిపై ఏమి చర్యలు తీసుకుంటారు? వారం రోజులుగా ఈ వ్యవహారం గుప్పుమంటున్నా నోరు విప్పని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గర్గ్ ఇప్పుడు 'అబ్బే, అలాంటిదేమీ లేదు' అని ప్రకటించడమేమిటి? దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మౌనంగా ఎందుకుందో తెలియదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల వద్ద లెక్కల్లో చూపని నగదు స్వల్ప మొత్తంలో దొరికినా అవినీతి నిరోధక సంస్థలు కేసులు పెడతాయి. లంచంగా వంద రూపాయలు తీసుకున్నప్పటికీ నేరం నేరమేనని ఉన్నత న్యాయస్థానాలు ఎన్నో సందర్భాలలో తీర్పులు ఇచ్చాయి. ఈ సూత్రం న్యాయమూర్తులకు వర్తించదా? రాజ్యాంగపరంగా రక్షణ కల్పించబడినప్పటికీ ఇలాంటి సందర్భాలలో సదరు న్యాయమూర్తులపై చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఎలా ఉంటుంది? న్యాయవ్యవస్థలోనూ జవాబుదారీతనం ఉండాలి కదా?

కీలక ప్రశ్నలు...

న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది బహిరంగ రహస్యంగా మారిన ఈ రోజుల్లో న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను కొనసాగించవలసిందేనా? ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం ప్రక్రియ చర్చనీయాంశం అయింది. ఉన్నత న్యాయస్థానాలతోపాటు సర్వోన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను నియమించే అధికారం కొలీజియం వద్ద ఉండటం వాంఛనీయం కాదన్న వాదన నడుస్తోంది. అలా అని న్యాయమూర్తుల నియామక అధికారం ప్రభుత్వాలకు అప్పగిస్తే న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటుందన్న వాదన కూడా బలంగా ఉంది. ఇటీవలి కాలంలో మన న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. దేశంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడల్లా న్యాయ వ్యవస్థ సాగిలపడిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో పాలకులు ఎంత శక్తిమంతులుగా ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడిన న్యాయమూర్తులను కూడా చూశాం. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థ లొంగిపోయిందని చెబుతారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ఉండేవారు. కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పి.శివశంకర్ పనిచేశారు. అప్పట్లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ద్రోణంరాజు సత్యనారాయణ అనే కాంగ్రెస్ నాయకుడు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనం నెలల తరబడి విచారించింది. చివరికి ముఖ్యమంత్రి నివాసంలో పరిమితికి మించి పాలు వినియోగించడం వంటి అంశాలలో ఎన్టీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం తేల్చింది. రెండు మూడు లీటర్ల పాలు ఎక్కువగా వినియోగించారని ఇప్పుడు తీర్పు ఇస్తే జనం నవ్వుకుంటారు. వందల, వేల కోట్ల అవినీతి జరిగినా, జరుగుతున్నా ప్రజల్లో స్పందన ఉండటం లేదు. ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా తీర్పు రావడానికి పై నుంచి వచ్చిన ఒత్తిళ్లు పనిచేశాయని అప్పట్లో ప్రచారం జరిగింది. దీనిపై ఎన్టీఆర్ సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకున్నారు. అది విచారణకు రాకముందే ఆయన కన్నుమూశారు. కేసు దాఖలు చేసిన ద్రోణంరాజు గానీ, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కానీ, న్యాయశాఖ మంత్రి శివశంకర్ కానీ, ద్రోణంరాజు తరఫున కేసులు వాదించిన ఎస్.రామచంద్రరావు కానీ ఇప్పుడు మన మధ్య లేరు. ఎన్టీఆర్ తరఫున వాదించిన ఇ.అయ్యపురెడ్డి కూడా ఇప్పుడు మనతో లేరు. కేంద్రంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడు న్యాయవ్యవస్థ ఒత్తిళ్లకు తలొగ్గే అవకాశం ఉందని చెప్పడానికి ఎన్టీఆర్ కేసును ఒక ఉదాహరణగా న్యాయ నిపుణులు చెబుతుంటారు. అలా అని న్యాయమూర్తులు అందరూ అలాగే ఉంటారని భావించకూడదు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది కూడా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తే. జస్టిస్ జగ్మోహన్ లాల్ సిన్హా ఇచ్చిన ఆ సాహసోపేత తీర్పు బలమైన నాయకురాలు ఇందిరాగాంధీని డిఫెన్స్‌లో పడేసింది. నాటి తీర్పు నుంచి బయటపడేందుకు దేశంలో అత్యయిక పరిస్థితిని ఇందిరాగాంధీ అమలు చేశారు. ఆమె అధికారం కూడా కోల్పోయారు. అలాంటి నిఖార్సయిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా అక్కడక్కడా కొంత మంది దారితప్పుతారు. కాకపోతే ఇటీవలి కాలంలో గంజాయి మొక్కలు ఎక్కువ అవుతున్నాయన్న భావన ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడు మళ్లీ యశ్వంత్ వర్మ వ్యవహారానికి వద్దాం! ఈ విషయం కేవలం న్యాయ వ్యవస్థ ప్రైవేటు వ్యవహారం కాదు. న్యాయ వ్యవస్థ స్వచ్ఛంగా ఉండాలని కోరుకొనే హక్కు ఈ దేశ పౌరులకు ఉంది. రాజ్యాంగం ఎన్ని రక్షణలు కల్పించినప్పటికీ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయే పనులు చేయకూడదు కదా! తనకు సంబంధించి వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సదరు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అయినా ప్రకటించాలి, లేదా విచారణను త్వరగా ముగించి వాస్తవం ఏమిటో ప్రజలకు తెలియజేయాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు మంచి పేరే ఉంది. న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఆయన చర్యలు తీసుకోవాలి. సంఘటన జరిగిన తర్వాత వారం రోజుల వరకు నోట్ల కట్టల వ్యవహారం బయటకు రాకపోవడమే తనను అధికంగా బాధిస్తోందని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయంతో ఎవరైనా ఏకీభవించాల్సిందే. నోట్ల కట్టలు అక్కడ ఉండటం నిజమే అయితే దాన్ని దాచిపెట్టాలని అనుకోవడం కూడా నేరమే అవుతుంది. తప్పు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాలిగానీ జరిగిన దానికి మసిబూసి మారేడు కాయ చేయాలనుకోవడం కూడా నేరం అవుతుంది. నిప్పు లేనిదే పొగ రాదు అని అంటారు. ఇప్పుడు పొగ వచ్చింది. నోట్ల కట్టల వ్యవహారం దాచిపెట్టాలని ఏ స్థాయిలో ప్రయత్నాలు జరిగినా ప్రజల్లో న్యాయ వ్యవస్థ విశ్వసనీయత మరింత దెబ్బతింటుంది. న్యాయమూర్తులు కూడా ఈ సమాజం నుంచే వస్తారు. వారు ఆకాశం నుంచి ఊడిపడరు. సమాజంలో ఉన్న బలహీనతలు వారిలో కొందరికి ఉండవచ్చు కూడా. అంచేత తప్పు జరిగి ఉంటే... తప్పు జరిగిందని సర్వోన్నత న్యాయస్థానమైనా స్పష్టం చేస్తే ప్రజలకు కొంతలో కొంతైనా ఉపశమనం లభిస్తుంది. అలా కాకుండా ఇది తమ అంతర్గత వ్యవహారమని, తామే చూసుకుంటామని ఏ స్థాయిలోనైనా భావిస్తే అది న్యాయ వ్యవస్థకు కీడు చేసినట్టే అవుతుంది. నోట్ల కట్టల ఉదంతం శుక్రవారం ఉదయం నుంచి ప్రసార మాధ్యమాలలో ప్రచారమైనప్పటికీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రాత్రి పొద్దుపోయాక అంతా ఉత్తదే అని ప్రకటించడం, శనివారం అందుకు విరుద్ధంగా తాను అలా అనలేదని మాట మార్చడం వింతగా ఉంది. ఏదేమైనా మన న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం ఉండాలి. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నిజంగా డబ్బు లభించి ఉంటే ఆయనకు ఏ శిక్ష విధిస్తారోనని కూడా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయనతో రాజీనామా మాత్రమే చేయిస్తారా? లేక అవినీతి నిరోధక చట్టాలు, మనీ లాండరింగ్ చట్టాల కింద శిక్షిస్తారా అన్నది కూడా తెలుసుకోవాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన వార్తా పత్రికలలో ఈ ఉదంతమే పతాక శీర్షికగా వచ్చింది. అయితే, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి చెందిన రోత మీడియాలో మాత్రం ఈ వార్త ఫస్ట్ పేజీలో అప్రధానంగా ప్రచురించారు. అవినీతి కేసులలో విచారణను ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డికి నైతికత లేనందునే కాబోలు ఆయన రోత మీడియా ఈ వార్తను విస్మరించింది.



తెలియదంటే సరిపోదు...

Ignorance of law is not an excuse అని పలు సందర్భాలలో న్యాయ స్థానాలు తీర్పులు ఇచ్చాయి. తెలంగాణలో బెట్టింగ్ యాప్‌ల తరఫున ప్రచారం చేసిన సినీ ప్రముఖులలో కొందరు, తమకు అలా ప్రచారం చేయడం తప్పని తెలియదన్నారు. న్యాయ సమీక్షలో ఈ వాదన నిలబడదు. చట్టాల గురించి తెలుసుకోవలసిన బాధ్యత ప్రజల మీదే ఉంటుందని మన చట్టాలు చెబుతున్నాయి. ప్రకాశ్‌రాజ్ వంటి వారు మాత్రం బెట్టింగ్ యాప్‌ల కోసం ప్రచారం చేయడం తప్పు అని తెలియగానే తాను ఆపేశానని హుందాగా చెప్పారు. నిజానికి మన దేశంలో ఏమి చట్టాలు ఉన్నాయి? ఎన్ని చట్టాలు ఉన్నాయి? అన్న విషయం ఎంతమందికి తెలుసు? కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారిలో ఎంత మందికి అమలులో ఉన్న చట్టాల గురించి తెలుసు? ఇందుకు కారణం లేకపోలేదు. ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేసుకుంటూ పోతున్నాయి. వాటి గురించి ప్రజలకు కనీస అవగాహన కల్పించడం లేదు. అంతెందుకు! సదరు చట్టాలను ఆమోదిస్తున్న చట్టసభల్లోని సభ్యుల్లో ఎంత మందికి ఆ చట్టాల గురించి తెలుసు? ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి మనసులో అనుకుంటారు. వారు అనుకున్న దాన్ని చట్టాల రూపంలో అధికారులు బిల్లుగా రూపొందిస్తారు. సదరు బిల్లులను సమగ్రంగా చర్చించకుండానే అధికార పార్టీ సభ్యులు వాటిని ఆమోదిస్తారు. ఆ వెంటనే ఆయా చట్టాలు అమల్లోకి వస్తాయి. ప్రసార మాధ్యమాలలో కూడా వాటి గురించి వివరించరు. వివరంగా వార్తలు ప్రచురించినా పాఠకులకు ఆసక్తి ఉండదు. చట్టాలు చేసిన వారికి కూడా అందులో ఏముందో తెలియదు. చట్టసభ సభ్యులకే తాము ఆమోదించిన చట్టాల గురించి తెలియని నేపథ్యంలో... 'చట్టాల గురించి తెలియనంత మాత్రాన నేరం నుంచి తప్పించుకోలేరు' అని అనడం కించిత్ ఆశ్చర్యంగా ఉంది. మన దేశంలో ఎన్ని చట్టాలు ఉన్నాయని అడిగితే ఒక్కరైనా కరెక్టుగా చెప్పగలరా? కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెట్టింగ్ యాప్‌లను, జూదాన్ని పోలిన గేమ్‌లను నిషేధిస్తూ గేమింగ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత యథావిధిగా అందరూ ఆ చట్టాన్ని మరచిపోయారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గేమింగ్ యాప్‌ల కోసం సినీ ప్రముఖులు ప్రచారం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అప్పుడు పట్టించుకోలేదు. దీంతో అది నేరమే కాదనుకొని ప్రముఖ హీరోలు కూడా ప్రచారం చేశారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు మేల్కొన్నారు. హెల్మెట్ ధారణ విషయమే తీసుకుందాం. న్యాయస్థానాలు ఆదేశించినప్పుడు లేదా ట్రాఫిక్ అధికారులకు గుర్తొచ్చినప్పుడు మాత్రమే హెల్మెట్ ధారణ రూల్ అమలు చేస్తున్నారు. వాహనాలలో కూర్చున్నవారు బయటకు కనిపించకుండా కార్లలో బ్లాక్ ఫిల్మ్ అంటించడం కూడా నిషేధించారు. అయినా సుప్రీంకోర్టు స్పందించే వరకు ఈ రూల్ అమలు కాలేదు. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో! చట్టాలు చేసిన ప్రభుత్వాలకు వాటికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత లేదా? మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని చట్టాలు చేశారు, ఏమేమి చట్టాలు చేశారు అని మాజీ ముఖ్యమంత్రులను అడిగితే చెప్పే పరిస్థితి ఉందా?

> కొండ కోనల్లో జీవిస్తున్న గిరిపుత్రులకు నాగరిక ప్రపంచంతో సంబంధాలు ఉండటం లేదు. అలాంటి వారు చట్టాల గురించి ఎలా తెలుసుకుంటారు? ఈ కారణంగా Ignorance of law is not an excuse అని మరో చట్టంలో ఉన్న విషయం చెప్పి శిక్షిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నిజంగా నగదు లభించి ఉంటే Ignorance of law అని చెప్పలేరు కదా? ఆయన నేరానికి శిక్ష పడాల్సిందే!

చట్టం గురించి చెప్పాల్సిందెవరు?

భారతదేశం వంటి అధిక జనాభా ఉన్న దేశాలలో ఎడాపెడా చట్టాలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అమలు చేయగలిగిన స్థితిలో ఉన్నప్పుడే చట్టాలను చేయాలి. అలా జరిగితేనే ప్రజల్లో అవగాహన ఏర్పడుతుంది. ఏదైనా జరిగినప్పుడు ప్రజలను సంతృప్తిపరిచేందుకు చట్టాలు చేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుంది. గేమింగ్ యాప్‌ల విషయంలో పోలీసులు ఇప్పుడు కేసులు నమోదు చేసి సినిమా వాళ్లను పిలుస్తున్నారు. దీంతో ఇప్పుడు ఇది ప్రధాన వార్తగా మారింది. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రచారం చేసిన వారిపై పోలీసులు అప్పుడే ఎందుకు కేసులు పెట్టలేదు? ఇప్పుడు మాత్రమే ఎందుకు హడావిడి చేస్తున్నారు? చట్టాలను అమలు చేయని అధికారులపై కూడా చర్యలు ఉండాలి కదా? చట్టాలంటే ప్రజల్లో భయం ఉండాలి. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్ష పడుతుందన్న భయం ఉండాలి. అలా కాకుండా గిట్టని వారిని ఇబ్బంది పెట్టేందుకు... మూలన పడి ఉన్న చట్టాలను దుమ్ము దులిపి అమలు చేయాలనుకోవడం వల్లనే తంటా అంతా. ఈ కారణంగానే ప్రజల్లో చట్టాలపట్ల భయం, గౌరవం లేకుండా పోయింది. పలుకుబడి ఉంటే చట్టాలు చుట్టాలుగా మారిపోతున్నాయి. ప్రజలు కూడా చట్టాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. లేని పక్షంలో తమను ఇబ్బందులపాలు చేయడానికి సదరు చట్టాలను దుర్వినియోగం చేస్తారని గ్రహించాలి. ఉదాహరణకు ఇటీవల విడుదలైన 'కోర్టు' అనే సినిమాలో చట్టాల గురించి తెలియకపోతే వాటిని ఎంతలా దుర్వినియోగం చేస్తారో చక్కగా వివరించారు. పోక్సో చట్టం గురించి ఈ సినిమాలో చక్కగా చెప్పారు. సదుద్దేశంతో చేసిన చట్టాలను కక్ష సాధింపులకు వాడుకుంటున్నారు. వైవాహిక జీవితంలో మహిళలకు రక్షణ కల్పించడం కోసం రూపొందించిన చట్టంలోని 498ఏ సెక్షన్‌ను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్నారని వింటున్నాం, చూస్తున్నాం. చిన్న పిల్లలను లైంగికంగా వేధించే వారిని కఠినంగా శిక్షించడానికి రూపొందించిన పోక్సో చట్టాన్ని అడ్డుపెట్టుకొని పద్దెనిమిదేళ్లు నిండటానికి కొద్ది రోజులే మిగిలి ఉన్న యువతిని ప్రేమించిన పాపానికి ఒక యువకుడిని కేసు పెట్టి వేధించిన తీరును 'కోర్టు' చిత్రంలో చక్కగా చూపించారు. పసి పిల్లలను కూడా వదలకుండా లైంగికంగా వేధిస్తున్న కేసులు వెలుగుచూడటంతో పోక్సో చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టం ప్రకారం పద్దెనిమిదేళ్లు నిండని యువతిని ప్రేమించడం నేరం అన్నట్టుగా 'కోర్టు' చిత్రంలో ఒక యువకుడిపై కేసు పెట్టి చిత్రహింసలు పెడతారు. పోక్సో చట్టం ప్రకారం బెయిల్ కూడా లభించదు. ఇలాంటి చట్టాల విషయంలో అయినా ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా? చట్టసభలలో సంఖ్యా బలంతో చట్టాలు చేశాం, వాటి గురించి మీరే తెలుసుకోండి అని ప్రభుత్వాలు చెప్పడం ఎంత వరకు సమంజసం? మన దేశంలో ఇంకా నిరక్షరాస్యత ఉంది. కొండ కోనల్లో జీవిస్తున్న గిరిపుత్రులకు నాగరిక ప్రపంచంతో సంబంధాలు ఉండటం లేదు. అలాంటి వారు చట్టాల గురించి ఎలా తెలుసుకుంటారు? ఈ కారణంగా Ignorance of law is not an excuse అని మరో చట్టంలో ఉన్న విషయం చెప్పి శిక్షిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నిజంగా నగదు లభించి ఉంటే Ignorance of law అని చెప్పలేరు కదా? ఆయన నేరానికి శిక్ష పడాల్సిందే!

> నిజానికి మన దేశంలో ఏమి చట్టాలు ఉన్నాయి? ఎన్ని చట్టాలు ఉన్నాయి? అన్న విషయం ఎంతమందికి తెలుసు? కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారిలో ఎంత మందికి అమలులో ఉన్న చట్టాల గురించి తెలుసు? ఇందుకు కారణం లేకపోలేదు. ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేసుకుంటూ పోతున్నాయి. వాటి గురించి ప్రజలకు కనీస అవగాహన కల్పించడం లేదు. అంతెందుకు! సదరు చట్టాలను ఆమోదిస్తున్న చట్టసభల్లోని సభ్యుల్లో ఎంత మందికి ఆ చట్టాల గురించి తెలుసు? ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి మనసులో అనుకుంటారు. వారు అనుకున్నదాన్ని చట్టాల రూపంలో అధికారులు బిల్లుగా రూపొందిస్తారు. సదరు బిల్లులను సమగ్రంగా చర్చించకుండానే అధికార పార్టీ సభ్యులు వాటిని ఆమోదిస్తారు. ఆ వెంటనే ఆయా చట్టాలు అమల్లోకి వస్తాయి. చట్టాలు చేసిన వారికి కూడా అందులో ఏముందో తెలియదు. చట్టసభ సభ్యులకే తాము ఆమోదించిన చట్టాల గురించి తెలియని నేపథ్యంలో... 'చట్టాల గురించి తెలియనంత మాత్రాన నేరం నుంచి తప్పించుకోలేరు' అని అనడం కించిత్ ఆశ్చర్యంగా ఉంది.

> న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వెలువడిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు వార్తతో సదరు వ్యవస్థపై ప్రజలలో నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ ఉదంతంతో పలు మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టలు ఈ నెల 14న బయటపడగా, వారం రోజుల వరకు అది వెలుగు చూడకపోవడానికి కారణం ఏమిటి? ఆ నోటా ఈ నోటా ఈ ఉదంతం వెలుగులోకి రావడం ఏమిటి? సదరు న్యాయమూర్తిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఏమిటి? లెక్కల్లో చూపని నగదు దొరికినప్పుడు హడావిడి చేసే ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు మౌనంగా ఉండటం ఏమిటి? ఈ సంఘటనపై సమాచారం సుప్రీంకోర్టు కొలీజియంకు నిజంగానే ఆలస్యంగా తెలిసిందా? లేక ఈ వ్యవహారం గాలివానగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కొలీజియం స్పందించిందా?


స్వాతంత్ర్య సమరంలో యువవీరులు

షహీద్ దివస్.. నేడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల అమర త్యాగాలకు దేశం గర్విస్తోంది. భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విడిపించడానికి అసమాన పోరాటం చేసిన ఆ ముగ్గురు వీరులను నాటి వలస పాలకులు అన్యాయంగా ఉరికంబం ఎక్కించారు.

చిన్న వయసులోనే ఆ ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఉరిని కూడా ఆనందంగా స్వీకరించి బలిదానం చేసిన రోజు మార్చి 23. ఆ వీరులు ప్రాణత్యాగం చేసిన నాటి రోజునే వారి జ్ఞాపకార్థం షహీద్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఆ ముగ్గురూ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ థాపర్, శివ్‌రామ్ రాజ్‌గురులు. బ్రిటిష్ పాలన అంతంకావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఈ ముగ్గురు వీరులు నాటి తరానికే కాదు, నేటి యువతకు కూడా ఆదర్శం. ఉరికంబం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులు, చావును కూడా ఎంతో ఆనందంగా స్వీకరించారు. 1931 మార్చి 23న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న పంజాబ్ హుస్సైన్‌వాలా ప్రావిన్స్ జైల్లో ఈ వీరులను ఉరికంబానికి బలిచ్చారు. భరతమాతను బ్రిటిషర్ల చెర నుంచి విడిపించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుల్లో భగత్‌సింగ్ ఒకరు. అందుకే ఆ విప్లవ వీరుడ్ని షహీద్ భగత్‌సింగ్‌గా పిలుస్తారు. 1907 సెప్టెంబరు 28న ప్రస్తుత పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జన్మించిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తనకు వివాహం చేయాలన్న తల్లిదండ్రుల నిర్ణయం తెలుసుకున్న భగత్, ఆ ప్రయత్నాన్ని మానుకోమని ఉత్తరం రాసిపెట్టి ఢిల్లీకి చేరారు. దైనిక్ అర్జున్, ప్రతాప్ లాంటి పత్రికల్లో కొంతకాలం పనిచేసిన భగత్‌సింగ్‌కు ఆ సమయంలోనే గణేశ్ విద్యార్థి, బటుకేశ్వరదత్ లాంటి విప్లవకారుల సహచర్యం లభించింది.

విప్లవం ద్వారా మాత్రమే స్వాతంత్ర్యం సిద్ధించగలదని భావించిన భగత్‌సింగ్ 'నౌ జవాన్ భారత్ సభ'ను 1924లో స్థాపించారు. భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్‌లు ఆ సమయంలో తమ రక్తంతో ప్రమాణపత్రంపై సంతకం చేశారు. అప్పుడే కాన్పూర్‌లో వరదలు రావడంతో, సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న భగత్‌సింగ్‌కు చంద్రశేఖర్ ఆజాద్‌తో పరిచయం ఏర్పడింది. తరువాతి కాలంలో వారు ప్రాణస్నేహితులుగా మారారు. నౌ జవాన్ భారత సభ ద్వారా యువతను ఆకర్షించడమే కాకుండా వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. చిన్నతనంలో ఐరోపా విప్లవ ఉద్యమాల గురించి చదివి అరాజకవాదం, సామ్యవాదాలకు ఆకర్షితుడయ్యాడు. ఈ స్ఫూర్తితో హిందూస్థాన్ గణతంత్ర సంఘంలో ముఖ్య నాయకుల్లో ఒకడుగా ఎదిగారు. ఆ తర్వాత ఈ సంస్థను హిందూస్థాన్ సామ్యవాద గణతంత్ర సంఘంగా మార్చారు. రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా భగత్‌సింగ్ అఖండ భారతావని మద్దతును కూడగట్టుకున్నాడు. పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన పోలీస్ అధికారి స్కాట్స్ హత్యకు భగత్‌సింగ్ వేసిన పథకం విఫలమైంది. స్కాట్స్ అనుకుని మరో ఎస్ఐ సాండర్స్‌ను హత్య చేశారు. 1929 ఏప్రిల్ 8న పార్లమెంట్ హాల్‌లో పొగ బాంబు విసరడంతో భగత్‌సింగ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. తమ స్వాతంత్ర్య కాంక్షను తెలియజేయడానికే బాంబు వేశాం తప్ప, ఎవరినీ హత్య చేయడానికి కాదంటూ ధైర్యంగా న్యాయస్థానంలోనే ఆయన ప్రకటించారు. భగత్‌సింగ్‌తో పాటు సుఖదేవ్, రాజ్‌గురులు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. పార్లమెంట్ హాల్లో మనుషులు లేని ప్రదేశంలో బాంబు విసిరి భారతీయుల మనోగతాన్ని తెలియజేయాలన్నదే ఈ వీరుల ప్రధానోద్దేశం. అయితే దీన్ని మాత్రం తీవ్రంగా పరిగణించిన బ్రిటిష్ ప్రభుత్వం విచారణ త్వరగా పూర్తిచేసి ఉరిశిక్షను అమలు చేసింది. తన కొడుకును కేసు నుంచి బయటపడేయడానికి భగత్‌సింగ్ తండ్రి చాలా ప్రయత్నించారు. అయితే తండ్రి ప్రయత్నాలను వారించిన భగత్‌సింగ్ దాని వల్ల ప్రయోజనం ఉండదని ఖండితంగా చెప్పాడు. మమ్మల్ని విడిచిపెట్టే ఉద్దేశం బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు కాబట్టి దీనిపై దొంగ సాక్ష్యాలను సృష్టించి విచారణను వేగంగా పూర్తిచేయడానికి ఏర్పాటు చేస్తుందంటూ తెల్లదొరల అంతరంగాన్ని ముందే పసిగట్టి తండ్రికి తెలియజేశారు భగత్‌సింగ్.


> బ్రిటిష్ పాలన అంతంకావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నాటి తరానికే కాదు, నేటి యువతకూ ఆదర్శం. ఉరికంబం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులు, విప్లవం ద్వారా మాత్రమే స్వాతంత్రం సిద్ధించగలదని భావించిన దార్శనికులు.



అనుకున్నట్టుగానే ఈ ముగ్గురు వీరుల్ని బ్రిటిష్ ప్రభుత్వం దోషులుగా నిర్ధారించి ఉరికంబం ఎక్కించింది. మార్చి 23న సెంట్రల్ జైలులో సాయంకాలం 7.33 గంటలకు విప్లవ వీరులను ఉరి తీశారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఉరితాడును ముద్దాడి, ప్రాణత్యాగం చేశారు. నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరి శిక్ష అమలు చేయకూడదు. అందుకే వారి మృతదేహాలను జైలు వెనుక గోడలు పగులగొట్టి రహస్యంగా తీసుకెళ్లి సట్లెజ్ నది తీరాన దహనం చేశారు. మృతదేహాలు ప్రజల కంటబడితే ఉపద్రవం ముంచుకొస్తుందనే ఇలా చేశారు. ఈ యువకిశోరాల త్యాగం ఎప్పటికీ వృథా కాదు. అమరవీరుల్లారా, ఎల్లవేళలా మీరు ప్రతి భారతీయ గుండెల్లో ఉంటారు.

▪ నరేష్ జాటోత్

(నేడు షహీద్ దివస్)



క్యాపిటల్.. గ్యాంబ్లింగ్!

నగర బడ్జెట్‌ను ఏమార్చిన వైసీపీ పాలకపక్షం

క్యాపిటల్ ఆదాయం ఎంత వస్తుందో, ఎంత ఖర్చు పెట్టాలో తెలియని వైనం

రూపాయి రాక :	
రెవెన్యూ ఆదాయం	రూ.808.33 కోట్లు
క్యాపిటల్ ఆదాయం	రూ.454.15 కోట్లు
డిపాజిట్లు, అడ్వాన్సులు	రూ.47.05 కోట్లు
మొత్తం	రూ. 1,309.53 కోట్లు

రూపాయి పోక :	
రెవెన్యూ ఖర్చులు	రూ. 705.95 కోట్లు
క్యాపిటల్ ఖర్చులు	రూ. 691.78 కోట్లు
రుణాల చెల్లింపులు	రూ. 9.80 కోట్లు
డిపాజిట్లు అడ్వాన్సులు	రూ. 47.05 కోట్లు
మొత్తం	రూ. 1454.58 కోట్లు

తప్పుల తడకగా అజెండా

అజెండాలో ముద్రించిన అంకెలది ఒక తీరు. మేయర్ చెప్పిన అంకెలది మరో తీరు. ఈ రెండు కలిసి అధికారులపై మూకుమ్మడి దాడికి దారి తీశాయి. దీనిపై అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏక స్వరాన్ని వినిపిస్తూ అధికారులు చేసిన తప్పులను ఎండగట్టారు. నగర అభివృద్ధిని ప్రతిబింబించేందుకు పునాది అయినా వార్షిక బడ్జెటును ఇంత దారుణంగా రూపొందిస్తే ఎలా అంటూ మండిపడ్డారు. ఒకనొక సమయంలో కౌన్సిల్‌లో అధికార పార్టీ కార్పొరేటర్‌లే బడ్జెట్ తప్పుల తడకలను అధికారుల తీరును ఎండగట్టారు. దీంతో అధికార వైసీపీలో ఇద్దరు కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు వాగ్వివాదానికి దిగారు. మేయర్ కలుగుజేసుకోవడంతో గొడవ సర్దుమణిగింది.

'క్యాపిటల్'ను ఎక్కువగా చూపి భారీ బడ్జెట్‌కు రూపకల్పన

- నూతన ఆర్థిక సంవత్సరంలో రూ.30 కోట్ల మేర ప్రజలపై వడ్డన
- ఆదాయం రూ.1309.53 కోట్లు, ఖర్చు రూ.1,454.58 కోట్లు
- బడ్జెట్‌పై కౌన్సిల్‌లో అధికారపక్షంపై విపక్షాల మాటల దాడి

సభ్యుల అభ్యంతరాల నడుమ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

విజయవాడ నగర పాలక సంస్థ 2025-26 బడ్జెట్‌ను వైసీపీ పాలకపక్షం ఏమార్చింది. ఎంత క్యాపిటల్ ఆదాయం వస్తుందో, ఎంత ఖర్చు పెట్టాలో తెలియకుండా.. వీటినే ఎక్కువగా చూపి భారీ బడ్జెట్‌కు రూపకల్పన చేసింది. నూతన ఆర్థిక సంవత్సరంలో రూ.30 కోట్ల మేర ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమైంది. తప్పుల తడకగా ఉన్న బడ్జెట్‌పై విపక్షలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సభ్యుల అభ్యంతరాల నడుమ బడ్జెట్‌ను ఆమోదించారు. ఇది క్యాపిటల్ గ్యాంబ్లింగ్ బడ్జెట్ అంటూ సభ్యులు విమర్శనాస్త్రాలు సంధించారు.

విజయవాడ/కార్పొరేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశయాలకు అనుగుణమైన బడ్జెట్‌ను తీర్చిదిద్దలేదు. అభివృద్ధి ప్రణాళికలకు నయా పైసా కేటాయింపులు జరపలేదు. కిందటి ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ ఆదాయాలు కేవలం రూ. 91 కోట్లు మాత్రమే రాగా, 2024- 25 ఆర్థిక సంవత్సరంలో రూ.501.41 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంకెల గారడీ చేశారు. తీరా చూస్తే మరికొద్ది రోజుల్లో ముగియబోతున్న ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 292 కోట్లనే క్యాపిటల్ ఆదాయాలుగా చూపించారు. రానున్న 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.454.15 కోట్ల మేర క్యాపిటల్ ఆదాయాలు వస్తాయని చూపారు. వాస్తవంగా క్యాపిటల్ ఆదాయాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్స్, వివిధ పథకాల నిధులను చూపుతారు. గ్రాంట్స్ కొంత మేర వస్తాయి కానీ, కేంద్ర పథకాల నిధులు అయితే ప్రస్తుతం లేవు. మరి ఎలా క్యాపిటల్ ఆదాయాలు వస్తాయో వైసీపీ పాలకపక్షం చెప్పాల్సి ఉంది. ఎంత ఆదాయం వస్తుందో, ఎంత ఖర్చు చేస్తామో తెలియని క్యాపిటల్ ఆదాయాలు, క్యాపిటల్ ఖర్చుల పేరుతో భారీ బడ్జెట్‌కు శ్రీకారం చుట్టి మేము పెద్ద బడ్జెట్ పెట్టాం.. ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవటం వల్ల ఏమీ చేయలేక పోతున్నామని చెప్పుకునేందుకు వీలుగా వైసీపీ మిగతా 6లో..

అవినీతి సఖి

విజయవాడ ప్రభుత్వాస్పత్రి సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అక్రమాలు

గత వైసీపీ హయాంలో రెచ్చిపోయిన పీడీ!


- పోస్టుల దగ్గర నుంచి సేవల వరకు అన్నిటికి వసూలే..
- బాధిత మహిళల రక్షణ గాలికి.. వారి భర్తలకు ఫిర్యాదు కాపీల చేరవేత
- వారి నుంచి భారీగా ఫోన్‌పేల ద్వారా నగదు వసూలు
- బాధిత మహిళల ఫిర్యాదులతో నాడు విచారణ కమిటీ.. నేటికీ చర్యలు శూన్యం
- కూటమి ప్రభుత్వంపైనే బాధితుల ఆశలు

ప్రభుత్వ ఆస్పత్రిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతిమయం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధిత మహిళలకు సాయం దగ్గర నుంచి పోస్టుల భర్తీ వరకు ప్రతి పనిలోనూ పీడీగా పనిచేసిన అధికారి వసూళ్లకు పాల్పడ్డారని విమర్శలు ఉన్నాయి. బాధిత మహిళలకు రక్షణగా ఉండాల్సిన వీరు వారి భర్తలకు సాయం చేస్తూ కేసులు వీగిపోయేలా చేశారనే ఆరోపణలు సైతం ఎదుర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించి.. విచారణ నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకోకుండా వదిలేసిందని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆపదలో ఉన్న మహిళలు మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181కు ఫోన్ చేసినప్పుడు సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో ఆ మహిళలకు రక్షణ కల్పించి వారికి వైద్య సహాయం, లీగల్ సహాయం వంటివి అందించాలి. పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టించి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. బాధితులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఇలా ఆపదలో ఉన్న మహిళలకు ఎంతో విలువైన సేవలందించాల్సిన విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని సఖి వన్‌స్టాప్ సెంటర్ బాధిత మహిళలకు రక్షణ కల్పించకపోగా వారినే భక్షించేలా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి ఆరోపణలు ఉన్న అధికారిణి ఒకరు పీడీగా ఇక్కడ చక్రం తిప్పారు. అనేక అవినీతి ఆరోపణలపై చివరకు ఆమె సస్పెండ్ కూడా అయ్యారు.

నియామకాల్లో అక్రమాలు

ఆవిడ చేసిన అక్రమాల్లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్, కేస్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, మల్టీపర్పస్ వర్కర్లకు సంబంధించి నియామకాలు కూడా ఒకటి. దీనికి సంబంధించి వైసీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నోటిఫికేషన్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ నియామకానికి బేరసారాలు జరిగాయని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ పోస్టు భర్తీ తప్ప మిగిలిన పోస్టులను భర్తీ చేశారు. ఈ మిగిలిన పోస్టులను కూడా కొందరికి అర్హతలు లేని, అనుభవం లేని వారికి, ప్రొవిజినల్ సర్టిఫికెట్లు మిగతా 6లో..



విదేశీ విద్యార్థులపై ఆరా!

ఐదేళ్లుగా అప్‌డేట్ కాని రికార్డులు

ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ఎస్‌బీ

- విజయవాడలో 148 మంది ఉన్నట్టు లెక్కలు
- వారెక్కడున్నారో తెలియక తలలు పట్టుకుంటున్న పోలీసులు

విదేశీలు ఎంతమంది ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు? వాస్తవంగా వాళ్లంతా ఇక్కడ ఉన్నారా? ఒకవేళ ఉంటే ఏ చిరునామాలో ఉంటున్నారు? అంటే సమాధానం దొరకడం ప్రస్తుతం చాలా కష్టంగానే మారింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రికార్డులను అప్‌డేట్ చేయకుండా వదిలేశారు. ఫలితంగా ఇప్పుడు పోలీస్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విదేశీ విద్యార్థులు ఎంతమంది విద్యాభ్యాసం చేస్తున్నారో లెక్కలు మాత్రమే ఉన్నాయి. ఆ విద్యార్థులంతా ఎక్కడున్నారంటే మాత్రం నాలుగు దిక్కులు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఐదేళ్ల కాలంలో అనాథలుగా వదిలేసిన విదేశీయుల రికార్డులను అప్‌డేట్ చేసే పనిలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఉన్నారు. వివిధ దేశాల నుంచి విజయవాడకు ప్రతినిధులు వస్తుంటారు. వివిధ ప్రాజెక్టులపై వచ్చే వారు కొంతమంది ఉంటారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం వచ్చే వారు మరికొంతమంది ఉంటారు. ఈ రెండు కాకుండా పర్యాటక ప్రదేశాలను వీక్షించడానికి కొంతమంది వస్తుంటారు. ఈ మూడు కేటగిరీలో కంటే మొదటి రెండు కేటగిరీల్లో వచ్చే విదేశీలుయులు ఎక్కువగా ఉంటారు.

సమాచార సేకరణ ఏది?

విజయవాడకు చుట్టుపక్కల ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయి. వాటిలో ఉన్నత విద్యను అభ్యసించడానికి ఆఫ్రికా దేశాల నుంచి విద్యార్థులు ఎడ్యుకేషన్ వీసాపై వస్తుంటారు. ఇబ్రహీంపట్నంలో ఉన్న నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటారు. ఇవి కాకుండా గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్‌యూలో మరికొంతమంది వివిధ కోర్సుల్లో చేరతారు. ఇలా విద్యాసంస్థల్లో చేరిన వాళ్లంతా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో ఐవీఎఫ్ఆర్టీ (ఇమిగ్రేషన్ వీసా ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్) విభాగంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. వారు ఏ విద్యాసంస్థలో చదువుతున్నారు, ఏ గ్రూపులో అడ్మిషన్ తీసుకున్నారు, వసతి ఎక్కడ తీసుకున్నారు అన్న వివరాలను ఈ ఐవీఎఫ్ఆర్టీలో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఆ విద్యార్థులపై స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది నిఘా ఉంచుతారు. వారి కదలికలను గమనిస్తుంటారు. ఈ విద్యార్థులు కాకుండా వివిధ ప్రాజెక్టుల పనులపై కొంతమంది విదేశీయులు ఇక్కడికి వస్తుంటారు. వాళ్లంతా స్టార్ హోటళ్లలో బ చేస్తారు. వారికి సంబంధించిన వివరాలను ఐవీఎఫ్ఆర్టీ సిబ్బంది సేకరిస్తారు. వారు హోటళ్లలో దిగింది మొదలు తిరిగి విమానం ఎక్కే వరకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఉన్నతాధికారులకు పంపుతారు. హోటళ్లలో దిగిన తర్వాత రిసెప్షన్‌లో ఫారం మిగతా 6లో..

కీసరలో.. హైడ్రామా

వైసీపీ నాయకుడి ఇంటిని చుట్టిముట్టిన పోలీసులు

- గదిలోకి వెళ్లి డోర్ లాక్ చేసుకున్న జడ్పీటీసీ భర్త వేల్పుల రమేష్
- నోటీసులు ఇవ్వాలని డిమాండ్
- ఇంటి ముందు భార్య బైఠాయింపు
- అర్ధరాత్రి 2 గంటలకూ బయటకు రాని రమేష్



ఇంటి ముందు బైఠాయించిన జెడ్పీటీసీ ప్రశాంతి (ఇన్‌సెట్‌లో) రమేష్

కంచికచర్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల మండల జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి భర్త, వైసీపీ నాయకుడు వేల్పుల రమేష్‌ను అరెస్టు చేసేందుకు కంచికచర్ల పోలీసులు శనివారం ఆయన ఇంటికి వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన ఆయన ఇంట్లోనే ఉండి భార్యతో ఇంట్లో లేడని చెప్పించాడు. పోలీసులను ఇంట్లోకి వెళ్లనీయకుండా జడ్పీటీసీ సభ్యురాలు నిలువరించారు. పోలీసులు ఏ కేసుపై అరెస్టు చేస్తున్నారో చెప్పి, నోటీసులు ఇచ్చి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గదిలోనే రమేష్ ఉండిపోయాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర మండలం బయ్యారం గ్రామానికి చెందిన జోజి అనే వ్యక్తి తన కుమార్తెను కీసర గ్రామానికి చెందిన మిగతా 6లో..



దుర్గగుడిలో 30 నుంచి ఉగాది ఉత్సవాలు

8లో

'ఇస్రో యువ విజ్ఞాన'కు దరఖాస్తుల ఆహ్వానం

- 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- నేటితో దరఖాస్తులకు ఆఖరు

8లో

వికసిత్ జిల్లా సాకారానికి సమష్టి కృషి

- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-19 (ఆదివారం సాయంత్రం)
సహర్ : 04-57 (సోమవారం ఉదయం)

హత్యాయత్నామా.. చోరీ ప్రయత్నమా!

డెర్మటాలజిస్ట్‌ను కత్తితో బెదిరించిన యువకుడు

- కేకలు వేయడంతో చాంబర్ నుంచి పారిపోయిన నిందితుడు
- వెంటాడి పట్టుకున్న బీట్ కానిస్టేబుల్
- కానిస్టేబుల్ చేతికి కత్తి గాయం
- విచారణలో రకరకాల సమాధానాలు ఇస్తున్న నిందితుడు
- వెనుక సుపారీ గ్యాంగ్ ఉన్నట్టు అనుమానం

విజయవాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైద్యుడికి చూపించుకోవడానికి వచ్చిన రోగుల మాదిరిగా అందరితో కలిసి కూర్చుకున్నాడు. కన్సల్టేషన్ ఫీజు చెల్లించాడు. తీరా లోపలకు వెళ్లిన తర్వాత వైద్యుడికి జేబులో నుంచి కత్తి తీసి చూపించాడు. చంపడానికే వచ్చానని బెదిరించాడు. వైద్యుడు పెద్దగా కేకలు వేయడంతో చాంబర్ నుంచి బయటకు పారిపోయాడు. సమీపంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ యువకుడ్ని పట్టుకున్నారు. ఈ ఘటన విజయవాడ నక్కలరోడ్డులో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... నగరానికి చెందిన డాక్టర్ పాలడుగు రాంబాబు ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సూర్యారావుపేటలోని నక్కలరోడ్డులో ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. యథావిధిగానే శుక్రవారం సాయంత్రం రోగులను పరీక్షించడానికి ఆస్పత్రికి వచ్చారు. అపాయింట్‌మెంట్ ప్రకారం ఒక్కో రోగిని రిసెప్షన్‌లో ఉన్న సిబ్బంది లోపలకు పంపుతున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీనివాస నాయక్ అనే యువకుడిని కూడా అతని నంబరు రాగానే సిబ్బంది వైద్యుడి చాంబర్‌లోకి పంపారు.

ఒక జేబులో కత్తి.. మరో జేబులో బుల్లెట్

చాంబర్‌లోకి వచ్చిన శ్రీనివాస నాయక్‌ను వైద్యుడు రాంబాబు సమస్య మిగతా 6లో..

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- కృష్ణాజిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులకు గాయాలు
- వైజ్ఞానిక యాత్రకు వెళ్లి వస్తుండగా ప్రమాదం.. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు వద్ద ఘటన
- వెంటనే ఒంగోలు వెళ్లిన డీఈవో..గాయపడిన వారికి చికిత్స అందించి, స్వస్థలాలకు తరలిస్తున్న అధికారులు


ఉప్పు గుండూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న బస్సు

నాగులుప్పలపాడు/మచిలీపట్నం/పామర్రు /నాగాయలంక /గుడివాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశంజిల్లా నాగులుప్పాడు మండలం ఉప్పుగుండూరు వద్ద ఆగి ఉన్న లారీని ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయినులకు గాయాలయ్యాయి. ఈనెల 19న జిల్లా నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలకు తమిళనాడు, తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఆరుగొలను, గుడివాడ, నాగాయలంక, పెదపులిపాకకు చెందిన ఆరుగురు విద్యార్థులు, మొవ్వ, పామర్రు కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయినులు గాయపడ్డారని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే డీఈవో ఒంగోలుకు వెళ్లారు. గాయపడిన వారికి చికిత్స చేయించి, ప్రత్యేక వాహనంలో స్వస్థలాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గాయాలు కాగా, ఉపాధ్యాయినులకు వెన్నెముకకు గాయాలయ్యాయన్నారు.

పామర్రు హైస్కూల్ ఉపాధ్యాయురాలికి రిమ్స్‌లో చికిత్స

ప్రమాదంలో గాయపడిన కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన సైన్సు ఉపాధ్యాయురాలు రావి లక్ష్మీకుమారి(61) ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పామర్రు నుంచి వెళ్లిన ఇద్దరు విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షేమంగా ఇంటికి చేరుకుంటున్నారు. ప్రమాదం తనను ఆవేదనకు గురిచేసిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలందించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు.

తలగడదీవి విద్యార్థి కోలా లాస్యకు స్వల్ప గాయం

వైజ్ఞానిక యాత్రకు నాగాయలంక నుంచి నలుగురు విద్యార్థులు, తలగడదీవి నుంచి ఇద్దరు వెళ్లారు. వారిలో తలగడదీవికి చెందిన కోలా లాస్యకు కాలికి స్వల్ప గాయమైంది. ప్రథమ చికిత్స చేశాక, అందరూ నాగాయలంక సురక్షితంగా వస్తున్నారని ఎంఈవో రామదాసు తెలిపారు.

గుడివాడ ఏకేటీపీ విద్యార్థినికి కాలికి స్వల్ప గాయం

ఏకేటీపీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని వగురు హైమావతి కుడికాలి యాంకిల్‌కు స్వల్ప గాయమైంది. మరో విద్యార్థిని అబ్దుల్ ఆసియా బేగం ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. హైమావతికి ప్రథమ చికిత్స చేశారు. వీరిద్దరిని గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి తన కారులో గుడివాడకు తీసుకొచ్చారు.

జస్టిస్ రవినాథ్ తిలహరికి ఘన స్వాగతం


కృష్ణా జిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బెల్ అతిథి గృహానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి, కృష్ణాజిల్లా పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరికి శనివారం ఉదయం కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు ఘన స్వాగతం పలికారు. మొక్కలు అందజేశారు. జిల్లా కోర్టు న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయాధికారి ఎ.సత్యానంద్, శ్రీదేవి, ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ రాజా, తహసీల్దార్ మధుసూదనరావు, ఆర్డీవో స్వాతి, మచిలీపట్నం న్యాయస్థానాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.వేణు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

మిమ్మల్ని చంపేస్తాం!

- టీడీపీకి చెందిన కుటుంబానికి వైసీపీ గంజాయి గ్యాంగ్ బెదిరింపులు
- గంజాయి బ్యాచ్‌కు మద్దతుగా ఇద్దరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- పోలీసులను ఆశ్రయించిన జూపూడికి చెందిన బాధిత కుటుంబం


సీఐ ఎ.చంద్రశేఖర్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న దారావతు నాగాంజనేయులు, అతని తల్లి మంగమ్మ

ఇబ్రహీంపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మామీదే కేసు పెడతారా.. మీకెంత ధైర్యం. మిమ్మల్ని చంపేస్తాం! అంటూ వైసీపీ గంజాయి బ్యాచ్ జూపూడి గ్రామంలో టీడీపీకి చెందిన ఓ కుటుంబంపై తన ప్రతాపాన్ని చూపింది. ఇంకా వైసీపీ వాసన పోని ఇద్దరు టాస్క్‌ఫోర్స్ పోలీసుల అండతో టీడీపీ కుటుంబంపై గంజాయి బ్యాచ్ పదే పదే దాడికి పాల్పడుతోంది. గంజాయి బ్యాచ్, వారితో అంటకాగే ఇద్దరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేస్తున్న ఆగడాలు, దాడులు బెదిరింపులు భరించలేక బాధిత టీడీపీ కుటుంబం శనివారం పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఎ.చంద్రశేఖర్‌తో టీడీపీ కార్యకర్త దారావతు నాగాంజనేయులు, అతని తల్లి మంగమ్మలు గ్రామంలోని వైసీపీ గంజాయి బ్యాచ్ వల్ల తమకు ప్రాణహాని ఉందని వాపోయారు. ఇబ్రహీంపట్నంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ డెలివరీ బాయ్ గా పని చేస్తానని, మూడేళ్ల క్రితం వైసీపీని వీడి టీడీపీలో చేరానని చెప్పాడు. పార్టీ మారామనే అక్కసు, పాత కక్ష నేపథ్యంలో ఈనెల 9న గ్రామంలో గంజాయి మత్తులో ఉన్న బాణావతు బలరాం, దారావతు తిరుమల నాయక్ తన ఇంటి మీదకు వచ్చి తన తల్లి మంగమ్మను చేయి పట్టుకొని గుంజారని, అడ్డుకోబోయిన తనను కొట్టారని నాగాంజనేయులు చెప్పాడు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మరో మూడు రోజుల తర్వాత దారావతు ప్రసాద్(ఉపాధి హామి పథకం ఇన్‌చార్జి ఎఫ్ఏ), గోపి, హేమంత్ అనే ముగ్గురు వైసీపీకి చెందిన గంజాయి బ్యాచ్ గంజాయి విక్రయిస్తూ, గంజాయి కొడుతూ పోలీసులకు దొరికారని మరో వ్యక్తి సీతయ్య పరారయ్యాడని తెలిపారు. పోలీసులకు వైసీపీ బ్యాచ్ పట్టుబడేందుకు తాము కారణం అని భావించి రోజూ తమ ఇంటిపై దాడులు చేస్తూ చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈనెల 21న రాత్రి దారావతు వెంకటేశ్వరరావు (రైల్వే ఉద్యోగి) అనే వ్యక్తి తమపై దాడి చేయబోయాడని బాధితులు సీఐకి ఫిర్యాదు చేశారు. వైసీపీ గంజాయి బ్యాచ్‌కు సహకరిస్తూ ఇద్దరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తమకు ఫోన్ చేసి కేసులకు వెళ్లవద్దు రాజీ మార్గంలో పోదాం లేదా ఇబ్బందులు పడతారు అని బెదిరిస్తున్నారని తెలిపారు. గంజాయి బ్యాచ్ బెదిరింపులు, టాస్క్‌ఫోర్స్ పోలీసుల రాజీ వేధింపులు భరించలేకపోతున్నామని, రక్షణ కల్పించాలని బాధిత కుటుంబం సీఐను వేడుకుంది. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధిత కుటుంబానికి రక్షణ కల్పిస్తామని సీఐ హామి ఇచ్చారు.

ప్రసాద్‌ను ఎఫ్ఏగా తీసుకోం...కూలీగా రావచ్చు

జూపూడిలో సీనియర్ మేట్ ప్రసాద్ ఎఫ్ఏగా కొనసాగుతున్నాడు. గంజాయి కేసులో రిమాండ్‌లో ఉన్నందున ఆ పని మరో సీనియర్ మేట్‌కు అప్పగించాం. ప్రసాద్ కేసు నుంచి బయటపడిన అతడ్ని ఎఫ్ఏగా గుర్తించమని కూలీగా ఉండొచ్చు. - ఎంపీడీవో సునీతశర్మ



అడుగంటుతున్న మంచినీటి చెరువు, పాడైపోయిన ఫిల్టర్ బెడ్

పెదకళ్లేపల్లిలో తాగునీటి కష్టాలు

ఫిల్టర్ చేయకుండానే చెరువు నుంచి కుళాయిలకు నీరు విడుదల

- చేతి పంపులపై ఆధారపడుతున్న గ్రామస్థులు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న ఫిల్టర్ బెడ్ల ఏర్పాటు



మురికిగా వస్తున్న కుళాయి నీరు, ఆకుపచ్చగా ఉన్న నీటిని చూపుతున్న మహిళలు

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి): మండలంలోని అతి పెద్ద పంచాయతీ పెదకళ్లేపల్లి. గ్రామంలో 1000 కుటుంబాలు ఉన్నాయి. గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగెకరాల విస్తీర్ణంలో చెరువు ఉన్నప్పటికీ ఫిల్టర్ బెడ్లు పని చేయడం లేదు. దీంతో నేరుగా చెరువు నీటినే కుళాయిలకు వదులుతున్నారు. చెరువులోనే కలుషితమైన నీరు కుళాయిల ద్వారా వచ్చాక దుర్వాసన వస్తోంది. పశువులు తాగేందుకైనా ఉపయోగపడని నీరు కుళాయిల ద్వారా వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. వేసవి కాలం ప్రారంభం కావటంతో చెరువులో నీరు అడుగంటడంతో గ్రామస్థులు మరింత ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా నాంది ఫౌండేషన్‌కు నీరు సరఫరా అవుతోంది. నాంది ఫౌండేషన్ వద్ద కొందరు నీటిని కొనుగోలు చేసి వినియోగించుకుంటున్నారు. గ్రామ శివారుల్లో ఉన్న చేతి పంపులు, బోరుబావులను గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా వచ్చే నీటిని తాగునీటికి, ఇంట్లో అవసరాలకు ఉపయోగించటం మానేశామని చెబుతున్నారు. స్నానం చేస్తే దద్దుర్లు, అంటువ్యాధులు వస్తున్నాయని చెబుతున్నారు.

పదిహేనేళ్ల నుంచి ప్రతిపాదనలు పంపుతున్నా..

రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల వ్యవహారం పదిహేనేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. 2006లో ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేశారు. నాటి నుంచి ఫిల్టర్ బెడ్ల ఏర్పాట్లు, మరమ్మతులకు ఏటా పది లక్షల అంచనా వేసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పంపుతున్నారు. 2023లో రూ.12లక్షలతో ఫిల్టర్ బెడ్ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేశారు. మంజూరయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షలతో మరో అంచనా తయారు చేసి ఎంపీ వల్లభనేని బాలశౌరికి పంపారు. మంజూరు చేయగా, టెండర్లు పిలిచే దశలో ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. నాలుగు పర్యాయాలు అంచనాలు తయారు చేసి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు ఉన్నతాధికారులు, నాయకుల వద్దకు పంపగా, ఎన్నికల కోడ్, ఇతర సమస్యలో నిలిచిపోవటంతో అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాతలు వేసిన పంపులే ఆధారం



గ్రామ శివారుల్లో దాతలు వేసిన చేతి పంపుల వద్ద ఎక్కువ మంది మంచి నీరు తెచ్చుకుంటున్నారు. మెంతి దిబ్బ, పెదకళ్లేపల్లి నుంచి కుమ్మరిపాలెం వెళ్లే రహదారి, మేళ్లమర్రు రహదారుల్లో పంచాయతీ వారు, పలువురు దాతలు పొలాల వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపులు గ్రామస్థుల మంచినీటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి. ప్రధాన గ్రామం నుంచి 2 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు.

కుళాయిల్లో నీరు దుర్వాసన వస్తోంది



పదేళ్ల నుంచి ఫిల్టర్ బెడ్ల మరమ్మతులను అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. గ్రామానికి వచ్చినపుడు మంచినీటి సమస్య ప్రస్తావించగా, అంచనాలు వచ్చాయంటూ కాలం దాటవేస్తున్నారు. గ్రామ శివారుల్లో దాతలు ఏర్పాటు చేసిన చేతి పంపులపై ఎంతకాలం ఆధార పడాలి. అధికారులు మంచినీరు కూడా అందిచలేకపోతున్నారు. కుళాయిల్లో నీరు పసరుగా ఉంది. మురుగునీరులా వచ్చి దుర్వాసన వస్తోంది. - కాలారి రామారావు, గ్రామస్థుడు

చెరువును శుభ్రం చేయాలి



గ్రామానికి మంచినీరు అందిస్తున్న చెరువు అపరిశుభ్రంగా ఉంది. నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. చెరువును శుభ్రం చేసి గ్రామప్రజల అవసరాలకు తగినంత మంచినీటిని అందించాలి. -గంధం చలపతిరావు, గ్రామస్థుడు

అంచనాలు రూపొందించాం



గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి ఫిల్టర్ బెడ్లు నూతనంగా ఏర్పాటు చేసేందుకు రూ.20 లక్షలతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్, ఎంపీ వల్లభనేని బాలశౌరి దృష్టికి తీసుకెళ్లాం. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేదిశగా ప్రయత్నిస్తున్నాం. -అరజా సంధ్యారాణి, సర్పంచ్

క్యాపిటల్.. గ్యాంబ్లింగ్!

(5వ పేజీ తరువాయి)
పాలక పక్షం అంకెల గారడీ చేసింది.

పన్నుపోటు తప్పదు!

క్యాపిటల్ ఖర్చుల విషయానికి వస్తే 2023 - 24 ఆర్థిక సంవత్సరం వచ్చిన క్యాపిటల్ ఆదాయం రూ. 91 కోట్లు కంటే ఎక్కువగా రూ.167 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి రూ. 779.93 కోట్లు ఖర్చుకు కేటాయింపులు జరిపితే కేవలం రూ. 314.48 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. దీనర్థం ఏమిటి ? క్యాపిటల్ ఖర్చులో కూడా సగం పైగా కోత విధించారు. అలాగే పన్నుల వాత కూడా కనిపించకుండా మోపారు. 2025 - 26 వార్షిక బడ్జెట్‌లో పన్నుల ద్వారా ఆదాయం రూ.333 కోట్లుగా చూపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రూ. 303 కోట్ల మేర ఆదాయం సాధించటం జరిగింది. అంటే దీనిని బట్టి చూస్తే నూతన ఆర్థిక సంవత్సరంలో రూ. 30 కోట్ల మేర పన్నుపోటు తప్పదన్నది అర్థమవుతోంది. .

బడ్జెట్‌పై కౌన్సిల్‌లో ధూమ్ ధామ్

విజయవాడ నగర వార్షిక బడ్జెట్ 2025-26 సమావేశం శనివారం కౌన్సిల్ హాలులో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. బడ్జెట్ నగరాభివృద్ధిని పెంపొందించే విధంగా లేదని ప్రతిపక్షాలు బడ్జెట్‌పై గొడవ చేశాయి. ప్రతిపక్షాల అభ్యంతరాల నడుమ అధికార వైసీపీ రూ.1,309.53 కోట్ల వార్షిక బడ్జెట్‌ను వీఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించింది. బడ్జెట్‌లో ప్రజలపై పన్నుల భారం లేదని, అభివృద్ధి, సుందరీకరణ, పచ్చదనం, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు.

కన్సల్టెంట్ల ఖర్చుపై విపక్షాల ఆందోళన

నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పలువురు సీనియర్ ఇంజనీర్‌లు ఉన్నారు. డ్రాఫ్టులు, డీపీఆర్ తయారు చేయటానికి కన్సల్‌టెంట్‌లకు రూ.3.41 కోట్ల చెల్లించడం ఏమిటని టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. ప్రజాధనం ఇలా వృథాగా ఖర్చు చేయడం సరికాదన్నారు. కొండప్రాంతాల అభివృద్ధికి కేటాయింపులు సక్రమంగా చేయలేదని, నగరంలో సుమారు 22 డివిజన్‌లు కొండ ప్రాంతాల్లోనే ఉన్నాయని, వాటి అభివృద్ధికి కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయని టీడీపీ, సీపీఎం ఫ్లోర్‌లీడర్లు నెలిబండ్ల బాలస్వామి, బోయి సత్యబాబు ఆరోపించారు.

అంచనాలు ఆకాశంలో.. అభివృద్ధి పాతాళంలో



వైసీపీ పాలకవర్గం ప్రవేశ పెట్టిన బడ్జెట్ గతంలో ఎన్నడూ చూడలేదు. నగరం పూర్తి స్థాయిలో అభివృద్ధి అయినట్లు మేయర్ ప్రసంగిస్తున్నారు. అంచనాలు ఆకాశంలో, వ్యయాలు, అభివృద్ధి పాతాళంలో ఉన్నట్లుగా బడ్జెట్ ఉంది. ప్రజలపై భారాలు మోపే బడ్జెట్ ఇది. క్రీడాకారులపై భారాలు మోపుతున్నారు. రాజీవ్‌గాంధీ పార్కు, కె.ఎల్‌రావు పార్కు, రాఘవయ్య పార్కు ప్రవేశ రుసుం ఎక్కువగా ఉంది. వెంటనే తగ్గించాలి. ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించడానికి బడ్జెట్‌ను సవరించాలి. ఈ బడ్జెట్ వలన ప్రజలకు ఎటువంటి ఉపయోగంలేదు. నగరాభివృద్ధి దృష్ట్యా పలు అంశాలకు సంబంధించి బడ్జెట్‌ను సవరణ చేయాలి. -ఎన్.బాలస్వామి, టీడీపీ ఫ్లోర్ లీడర్

భారాల బడ్జెట్ ఇది



ప్రజలపై భారాలు మోపే బడ్జెట్. అంకెల గారడీలా, అభివృద్ధిని కుంటుపర్చేలా ఉంది. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రెండు ఒకేలా వ్యవహరిస్తున్నాయి. నగరాభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించడంలో పాలక పక్షం విఫలమైంది. స్ట్రాం వాటర్ నిధులు రూ.289 కోట్లు ఎమైపోయాయో తెలియదు. ఈ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది ఏమీలేదు. బడ్జెట్‌లో సవరణలు చేసి అన్ని వర్గాల సంక్షేమాన్ని, నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేటాయింపులు చేయాలి. - బోయి సత్యబాబు, సీపీఎం ఫ్లోర్ లీడర్

విదేశీ విద్యార్థులపై ఆరా!

(5వ పేజీ తరువాయి)
'సీ'ని విదేశీయులకు ఇస్తారు. దాన్ని వారు పూర్తిచేసి తిరిగి రిసెప్షన్‌లో ఇస్తారు. ఆ ఫారంను హోటల్ సిబ్బంది స్పెషల్ బ్రాంచ్‌కు పంపుతారు. దీన్ని అప్పటి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

148 మంది వరకు ఉన్నారని లెక్కలు!

విదేశాల నుంచి ఉన్నత విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు కమిషనరేట్ పరిధిలో 148 మంది వరకు ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి. వారు ఎక్కడున్నారన్నది మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. వివిధ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విదేశీ విద్యార్థులు కొంత మంది వాటికి సంబంధించిన హాస్టళ్లలో ఉంటారు. మరికొంతమంది బయట బ్యాచిలర్ రూముల్లో ఉంటారు. విద్యాభ్యాసం పూర్తయి సొంత దేశాలకు వెళ్లినా, ఇక్కడి నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినా కచ్చితంగా ఐవీఎఫ్ఆర్‌ఓలో సమాచారం ఇవ్వాలి. ఆ విద్యార్థులు ఇచ్చినా ఇవ్వకపోయినా వారు ఇచ్చిన చిరునామాలను సిబ్బంది నిరంతరం పరిశీలిస్తుండాలి. ఒకవేళ ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారితే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేయాలి. వైసీపీ పాలన సాగిన ఐదేళ్లలో ఈ ప్రక్రియను పడుకోబెట్టేశారు. విదేశీ విద్యార్థులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించకుండా వదిలేశారు. రికార్డుల ప్రకారం ఉన్న 148 మందిలో కొంతమంది మాత్రమే కమిషనరేట్ పరిధిలో ఉన్నట్టు తేలింది. మిగిలిన వారి చిరునామాలు తెలియడం లేదు. వాళ్లంతా సొంత దేశాలకు వెళ్లిపోయారా, విజయవాడ నుంచి మరో రాష్ట్రానికి వెళ్లిపోయారా అన్న వివరాలు మాత్రం తేలడం లేదు. దీనితో ప్రస్తుతంవ ఐవీఎఫ్ఆర్ఓ సిబ్బంది ఆ వివరాలు తెలియకపోవడంతో తలలు పట్టుకున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారో తేల్చే పనిలో పడ్డారు. నాడు వైసీపీ హయాంలో అధికారులు వదిలేసిన రికార్డులను అప్‌డేట్ చేస్తున్నారు.

అవినీతి సఖి


సామాజిక తనిఖీలో స్టీల్ పేరుతో అడ్వాన్స్ పేమెంట్ చేసినట్టు నివేదిక

(5వ పేజీ తరువాయి)
కూడా చూపలేని వారికి ఇచ్చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారాల కారణంగా.. సఖి వన్‌స్టాప్ సెంటర్ కాస్తా అవినీతి అక్రమాలమయంగా మారిపోయింది.

బాధితులకు నరకమే!

సఖికి సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టు భర్తీ కాకపోవటంతో ఈ పోస్టును మరొకరికి ఇన్‌చార్జిగా ఇచ్చారు. అప్పటి నుంచి ఈ కేంద్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు అన్నీ, ఇన్నీ కాకుండా ఉంటున్నాయి. బాధిత మహిలకు సహాయం చేయాల్సింది పోయి.. వారికే నరకం చూపించే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎందరో మహిళా బాధితులు ఈ సెంటర్‌కు వచ్చినందుకు కన్నీళ్లు పెట్టుకోవాల్సి వచ్చింది. బాధిత మహిళలు చేసే ఫిర్యాదులను ఇక్కడ వారు వారి భర్తలకు చేరవేయటం.. తద్వారా వారి నుంచి డబ్బులు తీసుకోవటమనే సంస్కృతి ప్రబలిపోయిందని పలువురు ఆరోపించారు. రాను రానూ మరింత పరాకాష్టకు చేరుకుంది. భార్యలకు తెలియకుండా వారి ఫిర్యాదు కాపీలను భర్తలకు ఇవ్వటం, భర్తలకు తెలియకుండా వారి ఫిర్యాదు కాపీలను భార్యలకు ఇవ్వటం, సరైన లీగల్ గైడెన్స్ ఇవ్వకపోవటం, ఫిర్యాదు కాపీలు ఒకరివి ఒకరికి మార్చటం ఇలా అత్యంత దారుణంగా ప్రవర్తించారని విమర్శలు వచ్చాయి. ఇలా చేసి అనేక రకాలుగా లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి.

విచారణకు ఆదేశించినా..

ఈ వ్యవహారాలపై పలువురు బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయగా.. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే విచారణకు కూడా ఆదేశించారు. విచారణాధికారిని నియమించారు. ఆయన నివేదికను కూడా ఇవ్వటం జరిగింది. విచారణాధికారి ఇచ్చిన నివేదికను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొక్కిపట్టారు. ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోకపోగా.. ఆరోపణలు వచ్చిన వారికి ఇన్‌చార్జిగా సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టులోనే కొనసాగించటం గమనార్హం. బాధిత మహిళలకు అండగా ఉండాల్సిన సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో అందించాల్సిన సేవల పట్ల ఎలాంటి అవగాహన లేనివాళ్లు, సమాజాన్ని నాశనం చేసే విధంగా వ్యవహరించే వాళ్లు ఉండటం దురదృష్టకరమని పలువురు విమర్శించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఉద్యోగినిపై దాదాపుగా 10 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఫిర్యాదులపై ఆధారాలతో సహా నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోవటం లేదని తెలిసింది. ఆ ఉద్యోగిని ఫోన్‌ను తనిఖీ చేస్తే ఎవరెవరితో ఫోన్ కాల్స్ మాట్లాడటం జరిగింది? ఎవరెవరి నుంచి తన ఖాతాకు డబ్బులు జమ అయ్యాయన్నది తేలుతుందని బాధితులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టి సారించి విచారణ కమిటీని ఏర్పాటు చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే అర్హతల ప్రకారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టును భర్తీ చేయటంతో పాటు మిగిలిన పోస్టుల్లో కొనసాగుతున్న అనర్హులను ఏరివేసి నిబంధనల ప్రకారం అర్హులను నియమించాలని పలువురు కోరుతున్నారు.

కీసరలో.. హైడ్రామా

(5వ పేజీ తరువాయి)
వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. కొద్దిరోజుల క్రితం ఆమె భర్త చనిపోయాడు. పెద్దకర్మకు వచ్చిన జోజి ఆస్తిని తన కుమార్తె పేరున రాయాలని వియ్యంకుడితో వివాదానికి దిగాడు. తనకు ఇంకా పిల్లలు ఉన్నారని, ఇప్పుడే ఆస్తిని రాయలేనని ఆయన చెప్పాడు. దీంతో జోజి నేరుగా రమేష్ వద్దకు వెళ్లాడు. అతడు జోజి వియ్యంకుడిని నిర్బంధించి బలవంతంగా ఆస్తిని అతడి కుమార్తె పేరున రాయించాడు. దీనిపై బాధితులు రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. రమేష్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు ఇంటికి వెళ్లారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రమేష్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని నానా హంగామా చేశాడు. అతని భార్య, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి తన ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఎవరు ఎంత నచ్చజెప్పినా అర్ధరాత్రి ఒంటి గంట వరకు రమేష్ ఇంట్లో నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం నుంచి పోలీసులు అక్కడే ఉన్నారు. ఏ క్షణాన అయినా రమేష్‌ను అరెస్టు చేస్తారని తెలుస్తోంది.

హత్యాయత్నామా..చోరీ ప్రయత్నమా!

(5వ పేజీ తరువాయి)
ఏమిటని ప్రశ్నించారు. వెంటనే శ్రీనివాస్ నాయక్ నిలబడి జేబులో నుంచి కత్తి తీసి చూపించాడు. ఒక్కసారిగా భయపడిన రాంబాబు పెద్దగా కేకలు వేశారు. చాంబర్‌లో ఉంటే దొరికిపోతానన్న భయంతో శ్రీనివాస్ నాయక్ వెంటనే బయటకు పారిపోయాడు. సిబ్బంది కేకలు వేస్తూ శ్రీనివాస్ నాయక్‌ను వెంబడించారు. ఆస్పత్రికి సమీపంలోనే శ్రీధర్స్ కోచింగ్ సెంటర్ ఉంది. ఇక్కడి నుంచి ఆడపిల్లలు హాస్టళ్లకు, ఇళ్లకు వెళ్తుంటారు. వారిని ఆకతాయిలు వేధించకుండా పోలీసులు ఈ మార్గాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి ఆవరణ నుంచి ఒక్కసారిగా కేకలు వేసుకుంటూ సిబ్బంది బయటకు రావడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మహేష్ వెంటాడి శ్రీనివాస్ నాయక్‌ను పట్టుకున్నాడు. ఈక్రమంలో కానిస్టేబుల్‌కు ఎడమచేతి మణికట్టు వద్ద కత్తి తెగడంతో గాయమైంది. వెంటనే ఆ సమీపంలో ఉన్న మహిళా ఎస్ఐ, ఇతర సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడిని తనిఖీ చేయగా ఒక జేబులో కత్తి, మరో జేబులో బుల్లెట్ ఉన్నట్టు గుర్తించారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

అసలు కారణం ఏమిటి?

శ్రీనివాస్ నాయక్ చేతిలో ఆయుధం చూడడంతో తనను హత్య చేయడానికి వచ్చాడని వైద్యుడు రాంబాబు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. లోపలకు వెళ్లిన తర్వాత అతడు కత్తిని చూపించి ఐఫోన్, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. విచారిస్తున్న పోలీసులకు శ్రీనివాస్ నాయక్ గంటకో సమాధానం చెబుతున్నాడు. రాంబాబును హత్య చేయడానికి కొంతమంది సుపారీ ఇచ్చారని ఒకసారి చెప్పాడు. సుపారీ తీసుకుని హత్య చేయడానికి వచ్చానని నిందితుడు చెప్పినట్టు వైద్యుడు పోలీసులకు వివరించాడు. హత్య చేయడానికి వచ్చిన నిందితుడు ఐఫోన్, డబ్బులు ఎందుకు డిమాండ్ చేశాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండింటిని డిమాండ్ చేసి, ఇవ్వడానికి వైద్యుడు నిరాకరిస్తే దాడి చేద్దామన్న ఉద్దేశ్యంతో నిందితుడు ఉన్నాడా అన్న అనుమానం కలుగుతోంది. ప్రభుతా సుపత్రి వద్ద హోటల్ నిర్వహిస్తున్న ఒక మహిళ వైద్యుడి వద్ద ఉన్న ఫోన్‌ను తీసుకురమ్మని పంపినట్టు మరో జవాబు ఇచ్చినట్టు సమాచారం. శ్రీనివాస్ నాయక్ ఈ హోటల్‌లో పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు చెబుతున్న సమాధానాల్లో నిజం ఎంత ఉందో తేల్చే పనిలో సూర్యారావుపేట పోలీసులు నిమగ్నమయ్యారు. శ్రీనివాస్ నాయక్ ఇచ్చిన సమాచారంతో ప్రత్యేక బృందాలు ఆయా కోణాల్లో విచారణ చేస్తున్నాయి. వైద్యుడి వద్దకు వెళ్లిన సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నట్టు సమాచారం.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు

బాలికపై అత్యాచారం కేసులో
మరో నలుగురి అరెస్టు

గన్నవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో మరో నలుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు తెలిపారు. గన్నవరం పోలీస్ స్టేషన్‌లో స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. కొండేటి అనిల్, ఉయ్యూరు నవీన్ కుమార్, పరస సంజయ్ వర్ధన్, పరస రాజశ్‌ను అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ఇంతకు ముందు ఇద్దరిని, ఇప్పుడు నలుగురు, ఇద్దరు మైనర్లతో కలిపి ఈ కేసులో ఉన్న 8 మంది నిందితులనూ అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, హనుమాన్ జంక్షన్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఆత్కూరు ఎస్సై చావా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు స్పెషల్ డ్రైవ్ 25న

బెంజిసర్కిల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఈనెల 25వ తేదీన విద్యాధరపురంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) ట్రైనింగ్ సెంటర్‌లో ఉద్యోగ కల్పన స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కోస్టల్ న్యూమాటిక్ ఏజెన్సీ అండ్ టక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్ వంటి అనేక ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు డ్రైవ్ నిర్వహిస్తాయని ఎన్ఏసీ ఉమ్మడి కృష్ణాజిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.పవన్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తిచేసి 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు హాజరుకావాలని, 97000 25833కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ప్రభుత్వ పనితీరు భేష్ : హేమంత్‌కుమార్

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పనితీరు భేష్‌గా ఉందని, సర్వ శిక్ష అభియాన్ ఒప్పంద ఉపాధ్యాయులకు పది రోజుల ముందే జీతాలు వేయడం హర్షణీయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 948 అంగన్వాడీ హెల్పర్లు, టీచర్ల భర్తీకి పచ్చజెండా ఊపిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో ఇబ్బందిపడిన అంగన్వాడీలకు జీతభత్యాలను రూ. 12వేలకు పెంచడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో మెగా డీఎస్సీ వేస్తామని మంత్రి నారా లోకేశ్ చెప్పడం నిరుద్యోగులకు ఎంతో ఊరటని హేమంత్ కుమార్ పేర్కొన్నారు.




రహదారిపై నిలిపిన బస్సులు, కార్లు, ఆకతాయిల అడ్డాగా మారిన ప్రాంతం

రహదారి ప్రైవేటుపరం

- హైటెన్షన్ వైర్ రోడ్డులో బస్సులు, కార్ల పార్కింగ్
- రాకపోకలకు అంతరాయం

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: పటమట 10వ డివిజన్ ఆయుష్ హాస్పిటల్ నుంచి పంట కాల్వ వెళ్లే హైటెన్షన్ వైర్ రోడ్డు ఆక్రమణకు గురైంది. విశాలమైన రహదారి కావడంతో ప్రైవేటు బస్సులకు అడ్డాగా మారింది. రహదారిపైనే బస్సులు, కార్లు నిలిపి వేయడంతో అటుగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. కొందరు బస్సుల పక్కనే సాయంత్రం పూట బహిరంగంగా మద్యం సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారని, ఆకతాయిలు ఇక్కడ గంజాయి సేవించి గొడవలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో రెండు గ్రూపుల కుమ్ములాటలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో పోలీసులు పహరా ఉన్నా తర్వాత అంతగా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారిపై ఆక్రమణలు తొలగిస్తే ఆకతాయిలను అడ్డుకున్నట్లు అవుతుందని స్థానికులు చెబుతున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సైన్స్ అధికారి హుస్సేన్ తదితరులు

విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో విద్యనభ్యసించాలి

లబ్బీపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో విద్యనభ్యసించి స్వర్ణాంధ్ర 2047 కలలను సాకారం చేయాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్, సమగ్ర శిక్ష ఏఎంవో అశోక్‌లు తెలిపారు. బిషప్ హజరయ్య హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర 2047 సాధించడానికి పీ4(పబ్లిక్, పిపుల్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) ఏవిధంగా ఉపయోగించుకోవచ్చు అనే అంశంపై 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఏఎంవో శిరీషారాణి, నోడల్ ఆఫీసర్ కె.సుధాకర్, జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్‌చైర్స్, స్ట్రెచర్స్ వితరణ

ప్రభుత్వాసుపత్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన స్ట్రెచర్స్, వీల్ చైర్స్‌ను లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ అందించినట్లు శనివారం జీజీహెచ్ పరిపాలనాధికారి జీ.వి.వి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి గతంలో ఏర్పాటు చేసిన వీల్ చైర్స్, స్ట్రెచర్స్ శిథిలావస్థకు చేరడంతో లయన్స్‌క్లబ్ సభ్యులు వాటికి మరమ్మతులు చేయించి ఐదు వీల్ చైర్స్, 17 స్ట్రెచర్స్ అందించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు, అధ్యక్షుడు పి.రామకృష్ణ, కార్యదర్శి ఎం.రవీంద్ర, ట్రెజరర్ ఎస్వీఎస్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయాలని

21వ డివిజన్‌లో సీపీఎం ప్రచారయాత్ర



ప్రచారయాత్రలో సీపీఎం నాయకులు బాబూరావు, దోనేపూడి కాశీనాథ్ తదితరులు

కృష్ణలంక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : 50 ఏళ్లుగా నివాసం వుంటున్న పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు ఇచ్చి శాశ్వత హక్కు కల్పించాలంటూ శనివారం కృష్ణలంక రణదీవెనగర్ కట్టపై సీపీఎం ఆధ్వర్యంలో కృష్ణలంక 21వ డివిజన్‌లో ప్రచారయాత్ర నిర్వహించారు. పలు సమస్యలపై ఈనెల 28న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ ర్యాలీలో సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్‌లు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా నివాసం వుంటున్న కృష్ణా కరకట్ట ప్రాంత ఇళ్లకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఇళ్లు లేని పేదలకు నగరంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని ఈనెల 28న జరగబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పట్టాలు, రిజిస్ట్రేషన్‌లు, ఇళ్లు, తదితర సమస్యలపై ప్రభుత్వాన్ని నిగ్గదీసేందుకు ఈనెల 28న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహా ధర్నాకు లబ్దిదారులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, శ్రీరాములు, కుమార్, గోపి, అప్పలనాయుడు, కసర లక్ష్మణ, గోపాల్, రాజా పాల్గొన్నారు.

పర్యాటక ప్రియులకు దిక్సూచి ట్రావెల్ ఎగ్జిబిషన్

తొలిరోజు భారీగా సందర్శకుల తాకిడి



టూర్ ప్యాకేజీలు గురించి నిర్వాహకుల్ని అడిగి తెలుసుకుంటున్న సందర్శకులు

గవర్నర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రియులకు దిక్సూచిలా విజయవాడలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ (ఐఐటీఈ) పనిచేస్తోంది. ఎంజీ రోడ్డులోని విజయకృష్ణ సూపర్‌బజార్ ప్రాంగణంలోని అమరావతి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ట్రావెల్ ఎగ్జిబిషన్ మొదటి రోజు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. స్టాల్స్‌ను పర్యాటక ప్రియులు ఆసక్తిగా తిలకించారు. దేశీయ పర్యాటక ప్యాకేజీలతో పాటు అంతర్జాతీయ టూర్లకు సంబంధించిన వివరాలను స్టాల్స్ నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

నిర్వాహకులు ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంతో పాటు మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు చెందిన పర్యాటక సంస్థలు ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ట్రావెల్ ఏజెన్సీలు, హోటళ్ళు, రిసార్ట్‌ల వివరాలను నిర్వాహకులు సందర్శకులకు కరపత్రాల రూపంలో అందజేశారు. దేశీయంగా మధ్యప్రదేశ్, అండమాన్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా తదితర ప్రాంతాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో దుబాయి, సింగపూర్, మలేషియా, బాలి, నేపాల్, భూటాన్, స్కాండినేవియా వంటి దేశాల్లో అద్భుత పర్యాటక ప్రాంతాల అనుభూతులను నిర్వాహకులు వివరించారు. వేసవి సెలవులు, వారాంతపు విహారయాత్రలు, హనీమూన్‌లే కాకుండా ఏడాది పొడవునా సెలవుల్లో ప్రయాణాలు, పర్యటనలు చేసే వారికి ఎగ్జిబిషన్ దిక్సూచిలా పనిచేస్తుంది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో విజయవాడ కీలకం కానుందని ఎగ్జిబిషన్ నిర్వాహణ సంస్థ డైరెక్టర్ అనురాగ్ గుప్తా తెలిపారు. ఆదివారం కూడా ఎగ్జిబిషన్ ఉంటుందని, ప్రవేశం పూర్తి ఉచితమని ఆయన తెలిపారు.

డిమాండ్ ఉన్న కోర్సులతోనే ఉపాధి



డాక్టర్ కొల్లేటి రమేష్‌ను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, శాంతిశ్రీ తదితరులు

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిమాండ్ ఉన్న కోర్సులనే అభ్యసిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగుగా ఉంటాయని జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కొల్లేటి రమేష్ అన్నారు. మారిస్ స్టెల్లా కళాశాలలో శనివారం ఎస్సీ,ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఎంపవరింగ్ ఈక్వాలిటీ- స్కీమ్స్ ఫర్ ఎంప్లాయిమెంట్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ రిజర్వ్‌డ్ కేటగిరీ అనే అంశంపై జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. ఉషాకుమారి, ఎస్సీ, ఎస్టీ సెల్‌కన్వీనర్ బి.శాంతిశ్రీ, డాక్టర్ స్వరూపరాణి, అనీలా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆటోనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం ఆటోనగర్ మొదటి రోడ్డు కావేరి లాడ్జి సమీపంలో లభ్యమైనట్లు పటమట పోలీసులు శనివారం తెలిపారు. మృతుడి వయసు (38), వక్కపొడి కలర్ హాఫ్ షర్ట్, నిక్కర్ ధరించి ఉన్నాడని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిస్తే పటమట పోలీసులకు తెలపాలని కోరారు. 0866 254 2333, 83418 25137 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



మూడవ డివిజన్ పరిధిలోని కరెన్సీనగర్ కాలనీ కేతినేని రోడ్డులో గత ఐదు నెలలుగా ఆటో ఒకటి ఆగి ఉంది. దాని గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి సమయంలో ఆకతాయులు మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో వెళ్లే మహిళలను ఇబ్బందుకు గురి చేస్తున్నారు.
- కేవీవీ వెంకటగోపాలరావు, స్థానికుడు
- కేతినేని రోడ్డులో ఉన్న ఆటోని వెంటనే తొలగిస్తాం -రాజేష్, ట్రాఫిక్ పోలీస్ అధికారి

భారతీనగర్, ఆంధ్రజ్యోతి

29న ఉచిత వైద్యశిబిరం

పటమట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటినీ హాస్పటల్ సహకారంతో ఈనెల 29న అశోక్‌నగర్‌లోని సోమనాథ్ ఆసుపత్రిలో ఉచిత గుండె, నరాల వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఛైర్మన్ పోలవరపు విజయ్‌భాస్కర్ తెలిపారు. ఈశిబిరంలో ఈసీజీ, 2డీ ఎకో, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తామని గుండె వైద్య నిపుణులు నరాలశెట్టి అనిల్ తెలిపారు.

నీటి నిల్వలు కాపాడుకోవాలి

ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు

గుణదల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులను గమనిస్తూ నీటి నిల్వలను కాపాడుకుంటేనే మానవ మనుగడకు ఇబ్బంది లేకుండా ఉంటుందని లేకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నీటి సంరక్షణ-మంచు కొండలను కాపాడుకోవడం అనే అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధానంగా ప్లాస్టిక్ వాడకం తగ్గాలని చెప్పారు. నీటిని అవసరాలకు తగ్గట్టుగా పొదుపుగా వాడుకోవాలని చెప్పారు. ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకుంటే నీటి నిల్వలను పెంచవచ్చన్నారు. యువత మొక్కలను పెంచి వాతావరణంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఎస్.కె. బీబీ, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సురేష్, రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్.ఎల్.జానకి, డాక్టర్ ఎస్.ప్రియదర్శిని, డాక్టర్ జి.శైలజ, పి.మధులత, ఎం.జ్యోతి, జి.అనుష తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌ను కలిసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గవర్నర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన 78వ గణతంత్ర వేడుకల్లో పాల్గొని తిరిగివచ్చిన 10 మంది నేషనల్ సోషల్ సర్వీస్ (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు శనివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ రాష్ట్ర ప్రీ రిపబ్లిక్ పరేడ్ కంటెస్టెంట్ లీడర్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ నేతృత్వంలో న్యూఢిల్లీలో 40 రోజుల పాటు పెరేడ్ చేసి వేడుకల్లో పాల్గొన్న వలంటీర్లు తమ అనుభవాలను గవర్నర్‌తో పంచుకున్నారు. గవర్నర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. వేడుకల్లో పాల్గొని రాష్ట్ర గౌరవాన్ని పెంచేందుకు కృషి చేసిన వలంటీర్లను గవర్నర్ అభినందించినట్లు రమేష్ తెలిపారు.

అదనపు కన్స్యూమర్ ఫోరం ప్రారంభం రేపు

విజయవాడ లీగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సిటీ సివిల్ కోర్టుల ఆవరణలోని నూతన బిల్డింగ్ రెండో అంతస్థులో ఈ నెల 24న అదనపు కన్స్యూమర్ ఫోరంను సివిల్‌సప్లైస్ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నట్లు బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి నాదెండ్ల మనోహర్ అదనపు కన్స్యూమర్ ఫోరం ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, కక్షిదారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మోకాళ్ల కీళ్ల మార్పిడిపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ పవన్‌కుమార్, వేదికపై డాక్టర్ సమరం

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్‌లు చేయించుకోవచ్చని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె. పవన్‌కుమార్ అన్నారు. మోకాళ్ల కీళ్ల నొప్పులు-అపోహలు, నిజాలు అనే అంశంపై శనివారం బెంజిసర్కిల్ నాస్తిక కేంద్రంలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన ఆరోగ్య సదస్సు జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ అపోహలతో చాలా మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిపై అవగాహన పెరగాలని సూచించారు. ఆపరేషన్ జరిగిన తర్వాత వ్యాయామం లేదా ఫిజియోథెరపీతో రెండు వారాల్లో పనుల్లోకి వెళ్లవచ్చని ఆయన తెలిపారు.

మంత్రి లోకేశ్ వద్దకు బీసెంట్‌రోడ్ హాకర్ల పంచాయితీ

● సమస్య పరిష్కరించాలని ఎంపీ శివనాథ్‌కు సూచన

వన్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసెంట్‌రోడ్డులో ఇటీవల కొత్తగా కొందరు హాకర్లు రావడం, అప్పటికే అక్కడున్న హాకర్లు అభ్యంతరం చెప్పడంతో చోటు చేసుకున్న వివాదం మంత్రి నారా లోకేశ్ వద్దకు చేరింది. ఇరువర్గాల వెనుక రాజకీయపార్టీల మద్దతు ఉండడంతో సమస్య క్లిష్టతరంగా మారింది. ఇప్పటికే కిక్కిరిసిన హాకర్లతో షాపుల వారికి ఇబ్బందికరంగా మారింది. మరోవైపు కొత్తగా మరికొందరు వస్తే వినియోగదారులు తిరిగే పరిస్థితి ఉండదని, దీంతో బీసెంట్ రోడ్డు వ్యాపారుల సంక్షేమ సంఘం నేతలు, విజయవాడ టెక్స్‌టైల్ రెడీమేడ్ రిటైల్ సంక్షేమ సంఘ నేతలు రెండు రోజుల క్రితం నారా లోకేశ్‌ను కలిసి పరిస్థితి వివరించి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఈ బాధ్యతను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి అప్పగించారు. షాపుల వారిని కూడా ఎంపీని కలవాలని సూచించారు. వ్యాపారస్థులు, హాకర్లతో ఎంపీ సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది.



హీరో ప్రదీప్, హీరోయిన్ దీపికకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రదీప్, దీపిక

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిని అమ్మవారిని 'అక్కడ అమ్మాయి, ఇక్కడ అబ్బాయి' చిత్ర బృందం దర్శించుకుం ది. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాట్లాడుతూ, అక్కడ అమ్మాయి, ఇక్కడ అబ్బాయి సినిమా ఏప్రిల్ 11న విడుదలవుతోందని, దుర్గమ్మ సన్నిధిలో చిత్ర ప్రమోషన్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ ప్రదీప్‌తో కలిసి చిత్రంలో నటించడం సంతోషంగా ఉందన్నారు. తొలుత చిత్ర బృందానికి అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

మహిళ గొంతు కోసి బంగారం చోరీ

● మహిళ పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు



గొల్లపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెడలోని బంగారు గొలు సు కోసం ఓ మహిళ ప్రాణం తీయబోయాడో దుండగుడు. కొండపల్లి అమెరికన్ హాస్పిటల్ వెనుక ఉన్న ఇంట్లో నివాసముంటున్న జూలూరి బాబ్జీ టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తుంటారు. పై అంతస్తులో ఆయన భార్య రమా (50)పై శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు మెడపై బ్లేడుతో గాయపర్చి బంగారు గొలుసుతో పరారయ్యాడు. భయంతో ఆమె తలుపు గడియ పెట్టుకొని ఇంట్లో ఉండిపోయింది. భ ర్త ఇంటికొచ్చి తలుపు తీసి చూడగా ఆమె రక్తపు మడుగులో ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమెను చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, ఘటనా స్థలానికి లా అండ్ ఆర్డర్ ఏడీసీపీ గున్నం రామకృష్ణ, క్రైం ఏడీసీపీ దుర్గారావు, సీఐ చంద్రశేఖర్‌లు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ చేరుకున్నారు. అడుగడున క్షుణ్ణంగా పరీక్ష చేస్తున్నారు. బాధితురాలి భర్త బాబ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రహదారికి ఇరువైపులా నిలిపిన భారీ టిప్పర్లు

ఎన్టీటీపీఎస్ అకౌంట్స్ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన నిలిపిన వరికోత యంత్రం, వాహనం

రాష్ట్ర గనులశాఖ ఎదుట నిలిపిన పాడైన లారీ

పార్కింగ్‌తో పరేషాన్..!

పార్కింగ్ ప్రదేశంగా మారిపోయిన ఎన్టీటీపీఎస్ పాత గేటు రోడ్డు

- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంక్‌లతో రద్దీ
- ఇరువైపులా పాడైన వాహనాలు, పనుల నిమిత్తం వచ్చే వాహనాల నిలుపుదల
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయం గుప్పెట్లో స్థానికులు
- చెత్త శుద్ధికీ అవరోధమే..!

ఇబ్రహీంపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వీటీపీఎస్ పాత గేటుకెళ్లే రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఎందుకంటే ఈ రోడ్డులోనే ఎస్‌బీఐ, యూనియన్, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రెండు ప్రైవేటు స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాల, తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాలు, మైనింగ్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్, రాష్ట్ర గనులశాఖ కార్యాలయం, ఎన్టీటీపీఎస్ క్వార్టర్స్, ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు, ఎన్టీటీపీఎస్ అకౌంట్స్ ఆఫీసులు ఉన్నాయి. అయితే ఈ రోడ్డును కొందరు వ్యక్తులు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. కొందరు వాహనాల యజమానులు తమ టిప్పర్లను పదుల సంఖ్యలో రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. అంతేకా పాడైన వాహనాలను కూడా అక్కడే నిలిపేశారు. ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా కార్యాలయాలకు, బ్యాంకులకు, పాఠశాలలకు వెళ్లేచోట్ల తప్ప మిగిలిన ప్రదేశమంతా కిలోమీటర్ దూరంలో వరుసగా పదుల సంఖ్యలో భారీ వాహనాలు, పాడైన వాహనాలు నిలిపి ఉండటం శోచనీయం. పోలీస్‌స్టేషన్, గనులశాఖ వద్ద నిలిపిన వాహనాలు కేసుల్లో ఇరుక్కొని ఉన్నట్టయితే వాటిని ఎక్కడైనా నిలపాలే కానీ ఇలా రోడ్డు వెంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా నిలపడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహనాలు నిలిపిన చోట చెత్త సేకరణ కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలున్నాయి. కొన్నిచోట్ల కుండీలు లేవు. దీంతో సమీపంలోని క్వార్టర్స్‌లో ఉండేవారు, నివాసితులు తమ చెత్తను ఆ వాహనాల మధ్యలో వేస్తున్నారు. తర్వాతి రోజున ఆ చెత్తను తొలగించేలోపు కుక్కలు చిందరవందరగా చేస్తున్నాయి. వాటి మధ్యలో నుంచి ఎప్పుడు ఏ కుక్కలు, ఆవులు సడన్‌గా రోడ్డు మీదకు వస్తాయో తెలియని పరిస్థితి. అంతేకాక ఆయా కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చేవారు, రోడ్డు పక్కనే ఉన్న స్కూళ్ల నుంచి వచ్చే విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందో అర్థం కాని పరిస్థితి. రెవెన్యూ అధికారులు కానీ, పోలీస్ అధికారులు కానీ తమకేం పట్టనట్టు చూసుకుంటూ తిరుగుతున్నారే తప్ప వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా నిలిపిన వాహనాలను తొలగించాలని వారు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపి 20 టైర్ల లారీ

సహజీవనం చేస్తున్న మహిళపై పెట్రోలు పోసి నిప్పు

చిట్టినగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సహజీవనం సాగిస్తున్న మహిళపై అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పు అంటించిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ సమీపంలో వీర్ల చంద్రకళ (48) నివాసం ఉంటుంది. ఆమెకు గతంలో ప్రసాద్ అనే వ్యక్తితో వివాహమైంది. ఇద్దరు కుమారులు. 2008లో ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. చంద్రకళ వంట పని వద్ద పరిచయమైన తుమ్మపల్లి పుల్లారావుతో సహజీవనం చేస్తోంది. వీరిద్దరు కేఎల్ రావు నగర్ కుండల మార్కెట్ ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. మద్యం అలవాటున్న పుల్లారావు చంద్రకళను డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. మూడు రోజుల క్రితం చంద్రకళతో గొడవ పడి చంపేస్తానని బెదిరించాడు. 21న శుక్రవారం చంద్రకళ ఇంటి సమీపంలోని ఇనుప కొట్టుకు పనికి వెళ్లగా, పుల్లారావు ఇంటికొచ్చాడు. అయితే ఇంట్లో చంద్రకళ లేకపోవడంతో వెంటనే ఆమెకు ఫోన్ చేసి తనకు ఆరోగ్యం సరిగా లేదని, ఇంటికి రావాలని కోరాడు. రాత్రి ఇద్దరు భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున నిద్రలో ఉన్న చంద్రకళపై పుల్లారావు పెట్రోల్ పోశాడు. వెంటనే తేరుకునేలోగా అగ్గిపుల్ల వెలిగించి పడేశాడు. ఒంటిపై మంటలతో కేకలేసిన చంద్రకళ, బాత్రూమ్ వద్దకు చేరుకుని నీళ్లు పోసుకునేందుకు ప్రయత్నించింది. సాధ్యం కాకపోవడంతో రోడ్డుపైకి వచ్చి కేకలు పెట్టడంతో చుట్టుపక్కల మంటలను ఆర్పి 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గగుడిలో 30 నుంచి ఉగాది ఉత్సవాలు

● ఏప్రిల్ 7న శ్రీరామనవమి

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో ఈనెల 30 నుంచి ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కే రామచంద్ర మోహన్ పూజాదికాల విశేషాలను పత్రికా ప్రకటనలో వివరించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఈనెల 30న దుర్గమ్మకు సుప్రభాతం అనంతరం స్నపన కార్యక్రమా న్ని నిర్వహించనున్నారు. ఉదయం అంతరాలయంలో నిర్వహించే సు ప్రభాత సేవ, వస్త్రాలంకరణ, ఖడ్గమాల, యాగశాలలో నిర్వహించే రుద్రహోమం రద్దు చేశారు. 31 నుంచి ఆర్జిత సేవలన్నీ రెగ్యులర్ షెడ్యూలు మేరకు జరుగుతాయి. కాగా ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7 నుంచి వసంత నవరాత్రుల పూజ లు జరుగుతాయి. కొండపైన లక్ష్మీగణపతి స్వామి మందిరం వద్ద రోజుకో ప్రత్యేక పుష్పార్చన జరుగుతుంది. ఈ పుష్పార్చనల్లో దంపతులు పాల్గొనేందుకు రూ.2,500 రుసుం చెల్లించాలి. 7న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, అదేరోజు 10.30 గంటలకు శ్రీరామపట్టాభిషేకం కళావేదికపై నిర్వహిస్తారు. ఉగాది రోజున గంగ, పార్వతీ సమేత మల్లేశ్వర ఉత్సవమూర్తులతో వెండి రథోత్సవం జరుగుతుంది. 30న ఉదయం 9.15 గంటలకు కలశస్థాపన, ప్రత్యేక పుష్పార్చన జ రుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి చ ల్లా శ్రీనివాస శర్మచే పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఏప్రిల్ 5న ఉదయం 6 గంటలకు క్షేత్రపాలకుడు అంజనేయస్వామివారికి, ఘాట్‌రోడ్, అమ్మవారి మెట్లమార్గం వద్ద నాగవల్లీ దళార్చన (తమలపాకులు) జరుగుతుంది. 6న ఉదయం 10 గంటలకు కళావేదికపై శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.



తిరుమల తరహాలో వెంకన్న సేవలు

లబ్బీపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఉదయాస్తమాన సేవలను దర్శించుకుని భక్తులు తరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ నగరశాఖ ఆధ్వర్యంలో ఏ కన్వెన్షన్‌లో 2 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శనివారం ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించారు. సాక్షాత్తు తిరుమలలో జరిగేలా శ్రీవారి సేవలను నిర్వహించారు. ఏ కన్వెన్షన్ ప్రాంగణాన్ని తిరుమల శ్రీవారి ఆలయాన్ని తలపించేలా తీర్చిదిద్దారు, సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, అష్టోత్తర శతకలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారికి నిర్వహించే సేవలను నగరవాసులు దర్శించుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్లబ్ అధ్యక్షులు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ ఆదివారం కూడా సేవలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు ఈ సేవలను దర్శించుకుని తరించాలని అన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు గడువు 25 వరకు పెంపు

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరంలో బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా సబ్సిడీ మంజూరుకు దరఖాస్తులు చేసుకునే గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్టు ఎన్టీఆర్ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఏపీ-ఓబీఎంఎంఎస్ ద్వారా పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

తక్షణమే నూతన అక్రిడిటేషన్ విధానాన్ని ప్రకటించండి

● ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

గాంధీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ నూతన విధానాన్ని తక్షణమే ప్రకటించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీనిపై ఏప్రిల్ 7న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని జిల్లా శాఖలకు పిలుపునిచ్చింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఈ సమావేశం జరిగింది. అసెంబ్లీలో మీడియా సలహా కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. యూనియన్ రాష్ట్ర మహాసభలను ఏప్రిల్ చివరి వరంలో ఒంగోలులో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ. సుబ్బారావు మాట్లాడుతూ ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పరవశింపజేసిన పంచభూతాత్మక నృత్యకేళి

విజయవాడ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పంచభూతాల ప్రభావాన్ని కళ్లకు కట్టి వాటి ప్రాకృతిక సమతుల్యతకి అద్దం పడుతూ నాట్యరీతులు భిన్న విభిన్నాలను తెలియజేస్తూ ప్రదర్శించిన విశాల విశ్వపు ఏకరూపకత అత్యంత వినోదాత్మకంగా రమణీయంగా సాగింది. సిద్ధార్థ అకాడమీ సాంస్కృతిక సంస్థ ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం శనివారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రసప్రపంచం నృత్యరూపకం ప్రదర్శించారు. అనుపమ మోహన్ 'సత్యాంజలి అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్', కేరళ బృందం ఈ కథాత్మక నృత్య ప్రదర్శనతో కనువిందు చేసింది. నాట్యవిశారద అనుపమ మోహన్ కూచిపూడి నృత్య రూపకల్పన చేయగా, మోహినీయాట్టం డాక్టర్ కళా మండలం సుగంధిప్రభు, కేరళనాదనం ప్రొఫెసర్ ఎస్.లేఖా థాంకచి, భరతనాట్యం నాట్యాచార్య ఆర్.ఎల్.వి.ఆనంద్, ఇతర శాస్త్రీ రూపాలను వినీత్ మాస్టర్ సౌష్టవ రూపకల్పన చేశారు. తొలుత సిద్ధార్థ కళాపీఠం ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, ప్రముఖ నృత్య గురువు అనుపమా మోహన్ జ్యోతి ప్రకాశనం చేశారు.

సుస్వరాల సిరి సినీ సంగీత విభావరి

ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో స్వరఝరి సాంస్కృతిక సేవా సమితి, ఒంగోలు వారి సమర్పణలో జరిగిన సినీ సంగీత విభావరి సుస్వరాల సిరులు పండిస్తూ సాగింది. శనివారం సాయంత్రం కౌతా కళావేదికపై చిత్ర గీతాలాపన నిర్వహణ గాయని తాళ్లూరి శ్రీదేవి చేయగా తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాలయ చిట్టిబాబు గాయనీ గాయకులను సత్కరించారు. ఆంజుస్వామి, తాళ్లూరి శ్రీదేవి, అంజిబాబు, గోవింద రవి, తరుణ్, చరణ్ రాజ్, స్వామి, రాజు, తాళ్లూరి రవి, మిలటరీ కోటేశ్వరరావ పాటలను పాడి వినిపించారు. గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, అసెంబ్లీ ఓఎస్‌డీ ప్రభాకరరావు, కోట వెంకటేశ్వరరెడ్డి తదితరులు కళాకారులను అభినందిస్తూ ప్రసంగించారు.

దక్షిణాది హక్కులు కాలరాసేలా బీజేపీ చర్యలు: భార్గవ్

విజయవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మరోసారి అధికారం కోసమే బీజేపీ భాష అంశాన్ని భుజాన వేసుకుందని కాంగ్రెస్ ప్రొఫెషనల్ హెడ్ వల్లూరు భార్గవ్ విమర్శించారు. ఆయన శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాసేలా బీజేపీ చర్యలు ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అధికారం కోసం మతాన్ని ఉపయోగించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ప్రాంతాలు, భాషల పేరుతో విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై నిర్వహిస్తున్న సమావేశాలకు రాష్ట్రం నుంచి మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'మ్యాన్‌హోల్' ముప్పు తప్పింది..!

కంచికచర్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెవిటికల్లు గ్రామంలో అత్యంత ప్రమాదకరంగా, అపరిశుభ్రం గా ఉన్న మంచినీటి పైపు లైన్ సరఫరా వాల్‌బిట్ మ్యాన్‌హోల్‌తో ముప్పు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి నానిబాబు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరసింహారావు మ్యాన్‌హోల్‌ని మురుగును తొలగించి బ్లీచింగ్ చల్లించి శుభ్రం చే యించారు. సిమెంట్ బల్లలతో మ్యాన్‌హోల్‌పై మూతలు ఏర్పాటు చేశారు. చెవిటికల్లు గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



శుభ్రం చేసిన వాల్‌బిట్



జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సెబీ ఈడీ మనోజ్‌కుమార్, ఏఎంఎఫ్ఐ సీఈఓ వెంకట్ ఎన్ చలసాని

భారతీయ మ్యుచువల్ ఫండ్స్ ప్రపంచంలోనే అత్యంత పారదర్శకం

● సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్‌కుమార్

భారతీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత పారదర్శకమైన మ్యుచువల్ ఫండ్ భారతీయ మ్యుచువల్ ఫండ్స్ అ ని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ అన్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ), అసోసియేషన్ ఆఫ్ మ్యు చువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో మెగారిసా (రీజనల్ ఇన్వెస్టర్ సెమినార్ ఫర్ అవేర్‌నెస్) మ్యుచువల్ ఫండ్స్‌పై అవగాహన సదస్సు భారతీనగర్ నోవోటెల్‌లో శనివారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్‌కుమార్, ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ ఎన్ చలసాని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక సంపద సృష్టితో పాటు ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణపై అవగాహనను పెంపొందించేందుకు సెబీ కట్టుబడి ఉంటుందన్నారు. వెంకట్ ఎన్ చలసాని మాట్లాడుతూ దేశంలో 8వ అతి పెద్ద రాష్ట్రమైన ఆంధ్రలో మూడు పారిశ్రామిక కారిడార్లు, 47 స్పెషల్ ఎకనామిక్ జోన్లు, 71 శాతం వర్కింగ్ ఏజ్ ప్రజలు ఉన్నారని, ఈ వృద్ధిని గుర్తించి ఆర్థిక అక్షరాస్యత, రిస్క్ మేనేజ్‌మెంట్, బాధ్యతాయుతమైన ఇన్వెస్టర్లకు అవగాహన పెంపొందించడం ఈ సదస్సు ఉద్దేశమన్నారు. పలువురు ఆర్థిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

వికసిత్ జిల్లా సాకారానికి సమష్టి కృషి

● 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న చైర్మన్ దినకర్, ఎంపీ శివనాథ్, కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన దిశగా ముందడుగు వేద్దామని, లక్ష్యాల సాధనలో అధికారులే రథసారథులని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర ప్రాయోజిక పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ సంకల్పమైన వికసిత్ భారత్-2047, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు రూపమైన స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు తద్వారా వికసిత్ ఎన్టీఆర్ జిల్లా సాకారానికి అవసరమైన కార్యాచరణ, సవాళ్లను అధిగమించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై సమావేశంలో చర్చ జరిగింది. ఉపాధి హామీ పథకం, 2019-24 మధ్య అవకతవకలు, జల్ జీవన్ మిషన్, విజయవాడ బైపాస్ పనుల పురోగతి, అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలు, గ్రామీణసడక్ యోజన, లఖ్‌పతి దీదీ, గరీబ్ కల్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం విశ్వకర్మ యోజన వంటి కేంద్ర ప్రాయోజిక పథకాల అమలు తీరుపై సమావేశంలో చర్చించారు.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం: ఎంపీ

కలిసికట్టుగా సమష్టి కృషితో ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుపుదామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రంలోని 10 సూత్రాలను, 20 సూత్రాల అమలుకు అనుసంధానిస్తూ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో టీం ఎన్టీఆర్ కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో ఏపీ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఇస్రో యువ విజ్ఞాన'కు దరఖాస్తుల ఆహ్వానం

- 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- నేటితో దరఖాస్తులకు ఆఖరు తేదీ
- అర్హత సాధించిన వారికి 14 రోజుల పాటు ఇస్రో కేంద్రంలో అవగాహన

బెంజిసర్కిల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యువ శాస్త్రవేత్తలుగా రాణించాలనే వారికి అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆహ్వానం పలుకుతోంది. యువతకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది యువ విజ్ఞానం (యువికా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టే కార్యక్రమానికి 9వ తరగతి చదివే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనపరిచి ఉంటే 10శాతం వెయిటేజీ, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20శాతం, పట్టణ ప్రాంతాల వారికి 5 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఎంపికైన విద్యార్థులకు ఇస్రో అన్ని వసతులు సమకూరుస్తుంది. ప్రయాణం, భోజన వసతి ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది మే నెలలో 14 రోజులపాటు ఇస్రో అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళుతుంది. సైన్స్‌కు సంబంధించిన విశేషాలు, వింతలతోపాటు రాకెట్ ప్రయోగాలు, పనితీరుపై అవగాహన కల్పించనుంది.



సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఫైల్ ఫొటో)

నేటితో ముగియనున్న ఆఖరి తేదీ

9వ తరగతి విద్యార్థులు ఆదివారంలోపు www.isro.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తులు సమర్పించాలి. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితాను ఇస్రో యువికా విభాగం విడుదల చేస్తుంది. మే 18 నుంచి విద్యార్థులను విడతల వారీగా ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 నిర్వహించి 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ ఆధారంగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తారు.

యువికా నిర్వహించనున్న ప్రాంతాలు

హైదరాబాద్ (తెలంగాణ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్నాటక), డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), షిల్లాంగ్ (మేఘాలయ), అహ్మదాబాద్ (గుజరాత్).




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మిలియన్ డాలర్ సీక్రెట్	రియాల్టీ షో	మార్చి 26విత్
అమెజాన్ ప్రైమ్		
హాలెండ్	ఆంగ్ల చిత్రం	మార్చి 27
జియో హాట్‌స్టార్		
ముఫాసా: ద లయన్ కింగ్	హిందీ చిత్రం	మార్చి 26
జీ5		
విడుదల పార్ట్-2	హిందీ డబ్బింగ్ చిత్రం	మార్చి 28
ఆహా		
ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్	సినిమా(తెలుగు డబ్బింగ్)	మార్చి 26





పారిస్‌లో ఏం జరిగింది?

ధనుష్ నటించిన తొలి హాలీవుడ్ మూవీ 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్. 'హు ట్రాప్డ్ ఇన్ యాన్ ఐకియా వార్డ్‌రోబ్' అనే ఫ్రెంచ్ నవల ఆధారంగా కెన్ స్కాట్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హాలీవుడ్ నటులు బెన్ మిల్లర్, హెరిన్ మోరియాత్రీ కీలక పాత్రల్లో నటించారు. ముంబైకి చెందిన లవశ్‌పటేల్(ధనుష్) స్ట్రీట్ మెజీషియన్. తనకు మంత్ర శక్తులు తెలుసునని అందరినీ నమ్మిస్తుంటాడు. తల్లి మరణానంతరం... పారిస్‌లో ఉన్న తన తండ్రిని వెతుక్కుంటూ వెళ్తాడు. అక్కడ ఊహించని పరిస్థితుల్లో ఐకియా వార్డ్ రోబ్‌లో చిక్కుకుంటాడు. ఆ తర్వాత ఏమైంది అన్న ఆసక్తికరమైన అంశం చుట్టూ కథ సాగుతుంది.



రెక్కలొచ్చాయని ఎగిరిపోయే స్వభావం కాదు

'నాద సుధార్ణవ' అన్నవరపు రామస్వామి... ఒక గాంధర్వ విశ్వవిద్యాలయం. సంగీత విజ్ఞాన పీఠం. వాయులీన వాద్యానికి తన జీవితాన్ని అంకితం చేసి, అనేక దశాబ్దాలపాటు రసజ్ఞులను తన్మయత్వంలో ముంచెత్తిన సుస్వర జ్ఞాని. ఎంత నేర్చినా, ఎన్ని సాధించినా... "నాదేమీ లేదు గురుకృప, నా తల్లితండ్రుల దీవెన" అంటారు వినయంగా.. నేడు నూరో వసంతంలోకి అడుగు పెడుతున్న ఆయనతో ఇష్టాగోష్ఠి... 'నవ్య'కు ప్రత్యేకం.



ముందుగా మీ స్వస్థలం గురించీ, మీ కుటుంబం గురించీ చెబుతారా?

మాది ఏలూరు సమీపంలో ఉన్న సోమవరప్పాడు అనే కుగ్రామం. చిటికిన వేలు కన్నా చిన్న వేలు... మా ఊరు కన్నా చిన్న ఊరు ఉంటాయని నేను అనుకోను. నా తండ్రి పేరు పెద్దయ్య, తల్లి లక్ష్మీదేవి. మా పెద్దన్న శోభ నాద్రి, తరువాత గోపాలం... రేడియోలో ఘట విద్వాంసునిగా పని చేశారు. ఆయన ఒక్క ఘటమే కాదు... డోలు, మోర్సింగ్, తబల, కంజీర కూడా వాయించేవారు. నేను మూడోవాణ్ణి, నాలుగో సోదరుడు వెంకటేశ్వరరావు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేశారు. మరో ఇద్దరు సోదరులు, నలుగురు అక్క చెల్లెళ్ళు.. ఇప్పుడు ఎవరూ లేరు.

ఎంతవరకు చదువుకున్నారు?

(నవ్వుతూ) ఓనమాల వరకూ చదివాను. చాలదా?

సంగీతాభిలాష ఎలా కలిగింది?

మా ఇంట్లో సంగీతం ఎప్పటినుంచో ఉంది. మా తండ్రిగారు నాదస్వరం వాయించేవారు. అన్న గోపాలం డోలు, ఘటం వాయించేవారు. నన్ను పెద్ద విద్వాంసుణ్ణి చేయాలనేది ఆయన కోరిక. మా ఊర్లో మాగంటి జగన్నాథం అనే సంగీతం తెలిసిన మనిషి ఉండేవారు. ఆయనే నా తొలి గురువు. ఆ తరువాత... నాటి ప్రసిద్ధ నాదస్వర విద్వాంసుడు దాలిపర్తి పిచ్చిహరి గారి దగ్గరకు మా అన్నయ్య గోపాలం ఒకసారి నన్ను తీసుకువెళ్ళారు. ఆయన నన్నొక పాట పాడమన్నారు. జగన్నాథం మాస్టారు నేర్పిన పాటొకటి పాడాను. "వీణ్ణి మా గురువు దగ్గర చేర్పు. వృద్ధిలోకి వస్తాడు" అని ఆశీర్వదించారు. ఎవరా గురువు? గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు. అన్నయ్య నన్ను తిన్నగా తీసుకు వెళ్ళి, వారి దగ్గర ప్రవేశపెట్టారు. అది నా జీవితంలో గొప్ప మలుపు. వారు పెద్ద మనసుతో నన్ను శిష్యుడిగా స్వీకరించారు. సంగీత భిక్ష పెట్టారు. అక్కడ అంతా గురుకుల పద్ధతి. ఘనాపాఠీలు వేదం ఎలా నేర్పుతారో... మా గురువుగారు సంగీతం అలా నేర్పేవారు. మధూకర వృత్తి చేసుకుంటూ చదువుకున్నాం. అన్నం దొరకని రోజుల్లో గురువుగారి సతీమణి భోజనం పెట్టేవారు.

అక్కడ ఏదైనా వివక్ష ఎదుర్కొన్నారా?

గురువుగారిది నిప్పులు కడిగే బ్రాహ్మణ్యమే కానీ... శిష్యుల విషయంలో ఆ పట్టింపులేవీ ఉండేవి కావు. కుల, మత, వర్గాలకు అతీతంగా అందరితో అమిత ఆదరంగా ఉండేవారు. బయటకూడా అందరూ నన్ను గౌరవించారు.

మీరు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ సహాధ్యాయులా?

అవును. ఇద్దరం పంతులుగారి దగ్గరే చదువుకున్నాం. బాలమురళి చిన్నతనంలోనే చాలా అద్భుతంగా పాడేవారు. పంతులుగారి శిష్యరికంలో మరింత పదును తేలారు. సక్రమమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే... నవీన దృష్టితో, నూతన కల్పనలతో సంగీతాన్ని కొత్త పుంతలు తొక్కించారు. దాదాపు అన్ని సభల్లో వారికి వయోలిన్ వాద్య సహకారం అందించాను.

ఎవరెవరి సభల్లో సహకారం అందించారు?

ఒకరా, ఇద్దరా! ఉత్తరం, దక్షిణం అనే భేదం లేకుండా దాదాపు అందరూ... సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్, టి.ఆర్. మహాలింగం, బాలమురళి, ఎస్.బాలచందర్, ముక్త, నూకల, మహారాజపురం విశ్వనాథయ్యర్, అరియకుడి రామానుజయ్యంగార్, పండిట్ భీమసేన్ జోషీ, పండిట్ జస్‌రాజ్, పండిట్ వినాయకరావ్ పట్వర్ధన్... ఇలా ఎందరో నన్ను కావాలనుకొనేవారు.

మీరు కొన్ని కొత్త రాగాలు, తాళాలు కనిపెట్టారని, కీర్తనలు రచించారని విన్నాం..!

ఇన్నాళ్ళూ బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ఉన్నాను కదా... అందుకు కృతజ్ఞతగా 'దుర్గ' అనే రాగం, 'వందన' అనే మరో రాగం రూపొందించాను. ఇక తాళం పేరు 'వేదాది'. వేదాలు నాలుగు కదా... అందుకని నాలుగు వేదాల నుంచి నాలుగు జాతులు... త్రిశ, చతురస్ర, మిశ్ర, ఖండ జాతుల సమాహారంగా ఉంటుందది. ఇక ఒక కొత్త వర్ణం... పేరు 'హిందోళం'. 'గురుని పొగడ తరమా'... మా గురువుగారిని స్మరించుకుంటూ ధన్యాసి రాగంలో ఒక కీర్తన, గణపతిని, శారదాంబను, దక్షిణామూర్తిని భజిస్తూ మరొకటి రాశాను.

ఇన్నేళ్ళ సంగీత జీవితంలో ఎన్నో ప్రశంసలు పొందారు. వాటిలో మీరు మరచిపోలేనివి..?

ప్రశంసలన్నీ తియ్యగానే ఉంటాయి. కానీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారు, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్‌ల ప్రశంసలు నా మనసులో స్థిరంగా నిలిచిపోయాయి. "నా తరువాత దేశంలో చాలాకాలం నిలబడేది అన్నవరపు ఒక్కడే" అన్న ద్వారం వారి మాటలు వమ్ము కాకూడదని నేను చేయని సాధన లేదు. అలాగే టీవీలో నా ప్రదర్శన చూసిన సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ వెంటనే మంగళంపల్లికి ఫోన్ చేసి "తిరుక్కోడికావల్ కృష్ణయ్యర్ బాణీ పట్టుకున్నాడు రామస్వామి... ఇక తిరుగులేదు" అని ముచ్చట పడ్డారట. కృష్ణయ్యర్ ఒకప్పుడు ఘనత వహించిన వాయులీన విద్వాంసుడు. "కృష్ణయ్యర్ వయోలిన్ వాయిస్తూ ఉంటే... ఆ ఆరోహణలు, అవరోహణలు... రెక్కలను ఆడించకుండా, శ్రమ పడకుండా, ఠీవిగా, ఆకాశంలో పక్షులు ఎగురుతున్నట్టు ఉండేవి. ఆ గాంభీర్యం, ఆ సంగీత నైపుణ్యం రామస్వామికి అబ్బింది. రామస్వామి చాలా పైస్థాయికి వెళ్ళి, స్వర ప్రస్థానం చేసినా... రాగంలో స్వరశుద్ధికి ఏ మాత్రం భంగం వాటిల్లలేదు" అని సెమ్మంగుడి మెచ్చుకున్నారట. ఇంతకు మించిన ప్రశంసలేముంటాయి?

> "నిరాధార వాద్యంగా, పక్కవాద్యంగా పేరుపడిన వయోలిన్‌కు స్వతంత్రవాద్యంగా స్వయం ప్రతిపత్తినీ, గౌరవాన్నీ కల్పించి, అపురూపమైన వాద్యంగా మలచింది ద్వారం వెంకట స్వామి నాయుడు గారైతే... ఆ గౌరవాన్ని పరిరక్షిస్తూ వచ్చినవారిలో రామస్వామి గారు ముందుంటారు. రామస్వామి గారి వయోలిన్ వాదనంలో కచ్చితత్వం, సున్నితమైన శైలి, శృతిలయల సౌందర్యం ప్రధానంగా కనిపిస్తాయి. మంద్ర, మధ్యమ తార స్థాయిలు మూడిటిలోనూ రామస్వామిగారి నాదం సమతూకంలో ఉంటుందనేది సంగీతం రుచి తెలిసినవారు అనే మాట. 1948లో... విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రారంభమైన తొలినాళ్ళలో, నిలయ విద్వాంసుడిగా చేరిన రామస్వామి.. సుమారు మూడున్నర దశాబ్దాలపాటు అక్కడ పనిచేశారు. అత్యుత్తమ సంగీత విద్వాంసుడిగా రసజ్ఞుల మెప్పు పొందారు."

సంగీత విద్వాంసుల్లో చాలామంది చెన్నై వెళ్లి స్థిరపడ్డారు. మరి మీరెందుకు వెళ్ళలేదు?

'రెక్కలు వచ్చాయి కదా' అని ఎగిరిపోవడం నా స్వభావం కాదు. నేను విజయవాడకు వచ్చాను. ఇక్కడే గురువుగారి దగ్గర విద్య నేర్చుకున్నాను. ఇక్కడే రేడియోలో ముప్పై ఏళ్ళకు పైబడి పని చేశాను. ఇక్కడి నుంచే ఎన్నో దేశాలకు వెళ్ళాను. మా గురువుగారి పద్ధతిలో పైసా తీసుకోకుండా సంగీతం చెప్పాను. ఉన్న ఊరునూ, కన్నతల్లిని వదిలెయ్యకూడదని ఇక్కడే ఉన్నాను.

అలసట లేకుండా మెట్లు ఎక్కి, దిగుతున్నారు. మీ ఆరోగ్య రహస్యం ఏమిటి?

సంగీత సాధన, గురుభక్తి, శిష్యుల పురోభివృద్ధి చూడడం, చేతనైనంతలో పదిమందికీ సాయం చేయడం.. ఇవన్నీ నాకు బలాన్ని ఇస్తున్నాయి. నాకు దేశ, విదేశాల్లో ఎంతోమంది శిష్య ప్రశిష్యులు ఉన్నారు. శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి లాంటి ఆత్మీయ అభిమానులు ఉన్నారు. నేను ఇప్పటికీ సాధన చేస్తున్నాను. పాఠాలు చెబుతున్నాను.

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ తదితర అనేక దేశాల్లో... వందలాది కార్యక్రమాల్లో తన ప్రజ్ఞను రామస్వామి ప్రదర్శించారు. సంగీతం అఖండమనీ, దేశ, కాల, జాతులకు అతీతమైనదనీ నిరూపించారు. భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వారి టి.టి.కె.మెమోరియల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ గౌరవ పురస్కారం... ఆయన పొందిన గౌరవాల్లో కొన్ని.



● ప్రయాగ రామకృష్ణ

సినిమా.. నా మనసు దోచింది

తెలుగులో తొలి చిత్రం 'నన్ను దోచుకుందువటే'తో కుర్రకారు మనసును దోచేశారు నభా నటేష్. 'ఇస్మార్ట్ శంకర్', 'డార్లింగ్స్' తదితర చిత్రాలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రమాదంతో కొంత కాలం సినిమాలకు దూరమైనా.. ఇటీవలే మళ్లీ ముఖానికి రంగు వేసుకున్నారు. ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రాలు 'స్వయంభూ', 'నాగబంధం'లో నటిస్తున్న నభా... 'నవ్య'తో ముచ్చటించారు.

'స్వయంభూ' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

ఇది ఒక పీరియాడిక్ చిత్రం. భారీ బడ్జెట్‌తో పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఎక్కడా ఆగకుండా వేగంగా సాగిపోయే ఈ సినిమా కథలో చాలా లేయర్స్ ఉంటాయి. భరత్ కృష్ణమాచారికి ఇది తొలి సినిమా అయినా, ఎక్కడా తడబడలేదు. సినిమా అద్భుతంగా ఉండబోతోంది. నిఖిల్ చాలా కష్టపడ్డాడు. యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకున్నాడు. ఇందులో నేను క్లాసికల్ డ్యాన్సర్‌గా కనిపిస్తా. ఇటీవలే విడుదల చేసిన నా లుక్‌కు మంచి ప్రశంసలు వచ్చాయి.

మీకు ఇంతకుముందే డ్యాన్స్ వచ్చా? లేక ఈ చిత్రం కోసమే నేర్చుకున్నారా?

నేను చిన్నప్పుడే భరతనాట్యం నేర్చుకున్నాను. అది నాకు ఇప్పుడు చాలా హెల్ప్ అయ్యింది. ప్రత్యేకంగా ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. ఇప్పటివరకు నేను చేసిన క్యారెక్టర్లలో నాకు అత్యంత ఇష్టమైనది ఇదే. ఇందులో నా నటన ప్రేక్షకులకు చాలా కాలం గుర్తుండిపోతుంది.

మీ షూటింగ్ పార్ట్ అయిపోయిందా? ఇందులో మీకు యాక్షన్ సీన్స్ ఉన్నాయా?

అవును, పూర్తయ్యింది. సినిమా షూటింగ్ కూడా దాదాపు పూర్తైపోయింది. గత ఏడాది జనవరిలో షూటింగ్ మొదలైంది. త్వరలోనే విడుదల తేదీనీ ప్రకటిస్తారు. ఇందులో నాకు యాక్షన్ సీన్స్ లేవు.



'నాగబంధం' గురించి చెప్పండి?

అభిషేక్ నామా దర్శకత్వంలో సోషియో ఫాంటసీ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఆద్యంతం మలుపులతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని ఇస్తుంది. ఇందులో నా పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాను మలుపు తిప్పే పాత్ర నాది.

వరుస ప్రాజెక్టులతో హ్యాపీగా సాగిపోతున్న మీ కెరీర్‌ను యాక్సిడెంట్ దెబ్బతీసింది. ఆ సమయంలో మీరు ఎదుర్కొన్న సమస్యలు?

నా జీవితంలో అదో ఊహించని సినిమాటిక్ ట్విస్ట్. అంతా సజావుగా సాగుతున్న సమయంలో ఆ యాక్సిడెంట్ జరగడం చాలా బాధాకరం. కోలుకోవడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. ఆ సమయంలో మానసికంగా చాలా లోగా ఫీల్ అయ్యేదాన్ని. నేను పూర్తిగా రికవర్ కావడంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరిచిపోలేనిది.

కమ్‌బ్యాక్ తర్వాత ఎదుర్కొన్న సవాళ్లేంటి?

నా అభిమానులకు స్క్రీన్‌పై నేను చూపించే ఎనర్జీ లెవెల్స్, చలాకీదనం ఎంతో ఇష్టం. వాటిని తిరిగి నటనలో చూపాలంటే మొదట్లో చాలా కష్టమయ్యేది. మొత్తానికి ఇప్పుడంతా ఓ.కే.

అప్పటిలా వరుస సినిమాలు చేయకుండా కేవలం సెలక్టివ్‌గా చేయడానికి కారణం?

వరుసగా సినిమాలు చేస్తేనే ప్రేక్షకులకు గుర్తుంటాం అనేది అపోహ. మంచి సినిమాల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తే కచ్చితంగా గుర్తిండిపోతాం. అందుకే సెలక్టివ్‌గా సినిమాలను ఎంపిక చేసుకుంటున్నాను.

సినిమా ఫీల్డ్‌లో పోటీ ఎక్కువ. ముఖ్యంగా హీరోయిన్లకి. మీరు ఆ పోటీని తట్టుకుని ఎలా మీ ప్రత్యేకతను నిలబెట్టుకుంటారు?

ఇదో పోటీ ప్రపంచం. ప్రతీ ఫీల్డ్‌లో పోటీ అనేది చాలా సహజం. నేను దాని గురించి అస్సలు పట్టించుకోను. అదో అవరోధం. ఎవరి ప్రత్యేకత వారిది. మన పని మనం చేసుకుంటూ ముందుకు సాగడమే మన చేతుల్లో ఉంటుంది.

నటిగా మీకు ఛాలెంజ్ విసిరిన సినిమాలు? మీ డ్రీం రోల్?

'డార్లింగ్స్' సినిమాలో పాత్ర. అందులోని పాత్ర కోసం బోలెడు వేరియేషన్స్ చూపించాల్సి వచ్చేది. డ్రీం రోల్స్ అంటే చాలా ఉన్నాయి. ఓ నటిగా అన్ని రకాల పాత్రలూ చేయాలనుంది.

సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటారా? దాని వల్ల కొంత ప్రతికూలత కూడా ఉంది. దానిపై మీ అభిప్రాయం?

యాక్టివ్‌గా ఉంటాను. అభిమానులతో టచ్‌లో ఉండడానికి అదో మార్గం. యాక్టింగ్ కెరీర్‌కు సహకరించే మార్గాల్లో సోషల్‌మీడియా ఒకటి. ప్రతీ దాంట్లో మంచి, చెడూ ఉంటాయి. అది మనం వాడే కోణాన్ని బట్టి ఉంటుంది. టూమచ్‌గా ఏది చేసినా హానికరమే కదా.

మీకు పెయింటింగ్ అంటే ఇష్టం కదా. ఈ మధ్య వాటికి తీరిక దొరికిందా?

నటిగా మారాక అంత టైమ్ ఉండేది కాదు. కానీ యాక్సిడెంట్ తర్వాత పెయింటింగ్ కోసం చాలా టైమ్ వెచ్చించా.
అలానే, ట్రావెలింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అప్పుడప్పుడూ రెండు నెలలు విరామం తీసుకుని యూరప్ అలా తిరిగివస్తుంటాను. అక్కడ కూడా వీలుచూసుకుని పెయింటింగ్స్ వేస్తుంటాను.

మీ కోస్టార్స్ చాలా మంది స్పెషల్ సాంగ్స్ చేస్తున్నారు. మీరు కూడా అవి చేయడానికి సిద్ధమేనా?

ఇప్పుడు వస్తున్న సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ కామన్ అయిపోయాయి. ఒకవేళ మంచి సినిమాలో అవకాశం వస్తే ఆలోచిస్తాను.

మీ 'నన్ను దోచుకుందువటే' సినిమా ఉంది కదా. అలా మీ మనసు దోచినవారు ఎవరయినా ఉన్నారా?

అవును, ఉన్నారు. సినిమా నా మనసును దోచేసింది. దాంతో పాటు నా ఫ్యామిలీ మెంబర్స్ ఫ్రెండ్స్ ఫ్యాన్స్.. వీరంతా నా మనసును గెలిచినవారే.

సినిమాల విషయంలో మీ కుటుంబ సభ్యుల సపోర్ట్?

నేను చేసే ప్రతీ సినిమా విషయంలో వారి ప్రోత్సాహం తప్పకుండా ఉంటుంది. నేను చేసే సినిమాల్లో నా నటన గురించి మొదట వారే రివ్యూ ఇస్తారు.



సినిమాల ఫలితం మిమ్మల్ని ప్రభావితం చేస్తుందా?

హిట్, ఫ్లాప్స్‌ను పట్టించుకోవడం అనేది చాలా మందికి ఉన్న సమస్యే. హిట్ వస్తే హ్యాపీ ఫీలవుతాం. ఫెయిల్యూర్ వస్తే దిగాలుపడిపోతాం. కానీ వీటిని అధిగమించి ముందుకు సాగాలి. సినిమా అనేది ఒక్కరి చేతుల్లో ఉండే పని కాదు. 24 క్రాఫ్ట్స్ కలసికట్టుగా పనిచేయాలి, అప్పుడే అనుకున్నవి సాధిస్తాం. నా వరకూ, సినిమాలో నేను చేసిన పాత్రకు ఎన్ని మార్కులు పడ్డాయి. నటిగా ఎంత ఇంప్రూవ్ అయ్యాను అనే విషయాలను మాత్రమే పట్టించుకుంటా.

రోజూ సినిమాలు చూస్తారా? తెలుగులో మీ ఫేవరెట్ హీరోలు ఎవరు?

విడుదలయ్యే సినిమాలన్నీ దాదాపు కవర్ చేస్తా. ఒక్కరంటూ ప్రత్యేకంగా ఎవరూ లేరు. అందరూ ఇష్టమే.

మీ బ్యూటీ సీక్రెట్? ఆరోగ్యం గురించి ఎలాంటి శ్రద్ధ తీసుకుంటారు?

ప్రతీ రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేస్తాను. టైమ్‌కు రెస్ట్ తీసుకోవడం. మంచి ఆహారం తీసుకుంటాను. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటాను. హైదరాబాద్ బిర్యానీ చూస్తే నోరూరిపోతుంది.

● వినాయకరావు

తైలంతో తరగని అందం

సౌందర్య చికిత్సల్లో తైలాలది ప్రత్యేక స్థానం. ఏ తైలాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకుని మసలుకుంటే, తరగని అందాన్ని సొంతం చేసుకోవచ్చు.

గ్రీన్ టీ ఆయిల్: గ్రీన్ టీ ఆకులు, ఆలివ్ ఆయిల్‌ను ఒక జాడీలో వేసుకుని, ఎండచొరబడని, చల్లని ప్రదేశంలో నెల రోజుల పాటు ఉంచితే, గ్రీన్ టీ ఆయిల్ సిద్ధమవుతుంది. ఈ నూనె వెంట్రుకలకు తేమను అందించి, మృదువుగా మార్చి, ఆరోగ్యమైన పెరుగుదలకు తోడ్పడుతుంది. పొడి చర్మం తేమ సంతరించుకోవాలంటే గ్రీన్ టీ నూనెను ముఖానికి పూసుకుని మర్దన చేయాలి.

పసుపు నూనె: కొబ్బరి నూనెకు పసుపు ముద్దను కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. చల్లారిన తర్వాత సీసాలో నిల్వ చేసుకుని ఉపయోగించుకోవాలి. ఈ నూనెతో ముఖం మీద మచ్చలు మటుమాయమవుతాయి. మంగు మచ్చలు కూడా తొలగిపోతాయి. వయసు పైబడే ఛాయలు అదుపులోకి వస్తాయి. నల్లబడిన పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.

క్యారట్ ఆయిల్: నచ్చిన నూనెలో క్యారెట్ ముక్కలను వేసి, నూనె రంగు మారే వరకూ చిన్న మంట మీద ఉడికించి, చల్లార్చి సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ నూనె కుదుళ్లకు పూసుకుంటే వెంట్రుకలు పెరుగుతాయి. ఎండకు దెబ్బతిన్న, కమిలిన చర్మం తిరిగి జీవం సంతరించుకోవాలంటే ఈ నూనెను అప్లై చేసుకోవాలి.



కాఫీ ఆయిల్: కొబ్బరినూనెలో కాఫీ పొడి కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. తర్వాత వడగట్టి వాడుకోవచ్చు. ఈ నూనెను వెంట్రుకలకు పూసుకుంటే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. కళ్ల కింద నలుపు తగ్గడం కోసం రాత్రి నిద్రకు ముందు ఈ నూనును కళ్ల దిగువన అప్లై చేసుకోవాలి. అలాగే స్ట్రెచ్ మార్క్స్‌ను వదిలించడం కోసం ఆయా ప్రదేశాల్లో ఈ నూనె అప్లై చేసి మర్దన చేయాలి.

ఆర్‌సీబీ బోణీ అదిరింది

● కోహ్లీ, సాల్ట్ హాఫ్ సెంచరీలు
● 7 వికెట్లతో కోల్‌కతా చిత్తు
● రహానె శ్రమ వృథా
● క్రునాల్‌కు 3 వికెట్లు



క్రునాల్ పాండ్యా (3/29)



కోహ్లీ (59 నాటౌట్)

కోల్‌కతా: ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అదిరే బోణీ చేసింది. విరాట్ కోహ్లీ (36 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్), ఫిల్ సాల్ట్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56) ధనాధన్ అర్ధ శతకాలతోపాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' క్రునాల్ పాండ్యా (3/29) తిప్పేయడంతో.. శనివారం జరిగిన లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బెంగళూరు 7 వికెట్లతో డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)ను చిత్తు చేసింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 174/8 స్కోరు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానె (56), సునీల్ నరైన్ (44) రాణించారు. హాజెల్‌వుడ్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో బెంగళూరు 16.2 ఓవర్లలో 177/3 స్కోరు చేసి గెలిచింది. సారథి రజత్ పటీదార్ (34) ధాటిగా ఆడాడు.

బాదేసిన సాల్ట్: ఛేదనలో బెంగళూరు ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ చెలరేగడంతో వార్ వన్‌సైడ్‌గా మారింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన సాల్ట్.. మూడో ఓవర్‌లో వైభవ్ బౌలింగ్‌లో 20 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో 4,6,4,4తో 21 పరుగులు పిండుకొన్న సాల్ట్ టీమ్ స్కోరును ఫిఫ్టీ దాటించాడు. కోహ్లీ కూడా వీలుచిక్కినప్పుడల్లా బ్యాట్‌కు పని చెప్పడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి బెంగళూరు 80/0తో గెలుపు దిశగా దూసుకెళ్లింది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను వరుణ్ క్యాచ్ అవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్ (10)ను నరైన్ అవుట్ చేశాడు. అనంతరం వచ్చిన పటీదార్‌తో కలసి కోహ్లీ మూడో వికెట్‌కు 44 రన్స్ జోడించడంతో గెలుపు సులువైంది. బౌండ్రీతో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పటీదార్‌ను వైభవ్ పెవిలియన్ చేర్చాడు. అయితే, విజయానికి 27 బంతుల్లో 13 రన్స్ అవసరమవగా.. లివింగ్‌స్టోన్ (15 నాటౌట్) 4,6,4తో బెంగళూరు 22 బంతులు మిగిలుండగానే గెలిచింది.

రహానె మెరిసినా..: రహానె, నరైన్ రెండో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేసినా.. కీలక వికెట్లను పడగొట్టిన క్రునాల్ కోల్‌కతా జోరుకు బ్రేకులు వేశాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ డికాక్ (4) వికెట్ కోల్పోయింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన రహానె.. మరో ఓపెనర్ నరైన్‌తో కలసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆరో ఓవర్‌లో యశ్ బౌలింగ్‌లో రహానె 4,6,4తో 20 రన్స్ పిండుకోవడంతో పవర్‌ప్లేలో కోల్‌కతా 60/1 స్కోరు చేసింది. సుయాష్ వేసిన 9వ ఓవర్‌లో రహానె అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. నరైన్ 6,4తో ఆ ఓవర్‌లో మొత్తం 22 రన్స్ లభించాయి. అయితే, వరుస ఓవర్లలో నరైన్, రహానె అవుటవడంతో కోల్‌కతా బ్యాటింగ్ కుదుపునకు లోనైంది. నరైన్‌ను సలామ్, రహానెను క్రునాల్ అవుట్ చేయడంతో కోల్‌కతా 11 ఓవర్లలో 110/3తో నిలిచింది. ఈ దశలో బెంగళూరు స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులను కట్టడి చేశారు. వెంకటేష్ అయ్యర్ (6), రింకూ సింగ్ (12)ను కూడా క్రునాల్ వెనక్కిపంపగా..రస్సెల్ (4)ను సుయాష్ బౌల్డ్ చేయడంతో డెత్ ఓవర్లలో కోల్‌కతా 29 పరుగులే చేయగలిగింది. రఘువంశీ (30)ను యశ్.. హర్షిత్(5)ను హాజెల్‌వుడ్ అవుట్ చేశాడు. దీంతో నైట్‌రైడర్స్ కష్టంగా 170 పరుగుల మార్క్ దాటింది.

3 కోల్‌కతాపై వెయ్యికి పైగా పరుగులు చేసిన మూడో ఆటగాడిగా కోహ్లీ. డేవిడ్ వార్నర్ (1093 పరుగులు), రోహిత్ (1070) విరాట్ కంటే ముందున్నారు.

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 4, నరైన్ (సి) జితేశ్ (బి) రసిఖ్ 44, రహానె (సి) రసిఖ్ (బి) క్రునాల్ 56, వెంకటేశ్ (బి) క్రునాల్ 6, రఘువంశీ (సి) జితేశ్ (బి) యశ్ దయాల్ 30, రింకూ (బి) క్రునాల్ 12, రస్సెల్ (బి) సుయాశ్ 4, రమణ్‌దీప్ (నాటౌట్) 6, హర్షిత్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 5, స్పెన్సర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 174/8; వికెట్ల పతనం:** 1-4, 2-107, 3-109, 4-125, 5-145, 6-150, 7-168, 8-173; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 4-0-22-2, యశ్ దయాల్ 3-0-25-1, రసిఖ్ సలామ్ 3-0-35-1, క్రునాల్ పాండ్యా 4-0-29-3, సుయాశ్ శర్మ 4-0-47-1, లివింగ్‌స్టోన్ 2-0-14-0.

బెంగళూరు: సాల్ట్ (సి) స్పెన్సర్ (బి) వరుణ్ 56, కోహ్లీ (నాటౌట్) 59, పడిక్కళ్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 10, పటీదార్ (సి) రింకూ (బి) అరోరా 34, లివింగ్‌స్టోన్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 16.2 ఓవర్లలో 177/3; వికెట్ల పతనం:** 1-95, 2-118, 3-162; **బౌలింగ్:** వైభవ్ అరోరా 3-0-42-1, స్పెన్సర్ జాన్సన్ 2.2-0-31-0, వరుణ్ చక్రవర్తి 4-0-43-1, హర్షిత్ రాణా 3-0-32-0, సునీల్ నరైన్ 4-0-27-1.

అంగరంగ వైభవంగా..



శ్రేయా ఘోషల్



దిశా పటాని

కోల్‌కతా: బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్, క్రికెట్ కింగ్ విరాట్ కోహ్లీ స్టెప్పులు, హుషారెత్తించిన శ్రేయా ఘోషల్ పాటలు..మైమరపించిన దిశా పటాని డ్యాన్స్.. వెరసి ఐపీఎల్ ప్రారంభోత్సవం ఉర్రూతలూగించింది. షారుక్ ఖాన్ ప్రసంగంతో కార్యక్రమం మొదలుకాగా..మా తుఝే సలామ్ అన్న పాటను ఘోషల్ ఆలపించగానే 'వందేమాతరం' అంటూ స్టేడియం యావత్తు ఊగిపోయింది. ఇక..విరాట్ కోహ్లీని వేదికపైకి ఆహ్వానించిన షారుక్ అతడితో కలిసి పఠాన్ సినిమాలోని 'మేరీజాన్' పాటకు నృత్యం చేశాడు. 'లుట్ పుట్ గయా' అన్న పాటకు రింకూసింగ్‌తో కలిసి షారుక్ కాలు కదిపాడు. ర్యాప్ సింగర్ కరణ్ ఔజా తన గాత్రంతో ఫ్యాన్స్‌లో జోష్ నింపాడు. అదిరే డ్రెస్‌తో.. కళ్లు చెదిరే డ్యాన్స్‌తో దిశా పటాని ఫ్యాన్స్‌ను మరో లోకంలోకి తీసుకెళ్లింది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ సహా ఇతర అతిథులను షారుక్ వేదికపైకి ఆహ్వానించాడు. 18 ఏళ్లుగా ఒకే జట్టుకు ఐపీఎల్ ఆడుతున్న విరాట్‌కు మెమెంటోను బిన్నీ ప్రదానం చేశాడు.

ప్రణతి కంచు మోత

జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్ వాల్ట్ ఫైనల్స్‌లో పతకం



న్యూఢిల్లీ: భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. టర్కీలోని అంటాల్యాలో శనివారం జరిగిన వరల్డ్‌కప్ వాల్ట్ ఈవెంట్ ఫైనల్స్‌లో కాంస్య పతకం సాధించింది. వాల్ట్ ఫైనల్స్‌లో ప్రణతి మొత్తం 13.417 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచింది. అమెరికా జిమ్నాస్ట్‌లు జేలా హాంగ్ (13.667)కు స్వర్ణం, క్లెయిర్ పీస్ (13.567)కు రజతం దక్కాయి. కోల్‌కతాకు చెందిన 29 ఏళ్ల ప్రణతికి ఇది ప్రపంచకప్‌లో రెండో పతకం. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఈజిప్టులో జరిగిన వరల్డ్‌కప్‌లోనూ వాల్ట్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గింది. ఇక, 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ప్రణతి కాంస్య పతకాలు కైవసం చేసుకుంది.

గాయత్రి జోడీకి నిరాశ

శంకర్ కూడా.. స్విస్ ఓపెన్

బాసెల్: స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ పోరు పూర్తిగా ముగిసింది. బరిలో మిగిలిన సింగిల్స్ షట్లర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ పోరాటానికి తెరపడింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంకర్ ద్వయం గాయత్రి/ట్రీసా 21-15, 15-21, 12-21తో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ జోడీ లూ షెంగ్ షూ/టాన్ నింగ్ చేతిలో పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన తమిళనాడు కుర్రాడు శంకర్ అదేజోరును తర్వాతి రౌండ్ కొనసాగించలేకపోయాడు. క్వార్టర్‌ఫైనల్లో శంకర్ 10-21, 14-21తో ఫ్రాన్స్‌కు చెందిన పొపోవ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

విశాఖలో మహిళల వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్

సాగరతీరంలో డిసెంబరులో దక్షిణాఫ్రికాతో పురుషుల వన్డే

ముంబై: వచ్చే సెప్టెంబరులో భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ తొలి మ్యాచ్ విశాఖపట్నంలో నిర్వహించనున్నామని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించాడు. విశాఖతోపాటు గువాహటి, ములన్‌పూర్ (పంజాబ్), తిరువనంతపురం, ఇండోర్‌లో టోర్నీ జరగనుంది. అలాగే పన్నెండేళ్ల తర్వాత వెస్టిండీస్ పురుషుల జట్టు టెస్టు సిరీస్ ఆడేందుకు భారత్ రానుంది. అక్టోబరులో విండీస్‌తో 2 టెస్టులు, నవంబరు-డిసెంబరులో దక్షిణాఫ్రికాతో 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20లను స్వదేశంలో భారత్ ఆడనుంది. డిసెంబరు 6న విశాఖలో మూడో వన్డే జరగనుంది.

దులీప్ ట్రోఫీ మళ్లీ పాత పద్ధతిలో..
జోనల్ విధానంలో నిర్వహణ

కోల్‌కతా: దులీప్ ట్రోఫీలో సంప్రదాయ జోనల్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని బీసీసీఐ శనివారం నిర్ణయించింది. దాంతో 2025-26 సీజన్‌లో సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్-ఈస్ట్ జోన్లు ఈ ట్రోఫీకోసం తలపడనున్నాయి. 1961 నుంచి 2014 వరకు దులీప్ ట్రోఫీని జోనల్ విధానంలోనే నిర్వహించారు. కొవిడ్ వల్ల 2020, 2021లో దులీప్ ట్రోఫీ జరగలేదు. 2022, 2023 తిరిగి జోనల్ విధానంలో నిర్వహించారు. కానీ 2024లో.. ఎ,బి,సి,డి జట్లతో దులీప్ ట్రోఫీ జరిగింది.

ఖేలో గేమ్స్‌లో దీప్తికి స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పారా గేమ్స్ రెండో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో మూడు పతకాలను కైవసం చేసుకున్నాయి. న్యూఢిల్లీలో శనివారం జరిగిన పోటీల్లో తెలంగాణ అథ్లెట్లలో దీప్తి జివాంజి 400 మీటర్ల పరుగులో స్వర్ణం, శిరీష 100 మీటర్ల పరుగులో రజతం, కన్నప్ప లాంగ్‌జంప్‌లో కాంస్యం సాధించారు. ఆంధ్ర అథ్లెట్లలో లలితకు 400 మీటర్ల పరుగులో రజతం, 400 మీటర్ల రేసులో నవీన్‌కు రజతం, భవానికి లాంగ్‌జంప్‌లో కాంస్యం లభించాయి.

ఇంగ్లండ్ మహిళల కెప్టెన్
హీదర్‌నైట్ రాజీనామా

లండన్: ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీకి హీదర్‌నైట్ రాజీనామా చేసింది. 2016 జూన్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన 34 ఏళ్ల హీదర్‌నైట్.. ఆ మరుసటి ఏడాదే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌ను విజేతగా నిలబెట్టింది. ఇప్పటిదాకా ఇంగ్లండ్ తరఫున 199 మ్యాచ్‌లకు సారథిగా వ్యవహరించింది.

ఉప్పల్‌లో దంచుడేనా?

● ఫేవరెట్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్
● రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ నేడు



ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్, హెడ్

హైదరాబాద్: విధ్వంసకర బ్యాటర్లు, అనుభవజ్ఞులైన బౌలర్లతో బలంగా ఉన్న గతేడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తాజా సీజన్‌ను విజయంతో ఆరంభించాలనుకొంటోంది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. హెడ్, అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్‌లాంటి పవర్ హిట్టర్లతో ప్రత్యర్థులను బెంబేలెత్తించే బ్యాటింగ్ లైనప్ ఉంది. గాయం నుంచి కోలుకొన్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. కెప్టెన్ కమిన్స్, షమి పేస్ భారాన్ని మోయనుండగా.. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జంపాకు చాన్స్ లభించవచ్చు. సన్‌రైజర్స్‌తో పోల్చితే రాజస్థాన్ కొంత బలహీనంగా కనిపిస్తోంది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ వేలికి గాయమైంది. దీంతో అతడి స్థానంలో పరాగ్ జట్టును నడిపించనున్నాడు.

ఆనవాయితీని బ్రేక్ చేస్తారా?

● చెన్నైతో ముంబై ఢీ
● రాత్రి 7.30 నుంచి



చెన్నై: చెపాక్ స్టేడియంలో ఆదివారం జరిగే బ్లాక్ బస్టర్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తలపడనున్నాయి. మెగా లీగ్‌లో తొలి మ్యాచ్‌లో ఓడే ఆనవాయితీని బ్రేక్ చేయాలని ముంబై పట్టుదలతో ఉండగా.. సొంత మైదానంలో ఘన విజయంతో సీజన్‌ను ఆరంభించాలని చెన్నై భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ధోనీ ప్రధాన ఆకర్షణ. మరోవైపు హార్దిక్ పాండ్యాపై ఒక మ్యాచ్ బ్యాన్ విధించడంతో తాత్కాలిక కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ వ్యవహరించనున్నాడు. రోహిత్, తిలక్ వర్మ, రికెల్టన్‌తో ముంబై బ్యాటింగ్ ప్రత్యర్థికి దీటుగా ఉంది.

ఈఎంఐ చెల్లించలేదా..?

మీ క్రెడిట్ స్కోర్ ఢమాల్!

అప్పును అర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు నిర్దేశిత గడువులోగా తిరిగి చెల్లించడమూ ముఖ్యమే. రుణగ్రహీతలు నెలవారీ వాయిదాల (ఈఎంఐ) ను క్రమం తప్పకుండా చెల్లించాలి. ఈఎంఐ చెల్లింపు జాప్యమైనా, విఫలమైనా మీ క్రెడిట్ స్కోర్‌కు గండి పడుతుంది. భవిష్యత్‌లో మళ్లీ అప్పు పుట్టడం కష్టమవుతుంది. ఎందుకంటే, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎవరికైనా రుణం ఇచ్చే ముందు ఆ వ్యక్తి పరపతి స్థాయిని క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మదిస్తాయి. తర్వాతే ఆ వ్యక్తికి రుణం ఇవ్వాలా..? వద్దా..? అని నిర్ణయం తీసుకుంటాయి. అంతేకాదు, రుణంపై ఎంత వడ్డీ వసూలు చేయాలనేదీ మీ క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుంది.



క్రెడిట్ స్కోర్‌పై ప్రభావమెంత?

ఈఎంఐ చెల్లింపు 30 రోజుల పాటు జాప్యమైతే మీ క్రెడిట్ స్కోర్ 90-100 పాయింట్ల మేర, ఒక్కోసారి అంతకుపైగా తగ్గే ప్రమాదం ఉంది. అంతేకాదు, ఆ జాప్య లావాదేవీ మీ క్రెడిట్ హిస్టరీలో ఓ మరకగా విగిలిపోతుంది. ఒక్క తప్పు భవిష్యత్‌లో మళ్లీ మీకు రుణం లభించడాన్ని దుర్లభంగా మార్చవచ్చు. అలాగే, ఈఎంఐ చెల్లింపులో విఫలమైతే, ఆనక ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈఎంఐ చెల్లింపుల్లో తరచుగా విఫలమైతే, రుణదాత ఆలస్య రుసుము విధించడంతో పాటు వడ్డీ రేటును కూడా పెంచే అవకాశాలుంటాయి. ఈఎంఐ చెల్లింపులను పూర్తిగా నిలిపివేస్తే, రుణదాత నుంచి న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు తనఖా రుణం తీసుకుంటే, తాకట్టులో ఉన్న ఇళ్లు లేదా వాహనాన్ని రుణదాత జప్తు చేసుకోవచ్చు.

15 రోజులకోసారి స్కోర్ అప్‌డేట్

ఇంతక్రితం క్రెడిట్ బ్యూరో రికార్డులు నెలకోసారి అప్‌డేట్ అయ్యేవి. ఈ ఏడాది జనవరి 1 నుంచి రికార్డులను 15 రోజులకోసారి అప్‌డేట్ చేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. తద్వారా రుణగ్రహీతల కార్యకలాపాలు, వారి రుణ నిర్వహణ సమాచారం మరింత వేగంగా అప్‌డేట్ అవుతూ వస్తోంది. అంటే, మీరు ఈఎంఐ చెల్లించడంలో ఏమాత్రం జాప్యమైనా ఆ సమాచారం మీ క్రెడిట్ హిస్టరీలో వెంటనే రికార్డు అవుతుంది. తత్ఫలితంగా మీ స్కోర్ కూడా తగ్గుతుంది.

చెల్లింపు జాప్యమైతే ఏం చేయాలి?

ఆకస్మిక ఆర్థిక అత్యయిక పరిస్థితి కారణంగా సమయానికి ఈఎంఐ చెల్లించడం ఒక్కోసారి సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు, మీ పరిస్థితి గురించి రుణదాతకు వెంటనే సమాచారం అందించి, సర్దుబాటుకు అదనపు గడువు ఇవ్వాలని కోరడం మేలు. మీరు చెప్పిన కారణం సరైనదని అనిపిస్తే, రుణదాత మీ అభ్యర్థనను మన్నించే అవకాశం ఉంటుంది. తద్వారా, ఆ జాప్య చెల్లింపును మీ క్రెడిట్ హిస్టరీలో అప్‌డేట్ కాకుండా, స్కోర్ తగ్గకుండా నివారించేందుకు అవకాశం ఉంటుంది.

క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోండిలా..

తగ్గిన క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోవడానికి సమయం పడుతుంది. ఇందుకు నిలకడ, ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరం. భవిష్యత్‌లో ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులను నిర్దిష్ట గడువులోగా తూ.చ తప్పక చెల్లించాలి. అంతేకాదు, క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి ఉపయోగించకుండా జాగ్రత్తపడాలి. కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వినియోగించుకుంటున్నట్లయితే, సకాలంలోనే బిల్లు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఎందుకంటే, మీరు జీవితంలో రుణాలపైనే అధికంగా ఆధారపడుతున్నారనడానికి అది సంకేతం. సకాలంలో చెల్లింపులతో పాటు మీ క్రెడిట్ రిపోర్టును అప్పుడప్పుడూ చెక్ చేసుకోండి. రికార్డుల్లో ఏవైనా తప్పులుంటూ సంబంధిత క్రెడిట్ బ్యూరోకు వెంటనే ఫిర్యాదు చేయండి. సకాలంలో స్పందించడంతో పాటు ఆర్థిక క్రమశిక్షణతో క్రెడిట్ స్కోర్‌ను మళ్లీ మెరుగుపర్చుకోవడం సాధ్యమే.

బిజినెస్ ప్లస్

మార్చి 31 కౌంట్‌డౌన్ షురూ..

పన్ను ఆదా చర్యలు చేపట్టారా మరి..?

ఈ నెలాఖరుతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇందుకు మరికొన్ని రోజులే మిగిలి ఉంది. మార్చి 31 డెడ్‌లైన్ ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్ను ఆదా చేసేందుకు చివరి అవకాశం కూడా. ఇందుకు మీ ముందున్న ఐదు మార్గాలు..

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు: అధికాదాయం కలిగిన వారు పన్ను రాయితీ ప్రయోజనాలందించే ఆర్థిక పథకాల్లో పెట్టుబడులు పెట్టడం మేలు. ఎందుకంటే, ఆదాయం పన్ను చట్టంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఈక్విటీ అనుసంధానిత పొదుపు పథకాలు (ఈఎల్‌ఎస్‌ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్‌పీఎస్ పెట్టుబడులపైన 80సీసీడీ(1బీ) కింద అదనంగా రూ.50,000 మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వీలుంటుంది. అద్దెకు ఉంటున్న వారిలో ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు లభించనివారు సెక్షన్ 80జీజీ కింద అదనపు మినహాయింపు సైతం క్లెయిమ్ చేసుకోవచ్చు.

రిటర్నులు అందించని పెట్టుబడులకు స్వస్తి: ఈ ఆర్థిక సంవత్సరం ఈక్విటీ ఇన్వెస్టర్లకు అంతగా కలిసిరాలేదు. 2024-25లో నిఫ్టీ కేవలం 3 శాతం వృద్ధిని మాత్రమే కనబరిచింది. ఇలాంటి ప్రతికూల సమయాల్లో అంతగా రిటర్నులు పంచని లేదా నష్టాల్లో ఉన్న ఈక్విటీ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా అధిక ప్రతిఫలాలు లభించిన ఆస్తులపై చెల్లించాల్సిన పన్ను (క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్)ను తగ్గించుకోగలిగే అవకాశాలను సద్వినియోగం చేసుకోండి. అలాగే, పన్ను చెల్లింపుదారులు స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్ల విక్రయంపై రూ.లక్ష వరకు దీర్ఘకాలిక మూలధన ఆర్జన పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలిగే అవకాశాలను పరిశీలించండి. తద్వారా పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఈ పెట్టుబడులపై లాభాలను స్వీకరించవచ్చు.

సకాలంలో ముందస్తు పన్ను చెల్లింపులు: రూ.10,000కు పైగా పన్ను చెల్లించాల్సిన వారు ముందస్తుగా పన్ను చెల్లించడం తప్పనిసరి. ప్రతి త్రైమాసికానికి ఒకసారి చొప్పున నాలుగు విడతల్లో ముందస్తు పన్ను చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. చివరి విడత గడువు మార్చి 15. ఒకవేళ తక్కువగా చెల్లిస్తే, మార్చి 31 నాటికి మిగతా మొత్తాన్ని జమ చేయవచ్చు. ఈ గడువు దాటితే, చెల్లింపులు జరిపే వరకు లేదా ఆదాయం పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించే వరకు నెలకు 1 శాతం వడ్డీ పెనాల్టీ కట్టాల్సి ఉంటుంది.

ఉద్యోగం మారిన పక్షంలో ఆదాయ వివరాల అప్‌డేట్: ఐటీ చట్టంలో నిబంధన 26ఏ ప్రకారం.. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఉద్యోగం మారిన వారు గత సంస్థ నుంచి అందుకున్న ఆదాయాన్ని ఫామ్ 12బీ ద్వారా కొత్తగా చేరిన కంపెనీ మేనేజ్‌మెంట్‌కు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కొత్త యాజమాన్యం మీ జీతం నుంచి సరైన పన్ను మొత్తాన్ని మినహాయించేందుకు ఇది దోహదపడుతుంది. సకాలంలో ఫామ్ 12బీ సమర్పించడం ద్వారా ఆ ఏడాది ఆదాయం వెల్లడిలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రిటర్నుల ఫైలింగ్ సంక్లిష్టం కాకుండా జాగ్రత్తపడవచ్చు.

ఆరోగ్య బీమా కొనుగోలు: ఆరోగ్య బీమా పథకం కొనుగోలుతో వైద్య అత్యవసరాల్లో కవరేజీ లభించడంతో పాటు పన్ను కూడా ఆదా అవుతుంది. సెక్షన్ 80డీ ప్రకారం.. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కోసం చెల్లించిన ప్రీమియంలో సాధారణ వ్యక్తులు రూ.25,000, సీనియర్ సిటిజన్లు రూ.50,000 వరకు పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	105
వరంగల్	101	గుంటూరు	103
కరీంనగర్	101	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	82
కర్నూలు	101	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	105		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,780 ▼	82,300 ▼	1,10,000 ▼
విజయవాడ	90,800 ▼	85,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,170 ▼	80,820 ▼	98,050 ▼
రాజమండ్రి	89,780 ▼	82,300 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	89,900 ▼	83,200 ▼	99,300 ▼
ముంబై	88,169 ▼	80,763 ▼	97,620 ▼

ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్..
కొత్త నిబంధనలు?

ఇదీ GST



రాంబాబు గొండాల

ముంబై కేంద్రంగా ఉన్న ఒక ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల కంపెనీకి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో శాఖలు ఉన్నాయనుకుందాం. ఆ కంపెనీ తన శాఖలలోని అకౌంట్స్‌ను మెరుగుపరచటానికి ఒక సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖలకు పంపింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ముంబైలోని ఒక టెక్నాలజీ సంస్థ నుంచి కొనుగోలు చేశారనుకుందాం. ఇది రాష్ట్ర అంతర్గత సరఫరా కాబట్టి కొనుగోలు సమయంలో దీని మీద సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ చెల్లించింది. దీనిపై క్రెడిట్ తీసుకునే సమయంలో రెండు సమస్యలు వస్తాయి. మొదటిది.. ఇది ఏ ఒక్క శాఖకు పరిమితమైనది కాదు కాబట్టి ఇన్వాయిస్ ఏదైనా ఒక శాఖ పేరు మీద ఇస్తే మిగతా వాటికి క్రెడిట్ తీసుకునే అర్హత ఉండదు. అలాగే చెల్లించిన పన్ను మహారాష్ట్రకు సంబంధించిన సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కాబట్టి వేరే రాష్ట్రంలో చెల్లుబాటు కాదు. దీనికి సమాధానమే 'ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్' (ఐఎస్‌డీ). ఐఎస్‌డీ అనేది సర్వీసులకు సంబంధించి పొందిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను వివిధ శాఖలకు పంచడానికి ఉపకరిస్తుంది. ఒక వ్యాపార సంస్థ మామూలు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా ఐఎస్‌డీ కింద విడిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. సాధారణంగా హెడ్ ఆఫీస్ పేరుతో రిజిస్ట్రేషన్ తీసుకుంటారు. అయితే ఈ ఐఎస్‌డీ విధానం, దీనికి సంబంధించిన విధి, విధానాలు వ్యాపార వర్గాలకు కొత్తేమీ కాదు. ఈ విధానాన్ని వివిధ వ్యాపార వర్గాలు ఇప్పటికే ఉపయోగించుకుంటుండగా.. ప్రభుత్వం కొత్తగా ఈ విధానంలో కొన్ని మార్పులు చేసింది. ఆ వివరాలు మీ కోసం.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి కాదు. వ్యాపార వర్గాలు తమ సౌలభ్యం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. కానీ, కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం ఏదేనీ కంపెనీకి లేదా సంస్థ ఒకే పాన్ సంఖ్యతో ఒకటికి మించి రిజిస్ట్రేషన్స్ ఉంటే ఆ సంస్థ ఐఎస్‌డీ కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలి. జీఎస్‌టీ నియమావళి ప్రకారం ఒక సంస్థ ఎన్ని రాష్ట్రాల్లో ఆఫీస్‌లు, లేదా శాఖలు ఉన్నాయో అన్ని రాష్ట్రాల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఇలా ఒకే పాన్ సంఖ్యతో రిజిస్ట్రేషన్ పొందిన వాటిని జీఎస్‌టీ పరిభాషలో 'డిస్టింక్ట్ పర్సన్స్' అంటారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్త నిబంధన ప్రకారం ఇలాంటి వ్యాపార సంస్థలు అన్ని కచ్చితంగా ఐఎస్‌డీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. అలాగే కామన్‌గా ఉపయోగించే సర్వీసులు అన్ని తప్పనిసరిగా ఐఎస్‌డీ పేరు మీదే పొందాలి. ఇక ఈ ఐఎస్‌డీ, తన పేరు మీద వచ్చిన ఇన్వాయిస్‌లకు సంబంధించిన క్రెడిట్‌ను వివిధ శాఖలకు పంచవలసి ఉంటుంది. దీనికి ఒక పద్ధతి ఉంది. పొందిన సర్వీస్, సంస్థకు సంబంధించిన ఏదైనా ఒక శాఖలో మాత్రమే వాడితే క్రెడిట్ మొత్తం ఆ శాఖకే బదిలీ చేయాలి. అలా కాకుండా ఒకటి కంటే ఎక్కువ శాఖల్లో సర్వీస్‌ను వాడితే గత ఆర్థిక సంవత్సరంలో ఆయా శాఖలు వాటి సంబంధిత రాష్ట్రాల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతంలో జరిపిన టర్నోవర్ మీద ఆధారపడి అదే నిష్పత్తిలో పంచాల్సి ఉంటుంది (గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి కార్యకలాపాలు లేకుంటే గడిచిన త్రైమాసికం తీసుకోవాలి). ఇలా పంచే క్రెడిట్.. ఐజీఎస్‌టీ అయితే అన్ని శాఖలకు ఐజీఎస్‌టీ రూపంలోనే పంచాలి. అలాకాకుండా సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ అయితే అదే రాష్ట్రంలోని శాఖలకు సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ రూపంలో పంచాలి. వేరే రాష్ట్రంలోని శాఖలకు ఐజీఎస్‌టీ రూపంలో పంచాలి.

అంటే పైన చెప్పిన కంపెనీ ఉదాహరణగా తీసుకుంటే ఆ సంస్థ ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది కాబట్టి.. ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ కూడా ముంబై ప్రధాన కార్యాలయం మీద తీసుకుని.. కొనుగోలు చేసిన సాఫ్ట్‌వేర్ ఇన్వాయిస్ ఈ అడ్రస్ మీద తీసుకుందని అనుకుందాం. సరఫరాదారుడు కూడా ముంబైకి చెందిన వ్యక్తి అనుకుంటే, కొనుగోలు సమయంలో చెల్లించిన సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ మహారాష్ట్రలోని శాఖకు పంచేటప్పుడు సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ రూపంలోనే పంచాలి (ఐఎస్‌డీ, ఆ శాఖ రెండు మహారాష్ట్రలోనే ఉన్నాయి కాబట్టి). మహారాష్ట్ర వెలుపలి శాఖలకు పంచే క్రెడిట్ ఐజీఎస్‌టీ రూపంలో పంచాలి. అలాగే వేరే ఏదేనీ రాష్ట్రంలోని శాఖకు రిజిస్ట్రేషన్ లేకున్నా.. ఆ మేర ఇతర శాఖలకు సర్దుబాటు చేయరాదు. ఇకపోతే ఈ ఐఎస్‌డీ కొంతకాలం తర్వాత సరఫరాదారుని నుంచి క్రెడిట్ నోట్ లేదా డెబిట్ నోట్ పొంది క్రెడిట్ సర్దుబాటు చేయాల్సి వస్తే, ఆయా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్స్‌ను కూడా క్రెడిట్‌ను ఏ నిష్పత్తిలో పంచారో అదే నిష్పత్తిలో వివిధ శాఖలకు పంచాల్సి ఉంటుంది.

అయితే పైన నియమ నిబంధనలు ఇప్పటికే అమల్లో ఉండగా.. తప్పనిసరిగా ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ పొందాలనే నిబంధన 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



విక్రమ్, దుషార విజయన్ జంటగా ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీర ధీర శూర'. హెచ్.ఆర్. పిక్చర్స్ బ్యానర్‌పై రియా శిబు నిర్మించారు. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరాముడు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఎన్.వి.ఆర్ సినిమా దక్కించుకుంది. ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విక్రమ్ మాట్లాడుతూ 'మాస్ సినిమాలు చేస్తున్నాను కానీ రస్టిక్‌గా ఉండే సినిమా చేసి చాలా రోజులైంది. యాక్షన్‌తో పాటు మంచి ఎమోషన్ ఉన్న సినిమా ఇది. డైరెక్టర్ అరుణ్ చాలా అద్భుతంగా తెరకెక్కించాడు. ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలవుతుంది. థియేటర్లలో ఆట ప్రారంభాని కంటే ఐదు నిమిషాల ముందే సీట్లలో కూర్చోవాలని ప్రేక్షకులను కోరుతున్నా. తెలుగులో అన్ని రకాల సినిమాలు అద్భుతమైన విజయాన్ని సాధిస్తున్నాయి' అని అన్నారు. నటుడు ఎస్.జె.సూర్య మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఎక్కడున్నా సరే తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. 'రంగస్థలం' లాంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ 'మహారాజా' తర్వాత తెలుగులో చేస్తున్న సినిమా ఇది. కచ్చితంగా హిట్ అవుతుంది. ప్రేక్షకులు కోరుకుంటున్న ఎలిమెంట్స్ అన్నీ ఇందులో ఉన్నాయి' అని అన్నారు.

అది నా అదృష్టం

తమన్నా




హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రలో అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓదెల-2'. సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల కానుంది. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తమన్నా మాట్లాడుతూ "ఓదెల-2' చిత్రం ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమాలో భైరవి పాత్రలో నటించడం నా అదృష్టం' అని అన్నారు. సంపత్ నంది మాట్లాడుతూ 'ఓదెల గ్రామంలో ఒక కష్టం వస్తే ఆ ఊరిలో ఉన్న ఓదెల మల్లన్న నాగ సాధు క్యారెక్టర్ ద్వారా ఎలా పరిష్కరించారనేది ఈ చిత్ర కథ' అని తెలిపారు. నిర్మాత డి.మధు మాట్లాడుతూ 'కంటెంట్‌ని నమ్ముకొని ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించాం' అని చెప్పారు.

ఏదైనా సాధించొచ్చని నిరూపించేలా..



డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్, అలేఖ్య రెడ్డి హీరోహీరోయిన్లు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న ఈ చిత్రం గురించి దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణ మాట్లాడుతూ "దీక్ష, పట్టుదలతో పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చని నిరూపించే చిత్రమిది. ఈ చిత్రం కచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "ఈ చిత్రం నా కెరీర్‌ను మలుపు తిప్పుతుంది" అని కథానాయకుడు కిరణ్ చెప్పారు.



మూడో భాగంతో మళ్లీ వస్తాం

మోహన్ లాల్

మలయాళ నటుడు మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2:ఎంపురాన్'. అంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ మాట్లాడుతూ సినీ ప్రయాణంలో తెలుగు చిత్ర సీమతో ఎంతో అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావుతో నటించే అదృష్టం నాకు దక్కింది. పృథ్వీరాజ్ ఈ చిత్రంతో తెరపై అద్భుతం చేశారు. 'లూసిఫర్'ను మూడు భాగాలుగా తీయాలని అనుకున్నాం. 'ఎంపురాన్' విజయవంతమైతే మూడో భాగంతో మళ్లీ వస్తాం. పాలిటిక్స్, యాక్షన్, ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి' అని తెలిపారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ 'ఇది ఎక్కడా డబ్బింగ్ చిత్రంలా అనిపించదు. నా దృష్టిలో మంచి సినిమా చెడ్డ సినిమా అనేది మాత్రమే ఉంటుంది. చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. నేను మంచి సినిమా తీశానని నమ్ముతున్నాను' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'పృథ్వీరాజ్ సుకుమారన్ పాన్ ఇండియా డైరెక్టర్ కాబోతున్నారు. అన్ని భాషల్లో ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

హ్యాకింగ్ మోసాలపై...



ప్రపంచాన్ని వణికిస్తున్న హ్యాకింగ్ మోసాలపై నూతన దర్శకద్వయం నరేశ్ దోనే, మణివరన్ ఓటీటీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రావూరి సురేశ్ బాబు నిర్మాత. ఈ సందర్భంగా తెనాలిలో జరిగిన విలేకరుల సమావేశంలో 'మా-ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా చిత్ర విశేషాలను పంచుకున్నారు. దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ పోలీసులకు హ్యాకింగ్ మోసాలు సవాలుగా మారినందువల్లనే ఈ నూతన కథాంశాన్ని ఎంపిక చేసుకున్నామని చెప్పారు. ఈ ఓటీటీ చిత్రాన్ని తమిళం, కన్నడ, హిందీ భాషల్లోకి డబ్బింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిత్ర దర్శకులు నరేశ్ దోనే, మణివరన్ మాట్లాడుతూ 'మనకు తెలియకుండానే మన బ్యాంక్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురై డబ్బు పోగొట్టుకోవడం ఈ చిత్ర ప్రధాన కథాంశం' అని తెలిపారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారి

‘బ్రో’ అన్నాడని బాదేశాడు

- స్విగ్గీ డెలివరీ బాయ్‌పై ఫ్లాట్ యజమాని దాడి
- అపార్టుమెంట్ సెక్యూరిటీతో చితకబాదించి.. అండర్‌వేర్‌తో గేటు బయట నిలబెట్టి దాష్టీకం
- అపార్టుమెంట్ వద్ద ఆందోళనకు దిగిన డెలివరీ బాయ్స్.. విశాఖపట్నంలో ఘటన

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ‘బ్రో’ అని సంబోధించాడనే కోపంతో స్విగ్గీ డెలివరీ బాయ్‌పై ఓ ఫ్లాట్ యజమాని విచక్షణారహితంగా దాడి చేసిన దారుణ ఘటన విశాఖపట్నంలో జరిగింది. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అపార్టుమెంట్ వద్ద డెలివరీ బాయ్స్ ఆందోళనకు దిగారు. ఆందోళనకారులు తెలిపిన వివరాల మేరకు.. సీతమ్మధారలో ఆక్సిజన్ టవర్స్ ‘బి’ బ్లాక్, 29వ అంతస్తులోని 2914 ఫ్లాట్‌లో ఉంటున్న ప్రసాద్ శుక్రవారం స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ పెట్టారు. డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న అనిల్ ఆ ఫుడ్ పార్శిల్ తీసుకుని మధ్యాహ్నం సమయంలో ప్రసాద్ ఫ్లాట్‌కు వెళ్లాడు. కాలింగ్ బెల్ కొట్టగానే ఓ మహిళ వచ్చారు. అనిల్ మాటలు ఆమెకు అర్థం కాకపోవడంతో, ఇంట్లోకి వెళ్లి ప్రసాద్‌కు చెప్పారు. ప్రసాద్ బయటకు వచ్చి ఏంటని అడిగేసరికి ‘మీకు ఫుడ్ పార్శిల్ వచ్చింది బ్రో’ అని అనిల్ సమాధానం ఇచ్చాడు. సార్ అని కాకుండా బ్రో అని సంబోధిస్తావా? అంటూ అతనిపై ప్రసాద్ దాడి చేశారు. అనంతరం కిందకు తీసుకువెళ్లి సెక్యూరిటీ సహాయంతో మరోసారి కొట్టించారు. తర్వాత బట్టలు విప్పించి అండర్‌వేర్‌తో గేటు బయట నిలబెట్టారు. క్షమించాలని కోరుతూ అనిల్‌తో బలవంతంగా ఒక లేఖ రాయించుకుని విడిచిపెట్టారు. ఈ అవమానం తట్టుకోలేక అనిల్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడనే ప్రచారం శనివారం సాయంత్రం మొదలైంది. దీంతో నగరంలోని ఫుడ్ డెలివరీ బాయ్స్ అంతా ఆక్సిజన్ టవర్స్ వద్దకు చేరుకున్నారు. అనిల్‌పై దాడి చేసి, అవమానపరిచి, ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. దీంతో విశాఖ ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనిల్‌కు ఫోన్ చేశారు. అతను క్షేమంగానే ఉన్నాడని కుటుంబసభ్యులు చెప్పారు. ఇదే విషయాన్ని ఆందోళన చేస్తున్నవారికి వివరించారు. బాధితుడు ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్నట్లుగా రెవెన్యూశాఖ పరిస్థితి ఉంది. తన వారి స్వప్రయోజనాల కోసం జగన్ ప్రభుత్వం భూముల రీ సర్వే పేరిట అయోమయ, గందరగోళ వ్యవస్థలను సృష్టిస్తే... దాన్ని సరిదిద్దే క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం మరింత కంగాళిగా మార్చేసింది. సమస్యను పరిష్కరించకపోగా, దాన్ని మరింత రాజేసి కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నారు.



రీ సర్వే సమస్యలపై గ్రామసభలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అనగాని (ఫైల్)

రెవెన్యూలో అంతా గందరగోళం

తహశీల్దార్ పదవుల్లో సీనియర్ అసిస్టెంట్లు.. 100కుపైగా మండలాల్లో అదే పరిస్థితి

- అర్హతలేకుండానే పోస్టింగులు
- రీ సర్వేలో తప్పులకు వారిదే బాధ్యత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో భూ వివాదాలు, రీసర్వే వంటి రెవెన్యూ సంబంధిత సమస్యలు తీర్చడానికి కీలకమైన అధికారులే తహశీల్దార్లు. వారి నియామకంలోనే రెవెన్యూ ఉన్నతాధికారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 358 మందికిపైగా తహశీల్దార్ల కొరత ఉంది. వీటిని రెవెన్యూ డిప్యూటీ తహశీల్దార్‌తో కొంత వరకు సర్దుబాటు చేయవచ్చు. అది కూడా తాత్కాలికంగా ఏర్పాటుకే. కానీ, అంతకన్నా తక్కువ స్థాయిలో అంటే సీనియర్ అసిస్టెంట్లను తహశీల్దార్‌లుగా పెట్టి అత్యంత కీలకమైన మండల రెవెన్యూ వ్యవస్థను నడిపిస్తున్నారు. ఈ సీనియర్ అసిస్టెంట్లే రీసర్వే తప్పులను పరిష్కరించడంలో ఆర్ఎస్ డీటీలుగా విఫలమయ్యారు. ఇప్పుడు వారే మండల తహశీల్దార్లు అయితే ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో ప్రభుత్వానికే తెలియాలి.

జగన్ జమానాలో రెవెన్యూ కుదేలు

రాష్ట్రంలో 679 మండలాలు, 17,564 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మండలంలో రెవెన్యూ వ్యవస్థే కీలకం. ప్రతి మండలానికి ఓ తహశీల్దార్ ఉంటారు. ఆ పోస్టుకు క్వాజీ జ్యుడీషియరీ అధికారాలు ఉంటాయి. మండలానికి కీలకమైన అధికార ప్రతినిధిగా ఈ పోస్టు ఉంటుంది. ఒక్క రెవెన్యూ పరిధిలోనే 578కిపైగా సేవలను తహశీల్దార్ పర్యవేక్షించాలి. తహశీల్దార్ ఆఫీసు నియంత్రణలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ ఉంటుంది. జగన్ ప్రభుత్వం వచ్చే నాటికి రెవెన్యూలో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. అప్పట్లోనే 160కిపైగా తహశీల్దార్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆ ఖాళీల సంఖ్య 358కి చేరింది. అంటే, 321 మండలాలకు మాత్రమే రెగ్యులర్ తహశీల్దార్లు ఉన్నారు.

ఖాళీలు పెరిగిపోయి..

తహశీల్దార్ పోస్టులో కేడర్‌కు తగినట్లుగా అధికారులు అందుబాటులో లేకుంటే సంబంధిత మండల రెవెన్యూ డీటీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తారు. ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డీటీని నియమిస్తారు. ఆ మేరకు బాధ్యతలు, అధికారాలు, విధులు అప్పగిస్తారు. అదికూడా తాత్కాలికంగానే ఉంటుంది. నిర్ణీత కాల వ్యవధిలో రెగ్యులర్ అధికారిని ప్రభుత్వం నియమించాలని రూల్స్ చెబుతున్నాయి. నిజానికి తహశీల్దార్ పోస్టుకు ఫీడర్ కేటగిరీ డీటీనే. డీటీ అంటే ఏపీపీఎస్సీ ద్వారా నేరుగా నియమితులైనవారు, లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ నుంచి డీటీగా పదోన్నతి కల్పిస్తారు. తర్వాత అర్హతను బట్టి తహశీల్దార్‌గా పదోన్నతి కల్పిస్తారు. జగన్ ప్రభుత్వంలో అలాంటివేమీ జరగలేదు. దీంతో ఖాళీలు పెరిగిపోయాయి. మరోవైపు రీసర్వే డీటీ అనే వ్యవస్థను కొత్తగా తీసుకొచ్చారు. మండల రెవెన్యూ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నవారినే ఎంపికచేసి వారికి ఆర్ఎస్‌డీటీలుగా హోదా కల్పించారు. రీసర్వే జరుగుతున్న మండలాల్లో రైతుల నుంచి పిటిషన్లను పరిష్కరించడం వారి బాధ్యత. రీ సర్వే ముగిసిన తర్వాత ఆ పోస్టులు రద్దైపోయేలా నాడు సర్వేశాఖ విధివిధానాలు ప్రకటించింది. సర్వే-సరిహద్దుల చట్టం-1923లోని సెక్షన్ 13 కింద సర్వే పూర్తైనట్లు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారంటే ఇక ఆర్ఎస్‌డీటీల అవసరం ఉండదు. అలా 8,648 గ్రామాల్లో రీసర్వే పూర్తియినట్టు నోటిఫికేషన్లు ఇచ్చారు.

సిబ్బంది లేరనే కారణంతో..

కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి రీసర్వే కారణంగా వేలాది గ్రామాలు రైతుల ఆందోళనలు, పోరాటాలతో హోరెత్తుతున్నాయి. రీ సర్వేలో జగన్ సర్కారు సృష్టించిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీని ప్రకారం చేయాల్సిన తొలి పని తహశీల్దార్ పోస్టులను భర్తీచేసి మండల రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడం. అయితే, రెవెన్యూశాఖ ఆ పనిచేయలేదు. దీనికి భిన్నంగా రీసర్వేలో ఆర్ఎస్‌డీటీలుగా ఉన్న సీనియర్ అసిస్టెంట్లను ఏకంగా 100కుపైగా మండలాలకు తహశీల్దార్లుగా పంపింది. నిజానికి తహశీల్దార్‌గా రెగ్యులర్ రెవెన్యూ డీటీలకే అదనపు బాధ్యతలు అప్పగించాలి. అయితే, తగినంత సిబ్బంది లేరనే కారణంతో ఏమాత్రం ప్రామాణికత, శిక్షణ, నైపుణ్యత లేని ఆర్ఎస్‌డీటీలను తహశీల్దార్ పోస్టుల్లో కూర్చోబెట్టింది. అలాంటివారిలో చాలా మందికి రెవెన్యూ పరిజ్ఞానం అంతగా ఉండదు. రెవెన్యూ చట్టాలు, సర్వీసులు, ప్రజా సమస్యలు, న్యాయపరమైన అంశాలపై అవగాహన ఉండదు. తహశీల్దార్‌గా నియమితులయ్యేవారికి పోస్టింగ్ ఇవ్వడానికి ముందే 11రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో ఉత్తీర్ణులైన వారికే పోస్టింగ్ ఇస్తారు. కానీ, సీనియర్ అసిస్టెంట్‌ను తహశీల్దార్‌గా నియమించిన ఘనత రెవెన్యూశాఖదే. ఈ పోస్టులు లాభసాటిగా ఉన్నాయని కొందరు ఆర్ఎస్‌డీటీలు పైరవీలు చేసి మరీ సాధించుకున్నారు. జిల్లాల్లో అధికార పార్టీ నేతలు, కీలక అధికారులను ప్రసన్నం చేసుకొని కీలక మండలాలు దక్కించుకున్నారు. కొందరు కలెక్టర్లతో ఉన్న పరిచయాలతో పోస్టింగులు పొందారు.

తప్పులూ వారివే..పరిష్కారమూ వారిదే

కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది నిర్వహించిన గ్రామసభల్లో రీ సర్వే తప్పులపై 2.80 లక్షల పిటిషన్లు వచ్చాయి. ఆర్ఎస్‌డీటీల వైఫల్యం కారణంగా రీసర్వేలో వచ్చిన తప్పులు పరిష్కారానికి నోచుకోలేదు. రైతుల అప్పీళ్లు పరిష్కారం కాలేదు. రైతుల పిటిషన్లను విచారించకుండానే పరిష్కరించినట్లుగా అడ్డగోలుగా సెటిల్ చేశారు. ఆ తర్వాత వేలాది గ్రామాల్లో రీసర్వే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పుడు ఆ ఆర్ఎస్‌డీటీలే 100కుపైగా మండలాల్లో తహశీల్దార్లుగా ఉన్నారు. అప్పుడు రైతుల పిటిషన్లను పరిష్కరించలేక చేష్టలుడిగిన వారే ఇప్పుడు తహశీల్దార్‌లుగా ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదే అసలు గందరగోళం. రీసర్వే లోపాల పరిష్కారం అత్యధికంగా ఆర్ఎస్‌డీటీలు తహశీల్దార్లుగా ఉన్న మండలాల్లోనే జరిగినట్టు నివేదికలు చెబుతున్నాయి. అంటే తెరవెనుక ఏం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. రైతుల పిటిషన్లను అడ్డగోలుగా మూసేసి, పరిష్కారంగా చూపిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. భూ సమస్య పరిష్కారం కాలేదంటూ రైతులు పాత సమస్యలనే ప్రస్తావిస్తుండటం దీనికి నిదర్శనం. ఇతర వేదికల పైనా రైతులు తీవ్ర విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తున్నారు. అది కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపించే అవకాశం ఉందని సీనియర్ అధికారులు చెబుతున్నారు.



గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన పోసాని కృష్ణమురళి

గుంటూరు జైలు నుంచి పోసాని విడుదల

- మీడియాతో మాట్లాడకుండా కారులో పయనం

గుంటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి గుంటూరు జిల్లా జైలు నుంచి శనివారం సాయంత్రం విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానిని మాజీ మంత్రి అంబటి రాంబాబు పలకరించారు. జైలు వద్దకు పోసాని కుటుంబ సభ్యులతో పాటు పలువురు వైసీపీ నాయకులు, ఆయన తరపు న్యాయవాదులు వచ్చారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులపై పోసాని గతంలో దారుణమైన వ్యాఖ్యలు చేశారు. దీనిపై టీడీపీ, జనసేన కార్యకర్తలు ఫిర్యాదులు చేయడంతో పోసానిపై రాష్ట్రవ్యాప్తంగా 15కి పైగా కేసులు నమోదయ్యాయి. 2025 ఫిబ్రవరి 26న కర్నూలు జిల్లా పోలీసులు ఆయనను హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి తీసుకువచ్చారు. ఆ తరువాత వివిధ స్టేషన్లలో నమోదైన కేసుల్లో పోలీసులు పీటీ వారెంట్లపై సంబంధిత కోర్టుల్లో హాజరుపరుస్తూ వచ్చారు. అయితే ఆయా కేసుల్లో 41ఏ నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో ఆయనకు జైలునుంచి విముక్తి లభించింది. గతనెల 26న అరెస్టయిన పోసాని దాదాపు నెల రోజులు రిమాండ్‌లో ఉన్నారు. సీఐడీ నమోదు చేసిన కేసులో పోసానికి శుక్రవారం గుంటూరు ఎక్సైజ్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పూచీకత్తు సమర్పించడం ఆలస్యం కావడంతో విడుదలలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు శనివారం సాయంత్రం ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. కోర్టు షరతుల నేపథ్యంలో జైలు నుంచి విడుదలయ్యాక ఆయన మీడియాతో మాట్లాడకుండా కారులో వెళ్లిపోయారు.

వర్రా రవీంద్రరెడ్డికి బెయిల్



కడప క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు పలువురిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డికి బెయిల్ మంజూరైంది. దాదాపు 17 కేసుల్లో నిందితుడిగా ఉన్న వర్రాకు ఇప్పటికే 15 కేసుల్లో బెయిల్ లభించగా, మిగిలిన రెండు కేసుల్లో శనివారం బెయిల్ వచ్చింది. ఈ మేరకు తమకు సమాచారం వచ్చిందని కడప కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్‌రావు తెలిపారు. రవీంద్రరెడ్డి ప్రస్తుతం జగ్గయ్యపేట జైల్లో రిమాండు ఖైదీగా ఉన్నారు.

విడదల రజినిపై ఎఫ్ఐఆర్

(మొదటి పేజీ తరువాయి)

గోపితో పాటు ఆమె వ్యక్తిగత సహాయకుడు దొడ్డ రామకృష్ణను నిందితులుగా పేర్కొంది. అవినీతి నిరోధక శాఖలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్(సీఐయూ) శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7, 7ఏతో పాటు ఐపీసీలోని 384, 120బీ, బీఎన్ఎస్ఎస్ 173, 176 కింద నలుగురిపై అభియోగాలు నమోదు చేసింది.

ఇదీ కేసు..

గత వైసీపీ ప్రభుత్వంలో చిలకలూరిపేట నియోజకవర్గం ఎడ్లపాడు మండలం విశ్వనాథునికండ్రిగలో ఉన్న లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని నల్లపనేని చలపతిరావును విడదల రజిని బెదిరించారు. ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలంటూ వ్యక్తిగత సహాయకుడు దొడ్డ రామకృష్ణ ద్వారా డిమాండ్ చేయించారు. ఆ తర్వాత అప్పటి గుంటూరు జిల్లా విజిలెన్స్ అధికారి జాషువాతో పాటు తన మరిది గోపిని రంగంలోకి దించారు. అయితే అన్ని అనుమతులూ తీసుకునే 10.163 హెక్టార్లలో మైనింగ్ చేస్తున్నామని, అక్రమాలకు పాల్పడలేదని, డబ్బులు ఎందుకు ఇవ్వాలని చలపతిరావు అభ్యంతరం చెప్పారు. దీంతో.. ‘ఎమ్మెల్యే అడిగితే ఇవ్వాల్సిందే. లేదంటే 50 కోట్ల రూపాయలు జరిమానా తప్పదు’ అంటూ ఐపీఎస్ అధికారి జాషువా బెదిరించారు. తన బృందంతో పాటు మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి 2020 సెప్టెంబరు 20న తనిఖీలు చేశారు. ఆ తర్వాత గుంటూరులోని తన కార్యాలయంలో జరిమానా విధించేందుకు అనుకూలంగా నివేదిక సిద్ధం చేయించారు. ఆ తర్వాత మరోసారి చలపతిరావును బెదిరించి బేరమాడారు. విధిలేని పరిస్థితుల్లో రెండు కోట్ల రూపాయలు ఇచ్చేందుకు చలపతిరావు అంగీకరించారు. 2021 ఏప్రిల్ 4న రాత్రి 11గంటల ప్రాంతంలో చిలకలూరిపేటలోని విడదల రజిని ఇంట్లో ఆమె మరిది గోపి చేతికి రెండు కోట్ల రూపాయల నగదు ఇచ్చారు. అయితే తమకు చెరో పది లక్షలు ఇవ్వాలంటూ చలపతిరావును గోపి, జాషువా డిమాండ్ చేశారు. దీంతో వ్యాపార భాగస్వామి నంబూరి శ్రీనివాసరావు, పెరవలి నాగవంశీ ద్వారా విడదల గోపికి చిలకలూరిపేటలో, జాషువాకు గుంటూరులో వారు అడిగినంత మొత్తం అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విడదల రజిని, జాషువాపై బాధితుడు చలపతి రావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

మొదట విజిలెన్స్‌తో విచారణ

చలపతిరావు ఫిర్యాదుపై విచారించి వాస్తవాలు వెలికితీసి నివేదిక ఇవ్వాలంటూ కూటమి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. అప్పట్లో జాషువాతో పాటు తనిఖీలకు వెళ్లిన అధికారుల వాంగ్మూలాలు తీసుకున్నారు. జాషువా చెబితేనే తాము వెళ్లామని, విజిలెన్స్ ప్రధాన కార్యాలయానికి ఈ వ్యవహారం గురించి తెలియదని అధికారులు వెల్లడించారు. దీంతో గ్రామస్థులు ఎవరూ స్టోన్ క్రషర్‌పై ఫిర్యాదు చేయలేదని, మాజీ మంత్రి విడదల రజిని ఆదేశాల మేరకే జాషువా బెదిరించారని విజిలెన్స్ తేల్చింది. డబ్బులు చేతులు మారినట్లు ఆధారాలతో సహా నివేదిక ఇచ్చింది. దీంతో ఫిబ్రవరి 10న కేసు నమోదు చేయాలని ఏసీబీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జాషువాపై చర్యలకు సిఫారసు

చట్టాన్ని ఉల్లంఘించిన ఐపీఎస్ అధికారి జాషువాపై చర్యకు విజిలెన్స్ సిఫారసు చేసింది. ఆలిండియా సర్వీస్ రూల్స్ 1970 ప్రకారం జాషువా చాలా పెద్ద తప్పు చేశారని పేర్కొంది. సివిల్ సర్వీస్ అధికారి చట్టాన్ని పక్కనబెట్టి, పైఅధికారుల అనుమతి లేకుండా అధికార పార్టీ నేతల స్వప్రయోజనాల కోసం పనిచేయడాన్ని నేరంగా పరిగణించింది. ఎలాంటి ఫిర్యాదు లేకున్నా మైనింగ్ వ్యాపారిని బెదిరించడంతో పాటు పది లక్షల రూపాయలు తీసుకోవడంపై చర్య తీసుకోవచ్చుని పేర్కొంది. వైసీపీ హయాంలో కృష్ణా, చిత్తూరు ఎస్పీగా పనిచేసిన జాషువా ఆ పార్టీ నేతల అరాచకాలకు వంతపాడినట్టు ఆరోపణలున్నాయి.

నాడు ఎన్నో అరాచకాలు

జగన్ అరాచక పాలనలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కొందరు ఐపీఎస్‌లు మాఫియాగా ఏర్పడి వ్యాపారస్తుల్ని బెదిరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎవరు వ్యాపారాలు చేసుకోవాలన్నా ఆ పార్టీ నేతలకు కప్పం కట్టి తీరాల్సిందే. బిహార్ లాంటి చోట్ల నడిచే దందాకు ఏపీలో కొందరు మంత్రులు తెరతీశారు. సకల శాఖల మంత్రిగా పేరున్న నాయకుడి అండదండలతో రెచ్చిపోయారు. అలాంటి మంత్రుల్లో విడదల రజిని ఒకరు. విదేశాల నుంచి వచ్చి 2019లో చిలకలూరిపేట ఎమ్మెల్యేగా వైసీపీ తరపున గెలిచారు. ఆమె ప్రజాసేవ కన్నా వసూళ్లపైనే ఎక్కువ దృష్టి పెట్టారు.

నాడు బొత్స సమర్థన

“సిఫారసు బదిలీ చేస్తే తప్పేంటి? ఎమ్మెల్యేలుగా ఉండి టీచర్ల బదిలీలు కూడా చేసుకోకూడదా? ఆ మాత్రం బదిలీలు కూడా చేసుకోలేకపోతే ఇక ప్రభుత్వం ఎందుకు? సిఫారసు బదిలీలు చాలా తక్కువే. దీని గురించి రాద్ధాంతం అక్కర్లేదు” అని నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు.

నేడు లోకేశ్ మాట

“గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా, ఇష్టారాజ్యంగా టీచర్లను అక్రమంగా బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో బదిలీలపై నిషేధం ఉన్నా 1,100 మందిని బదిలీ చేశారు. దీనిపై అనేక న్యాయ వివాదాలు ఉత్పన్నమయ్యాయి. అందుకే ఇకపై ఎవరి జోక్యం ఉండకూడదని, టీచర్ల బదిలీలకు ప్రత్యేకంగా చట్టం తీసుకొస్తున్నాం” అని టీచర్ల బదిలీల చట్టంపై అసెంబ్లీలో మాట్లాడుతున్న సందర్భంలో మంత్రి నారా లోకేశ్ అన్నారు.

నాడు అపహాస్యం.. నేడు చట్టబద్ధం!



వైసీపీ హయాంలో అడ్డగోలుగా టీచర్ల బదిలీలు

- సిఫారసులతో వందలాది మందికి స్థానచలనం.. ఒక్కో బదిలీకి రూ.లక్షల్లో ముడుపుల వసూలు
- ఉపాధ్యాయుల బదిలీలకు ప్రత్యేక చట్టంతో గందరగోళానికి కూటమి సర్కారు చెక్
- ఇకపై ఏటా వేసవిలోనే బదిలీల ప్రక్రియ.. టీచర్లకు ఐదేళ్లు దాటితే తప్పనిసరి బదిలీ
- నాలుగు కేటగిరీల్లో ప్రాధాన్యతా పాయింట్లు .. సంవత్సరంలో ఒకసారే సాధారణ బదిలీలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇంతలో ఎంత మార్పు! నాడు వైసీపీ సర్కారు ముడుపుల బాగోతంతో టీచర్ల బదిలీలను అపహాస్యం చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం బదిలీల కోసం ఏకంగా చట్టమే తీసుకొచ్చింది. ‘ఈ సంవత్సరం బదిలీలు ఉంటాయా? ఉండవా?’ అంటూ ప్రతీ ఏటా టీచర్లు ఆందోళన చెందాల్సిన పరిస్థితి అప్పట్లో ఉండేది. ఇప్పుడు ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు. న్యాయ వివాదాలకు ఆస్కారం లేకుండా వివాదరహితంగా బదిలీల ప్రక్రియను నిర్వహించనున్నారు. దీనివల్ల విద్యా సంవత్సరంపై ప్రతికూల ప్రభావం కూడా ఉండదని ప్రభుత్వం పేర్కొంటోంది.

ముడుపులు ఇచ్చుకో.. బదిలీలు పుచ్చుకో..

పిల్లల చదువులు ఏమైతే మాకేంటి అన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. ముడుపులు ఇచ్చుకో.. బదిలీలు పుచ్చుకో అన్నట్లుగా టీచర్ల సిఫారసు బదిలీలకు తలుపులు బార్లా తెరిచింది. విద్యా సంవత్సరం చివరిలో టీచర్లను మారిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదు. బదిలీలపై నిషేధం ఉన్న సమయంలోనూ సీఎం కార్యాలయం నుంచి సిఫారసుల పేరుతో వందల మందిని అడ్డగోలుగా బదిలీ చేసింది. పెద్దల సిఫారసులు అటుంచితే చివరికి గ్రామ సర్పంచ్ సిఫారసు లేఖ ఇచ్చినా అందుకు అనుగుణంగా టీచర్ల బదిలీలు చేశారు. ఎన్నికలకు కొంత కాలం ముందు నుంచి రిక్వెస్ట్ బదిలీల పేరుతో పలు దఫాలుగా బదిలీ ప్రక్రియను నడిపించింది. అప్పట్లో జరిగిన అక్రమ బదిలీల వ్యవహారంలో అనేకమంది ప్రమేయం ఉంది. తొలుత సీఎంవో పేరుతో సిఫారసు బదిలీల జాబితా పంపగా, అనంతరం ఆ జాబితాలో ఉన్నవారు బొత్స పేషీ చుట్టూ తిరిగారు. పేషీలోని కొందరు అధికారుల ద్వారా ముడుపులు సమర్పించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు పాఠశాల విద్యాశాఖలో కొందరు అధికారులు ‘మాకేంటి?’ అంటూ చక్రం తిప్పారు. అంతా కలసి అందినకాడికి దండుకొన్నారు. ఒక్కో బదిలీకి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల చొప్పున రూ.50కోట్లకు పైగా వసూలు చేశారని ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందే సగం మందికి పైగా టీచర్లు బదిలీ అయిన పాఠశాలల్లో చేరిపోయారు. ఇక బదిలీ ఉత్తర్వులు అందినా, కోడ్ కారణంగా 917 మంది టీచర్లు పాత స్థానాల్లోనే కొనసాగారు. ప్రభుత్వం మారిన తర్వాత వారి బదిలీల ఫైలును సీఎం చంద్రబాబుకు పంపగా, ఆయన దాన్ని తిరస్కరించడంతో అవి ఆగిపోయాయి. దీంతో అప్పటికే ముడుపులు సమర్పించుకున్న టీచర్లు లబోదిబోమన్నారు.

చట్టంలోని కీలక అంశాలివీ..

ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళానికి ముగింపు పలకడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిర్దేశిత సమయంలో వివాదరహితంగా బదిలీలు జరగాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చింది. దీనికి ‘ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ బదిలీ నియంత్రణ చట్టం-2025’ అని పేరు పెట్టింది. దీని ప్రకారం... బదిలీలకు విద్యా సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీసు దాటిన హెచ్ఎంలకు, 8ఏళ్లు దాటిన టీచర్లకు బదిలీ తప్పనిసరి. ఒక పాఠశాలలో కనీసం రెండేళ్లు పనిచేస్తే బదిలీలకు అర్హుల జాబితాలోకి వస్తారు. బదిలీలకు ప్రాంతాల వారీగా నాలుగు కేటగిరీలు ఉంటాయి. కేటగిరీ-1లో జిల్లా కేంద్రాలు, నగర కార్పొరేషన్, ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాలు, కేటగిరీ-2లో మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, కేటగిరీ-3లో మండల కేంద్రాలు, రోడ్డు సదుపాయం కలిగిన గ్రామాలు, కేటగిరీ-4లో రోడ్డు సదుపాయం లేని గ్రామాలు, కొండ ప్రాంతాలు ఉంటాయి. టీచర్ల మొదటి నియామకం లేదా హెచ్ఎంగా పదోన్నతి పొందిన తర్వాత మొదటి పోస్టింగ్‌ను 3, 4 కేటగిరీ ప్రాంతాల్లో ఇస్తారు. బదిలీల సమయానికి రెండేళ్లలోపు మాత్రమే సర్వీసు ఉన్నవారిని కోరుకుంటేనే బదిలీ చేస్తారు. 50ఏళ్ల కంటే తక్కువ వయసున్న హెచ్ఎంలు, టీచర్లు బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తుంటే తప్పనిసరిగా బదిలీ చేస్తారు. బాలికల ఉన్నత పాఠశాలలకు మహిళా హెచ్ఎంలు, టీచర్లను నియమిస్తారు. వారు అందుబాటులో లేకపోతే 50ఏళ్లు దాటిన పురుష టీచర్లను నియమిస్తారు. లైంగిక నేరాలు, బాలికల అంశాల్లో ఆరోపణలున్న పురుష టీచర్లకు బాలిక ఉన్నత పాఠశాలల్లో పోస్టింగ్ ఇవ్వరు. హెచ్ఎంలు, టీచర్లపై నమోదైన అభియోగాలు పెండింగ్‌లో ఉంటే బదిలీలకు పరిగణలోకి తీసుకోరు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీల ప్రక్రియను నిర్వహిస్తారు. అలాగే ప్రస్తుత పాఠశాల ప్రామాణికంగా కేటగిరీ-1లో ఉన్న టీచర్లకు ఏడాదికి ఒక పాయింట్, కేటగిరీ-2లో ఉన్నవారికి 2 పాయింట్లు, కేటగిరీ-3లో ఉన్నవారికి 3 పాయింట్లు, కేటగిరీ-4లో ఉన్నవారికి ఏడాదికి 5 పాయింట్లు ఇస్తారు. బదిలీలు జరిగే సంవత్సరం మే 31 నాటికి అన్ని కేడర్లలో కలిపి సర్వీసులోని ప్రతి సంవత్సరానికి ఒక పాయింట్ ఇస్తారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న వారి జీవిత భాగస్వామి అయిన టీచర్లకు ప్రత్యేక పాయింట్లు లభిస్తాయి. 40ఏళ్లు దాటిన అవివాహిత మహిళా టీచర్లు, దివ్యాంగులు, గుర్తించిన వ్యాధులు కలిగినవారు, వితంతువులు, ఒంటరి మహిళలు, మాజీ సైనికుల జీవిత భాగస్వాములు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా పనిచేస్తున్న వారికీ ప్రత్యేక పాయింట్లు ఉంటాయి. టీచర్ల పనితీరు ఆధారంగా కూడా పాయింట్లు కేటాయిస్తారు. సెక్షన్-7 ప్రకారం సంవత్సరంలో ఒకసారి మాత్రమే సాధారణ బదిలీలు చేస్తారు. ఏటా బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమందికి సమానమైన పాయింట్లు వస్తే కేడర్‌లో సీనియారిటీ, పుట్టిన తేదీ, మహిళలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుంటారు.

కమీషన్లు ఇచ్చేవారికే భూ కేటాయింపులు

- ఏపీఐఐసీపై దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఆరోపణ

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించడానికి ఏపీఐఐసీ నిరాకరిస్తోందని, కమీషన్లు ఇచ్చేవారికి మాత్రమే భూములు కేటాయిస్తోందని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ ఆరోపించారు. 2017, 2018లలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌లలో ఎంవోయూ చేసుకున్నవారికి ఇప్పటికీ భూములు కేటాయించలేదన్నారు. అప్పట్లో తమ అసోసియేషన్ కూడా రాష్ట్రంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో 800 ఎకరాల్లో నాలుగు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఒప్పందాలు చేసుకున్నవారిలో ఎవరెవరికి భూములు కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఒప్పందం ప్రకారం భూములు కేటాయించేలా సీఎం దృష్టి సారించాలని కోరారు.



అమ్మా.. నాన్నా లేక... అక్షరమే ఆలంబనగా...!

మండే ఎండలో.. చెట్టు నీడలో రిక్షాపై కూర్చుని ఒకవైపు చదువుకుంటూ... మరోవైపు పండ్లు అమ్ముతున్న ఈ బాలిక పేరు మోక్షిత. ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. మోక్షితకు ఆరు నెలల వయసున్నప్పుడే తల్లి అనారోగ్యంతో చనిపోయింది. తండ్రి వేరే పెళ్లి చేసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి వృద్ధులైన అమ్మమ్మ, తాతలే ఆ బాలికకు ఆదరవు అయ్యారు. చిత్తూరులోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఇలా బుట్టల్లో పండ్లను పెట్టుకుని అమ్ముకుంటూ ఆ వృద్ధులు పొట్ట నింపుకొంటున్నారు. ఉదయం స్కూలుకు వెళ్తున్న మోక్షిత... మధ్యాహ్నం నుంచి అవ్వా తాతలకు సాయంచేస్తోంది. పాపను బాగా చదివించాలన్నదే తమ కోరికని అందుకే ఈ వయసులోనూ కష్టపడుతున్నామని మోక్షిత తాత సుబ్రమణ్యం చెప్పారు. అద్దె ఇంటిలో ఉంటున్న తమకు ప్రభుత్వం సొంత ఇల్లు సమకూర్చాలని వేడుకున్నారు.

చంద్రబాబు అనుభవమే నాకు ప్రేరణ

ఆ స్ఫూర్తితోనే గ్రామసభల ప్రపంచ రికార్డు

ప్రజల ఆర్థిక స్థిరత్వం మా ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- త్వరలో జిల్లాల్లో పర్యటిస్తా: డిప్యూటీ సీఎం పవన్
- నీటి కుంటల నిర్మాణానికి భూమిపూజ

కర్నూలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ అనుభవం, పాలన నాకు ఎంతో ప్రేరణ ఇచ్చింది. ఆ స్ఫూర్తితో రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించాం. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ప్రపంచ రికార్డు సృష్టించాం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో 1.55 లక్షల నీటి కుంటలు(ఫారం పాండ్స్) తవ్వకం పనులకు శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామంలో ఆయన భూమిపూజ చేశారు. పలుగు, పార చేతపట్టి సూర రాజన్న అనే రైతు పొలంలో నీటి కుంట తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెసీమల్లో ప్రజల ఆర్థిక, ఉపాధి స్థిరత్వం కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. 'గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రైతన్నలు బలపడాలి. ఉపాధి హామీ పనుల ద్వారా అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వం ప్రధాన అజెండా. త్వరలోనే ప్రతి నియోజకర్గంలో రెండు రోజులు పర్యటించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తా. దీన్ని గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ ఉపాధి హామీ పథకంగా మార్చేసింది. అలాంటి వారిని ఎదుర్కొని బలమైన వ్యవస్థను తయారు చేస్తున్నాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉండటం అభినందనీయం. రాయలసీమను రతనాలసీమగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. వర్షం వస్తే నీటిని నిల్వ చేసుకునే అవకాశాలు లేవు. ఓ వైపు భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతూనే.. అవి పూర్తయ్యేవరకు నీటికి ఇబ్బందులు లేకుండా రైతు పొలంలోనే నీటి కుంటలు నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో 1.55 లక్షల నీటి కుంటల నిర్మాణం మే నెలాఖరులోగా పూర్తి చేస్తాం. వర్షాకాలంలో ఒక టీఎంసీ నీటిని వీటిలో నిల్వ చేసుకోవచ్చు' అని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అలాగే, ప్రధాని మోదీ సహకారంలో జన్మన్ పథకం ద్వారా విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.


కర్నూలు జిల్లా పూడిచర్లలో నీటికుంట తవ్వుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కొణిదెల గ్రామం దత్తతకు కట్టుబడి ఉన్నా..

'నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామాన్ని దత్తతకు తీసుకుంటానని గతంలో చెప్పాను. ఆ మాటకు కట్టుబడి ఉన్నాను. నా సొంత ట్రస్టు నుంచి ఆ గ్రామానికి రూ.50 లక్షలు కేటాయించి మౌలిక సౌకర్యాలు కల్పిస్తా' అని పవన్‌కల్యాణ్ తెలిపారు. జిల్లా అధికారులతో మాట్లాడి ప్రభుత్వ పథకాల ద్వారా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. సీఎంతో మాట్లాడి ఉపాధి హామీ పథకం బకాయి నిధులు త్వరలో విడుదలయ్యేలా చూస్తానని చెప్పారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు పలు సమస్యలు తన దృష్టికి తెచ్చారని, వాటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

స్వధర్మాన్ని పాటిస్తా

'కులాలు, మతాల గురించి నేను మాట్లాడితే చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. ధర్మాన్ని బలంగా నమ్ముతాను. నా స్వధర్మాన్ని పాటిస్తాను. అన్ని ధర్మాలను గౌరవిస్తాను' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. కర్నూలు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా నిధులు తెచ్చుకోవాలి

కేంద్రంతో సత్వరం సంప్రదింపులు జరపాలి

ఆర్థిక శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం

కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర నిధులపై సమీక్ష

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెచ్చుకోవాలని ఆర్థిక శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖపై శనివారం సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్రప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై అధికారులతో చర్చించారు. కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖలకు నిధులు రావాల్సి ఉందని అధికారులు సీఎంకు వివరించారు. కేంద్రంతో సత్వరం సంప్రదింపులు జరిపి, రావాల్సిన నిధులను మార్చి 31లోగా తెచ్చుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సాధారణంగా ఏటా మార్చి నెలలో కేంద్రం నుంచి రాష్ట్రాలకు అధిక నిధులు వస్తుంటాయి. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న గ్రాంట్లు, పథకాల నిధులను ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఇచ్చేయాలన్న ఉద్దేశంతో కేంద్రం కూడా రాష్ట్రాలకు సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఏపీకి వివిధ పథకాలకు సంబంధించి రూ. 7,000 కోట్ల వరకు నిధులొచ్చాయి. నెలాఖరులోగా మరో రూ. 7,000 కోట్ల నిధులు రావాల్సి ఉందని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.



మంత్రి ఫరూక్‌కు సీఎం పరామర్శ

మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఫరూక్ ఇంటికి శనివారం బాబు వెళ్లారు. ఇటీవల ఫరూక్ సతీమణి షెహనాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి ఫరూక్, కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు.

జగన్.. ఎస్సీ వర్గీకరణపై మీ వైఖరేంటి?

బహిరంగంగా స్పష్టం చేయండి

మంద కృష్ణ మాదిగ డిమాండ్

- చంద్రబాబుకు, జగన్‌కు ఆకాశానికి, భూమికి మధ్య ఉన్నంత తేడా

గుంటూరు(తూర్పు), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బహిరంగంగా వెల్లడించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణను వైసీపీ ఒక సామాజిక న్యాయంగా చూస్తోందా? లేక దళితుల మధ్య చిచ్చుగా భావిస్తోందా? అని నిలదీశారు. ఇటీవల ఏపీ శాసనసభలో వర్గీకరణ అంశంపై జరిగిన చర్చపై తన వైఖరిని చెప్పదలుచుకొంటే నేరుగా జగనే చెప్పాలని స్పష్టం చేశారు. కీలకమైన వర్గీకరణ బిల్లుపై ఇప్పటి వరకు జగన్ మాట్లాడలేదని, కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తే మాదిగలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లం అవుతోందన్నారు. వైసీపీలో మాలల ఆధిపత్యం కోసం మాదిగలను జగన్ అణగదొక్కుతున్నారని అన్నారు. గుంటూరులో శనివారం మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. జగన్ వైఖరిపై ధ్వజమెత్తారు. "మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్‌తో మీరు రాసిన స్క్రిప్టుని చదివించారా? అన్న అనుమానం కలుగుతోంది. ఎస్సీ వర్గీకరణని ఓ చిచ్చుగా పార్టీలో మాదిగ నేతతోనే మాట్లాడిస్తున్నారు. మీరు సీఎం హోదాలో ఈ అంశాన్ని ఒక చిచ్చుగా అభివర్ణిస్తూ అసెంబ్లీలో ప్రకటన చేశారు. మా కన్నును మా చేతే పొడిపించి మీ పార్టీలో ఉన్న మాదిగ జాతి నేతలపై మాదిగలే ఈసడించుకునే పరిస్థితిని మీరే కల్పిస్తున్నారు. మాలల ఆధిపత్యానికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా, మాదిగలను మాదిగలే గౌరవించకుండా మీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై స్పష్టత విషయంలో మీకు, సీఎం చంద్రబాబుకు ఆకాశానికి, భూమికి మధ్య ఉన్నంత తేడా ఉంది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో స్పష్టత, నిజాయితీ, నిబద్ధత బాబుకే ఉన్నాయి.



జగన్‌లో సానుకూలత ఏదీ?

చంద్రబాబు రేపో, మాపో ఆర్డినెన్స్ తీసుకు రాబోతున్నారు. 1996లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోబోతున్నారు. ఈ తరుణంలో మీరు సానుకూలంగా లేకుండా, నేరుగా మాట్లాడకుండా మాదిగ నాయకులతోనే మాట్లాడిస్తుంటే మా విషయంలో మీరు ప్రమాదకరంగా ఉన్నట్లు అనుమానాలు వస్తున్నాయి.

మీ నేతల మాటలు చూస్తే.. మీరు వ్యతిరేకమే

గుంటూరులో మాలల మహాగర్జన తరువాత మాలలతో సమావేశం ఏర్పాటు చేశారు. అప్పట్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మేరుగు నాగార్జున మాలలకు పెద్ద పీట వేస్తానని ప్రకటన చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు?. జూపూడి ప్రభాకరరావు ఎస్సీ వర్గీకరణ జరగనివ్వబోమని మాట్లాడుతున్నారు. దీనిని బట్టే మీరు మాదిగలకు వ్యతిరేకమన్న విషయం స్పష్టమవుతోంది. నాడు మాలలతో సమావేశం పెట్టించిన మీరు.. మాదిగ నాయకులతో ఎందుకు ఏర్పాటు చేయలేదు?. వైసీపీ తొలి ప్లీనరీలో వర్గీకరణకు మద్దతుగా తీర్మానం చేశారు. ఇప్పుడు ఈ విషయంలో మాట తప్పి, మడమ తిప్పారని మండిపడ్డారు.

వర్గీకరణకు కట్టుబడి ఉన్నదెవరో చర్చకు సిద్ధమా?

వైసీపీ నేతలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సవాల్

అనంతపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నదెవరో, దళితులకు ఎవరు ఏం చేశారో చర్చించేందుకు సిద్ధమా అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వైసీపీ నేతలకు సవాలు విసిరారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల, మాదిగ, ఇతర ఉప కులాలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటే... స్వాగతించాల్సింది పోయి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు హయాంలో 2014-19 వరకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధి, దళిత వాడల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎన్ని వేల కోట్లు ఖర్చు చేశామో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



జగన్ మౌనం... మోదీకి మద్దతివ్వడమే

- డీలిమిటేషన్‌పై చంద్రబాబు, పవన్ మాట్లాడాలి: వైఎస్ షర్మిల



అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనపై జగన్ మౌనం మోదీకి మద్దతు ఇవ్వడమేనని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. డీలిమిటేషన్‌పై శనివారం ఆమె ఎక్స్‌లో స్పందించారు. జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే తీవ్ర అన్యాయంపై ఆమె లెక్కలతో సహా వివరించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని చెప్పారు. ఐక్యంగా పోరాటం చేస్తే తప్ప నియంత ప్రధాని నరేంద్ర మోదీకి బుద్ధి రాదని వ్యాఖ్యానించారు. ఏపీలో మోదీ పక్షం చంద్రబాబు, పవన్ కల్యాణ్ మౌనం వహించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి కూడా నోరు మెదపక పోవడం అంటే.. పరోక్షంగా డీలిమిటేషన్‌కు మద్దతును ప్రకటించినట్లేనని వ్యాఖ్యానించారు. రాజకీయాలు పక్కనపెట్టి టీడీపీ, జనసేన, వైసీపీ ముందుకు రావాలని షర్మిల డిమాండ్ చేశారు.

చెన్నై భేటీకి టీడీపీ, జనసేన దూరం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నైలో డీఎంకే నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి టీడీపీ, జనసేన హాజరు కాలేదు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా మార్చి 12న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను తమిళనాడు మంత్రి ఈవీ వేలు ఆహ్వానించారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షంగా ఉన్నందున ఆ సమావేశానికి హాజరుకాలేమని అప్పుడే పల్లా స్పష్టం చేశారు. తనకు అందిన ఆహ్వానంపై జనసేన స్పందిస్తూ.. వేర్వేరు కూటముల్లో ఉన్నందున హాజరుకాలేమని పేర్కొంది. 'నియోజకవర్గాల పునర్విభజనపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. ఈ అంశంపై మా విధానం మాకు ఉంది. మా విధానాన్ని సాధికారిక వేదికపై వెల్లడిస్తాం' అని జనసేనానికి రాజకీయ కార్యదర్శి పి.హరి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జగన్ దొంగాట



డీఎంకే ఆహ్వానంపై మౌనం

- ప్రధాని మోదీకి లేఖ అంటూ ప్రచారం
- లేఖలోనూ డీలిమిటేషన్‌పై నిర్ద్వంద్వ వైఖరిని వెల్లడించని వైనం
- ఎస్సీ వర్గీకరణపైనా అటూఇటూ కాని ధోరణే

అమరావతి, మార్చి 22(అమరావతి): సార్వత్రిక ఎన్నికల తరువాత అనేక కీలకమైన విషయాలపై తమ పార్టీ వైఖరిని స్పష్టం చేసేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెనుకాడుతున్నారు. నిర్మొహమాటంగా ప్రకటించాల్సిన అంశాలపై కూడా కప్పదాటు ధోరణిని అవలంబిస్తున్నారు. చట్టసభల్లో, పార్టీ వేదికలపై రాష్ట్రానికి, ప్రజలకు సంబంధించిన కీలకమైన అంశాలపై తన అభిప్రాయాన్ని ఆయన వెల్లడించడం లేదు. వివిధ రాజకీయ పార్టీలు ఎంత కవ్వించినా జగన్ మాత్రం పెదవి విప్పడం లేదు. తన పార్టీ నేతలను కూడా ఆయా కీలకాంశాలపై మాట్లాడవద్దంటూ కట్టడి చేశారు. తమ నాయకుడిని 'సింహం' అంటూ పిలుచుకున్న పార్టీ ముఖ్య నేతలెందరో తాజా పరిణామాలపై జగన్ ధోరణి చూసిన తరువాత 'మా నాయకుడు ఇంత పిరికివాడా..!' అంటూ కలత చెందుతున్నారు.

డీఎంకే ఆహ్వానాన్నీ చెప్పుకోలేని దుస్థితి

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనకు సిద్ధమవుతోందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలానికి, తీవ్ర చర్చకు దారితీసింది. దక్షిణాదిలోని పలు రాజకీయ పార్టీలు ఇప్పటికే దీనిపై తమ నిరసన స్వరాన్ని వినిపిస్తున్నాయి. ఈ విషయంలో డీఎంకే ఓ అడుగు ముందుకేసింది. చెన్నైలో బీజేపీయేతర రాజకీయ పక్షాలతో శనివారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి రావాలంటూ వైసీపీతోపాటు టీడీపీ, జనసేనలకూ ఆహ్వానం పంపింది. 'మేం బీజేపీతో పొత్తులో ఉన్నాం. మేం ఈ సమావేశంలో పాల్గొనలేం. మా అభిప్రాయాన్ని సరైన వేదికపై వెల్లడిస్తాం' అంటూ టీడీపీ, జనసేన పేర్కొన్నాయి. వైసీపీ మాత్రం ఎలాంటి సమాధానం చెప్పకుండా మౌనం దాల్చింది. కనీసం డీఎంకే నుంచి ఆహ్వానం అందిందన్న విషయాన్ని చెప్పడానికి కూడా ఇబ్బంది పడింది. ఈ తంతాలన్నీ బీజేపీ అగ్రనేతలను... ప్రధానంగా మోదీ, అమిత్ షాలను ప్రసన్నం చేసుకోవడానికేనంటూ రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. శనివారం డీఎంకే నేత, కేంద్ర మాజీ మంత్రి కనిమొళి మాట్లాడుతూ, 'వైసీపీతో మాకు సత్సంబంధాలున్నాయి. రాజకీయంగా జగన్ మాకు మిత్రుడే. వచ్చే సమావేశాలకు వైసీపీ హాజరవుతుంది' అని ప్రకటించారు. ఈ ప్రకటన జగన్ రాజకీయ అస్పష్ట వైఖరిని ప్రపంచానికి చాటింది. డీలిమిటేషన్ అంశాన్ని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని గ్రహించిన జగన్... ఈ విషయంపై తన వైఖరిని తేటతెల్లం చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఒక వేళ పార్టీ నేతలు ఎవరైనా మాట్లాడినా అది తన, పార్టీ వైఖరిగానే బీజేపీ నేతలకు చేరుతుందని భావించిన ఆయన వారి నోళ్లకూ తాళం వేశారు. బీజేపీ 'గుడ్‌లుక్స్' కోసం తాపత్రయపడుతున్న విషయానికి ముసుగు వేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలన్నీ బెడిసికొడుతున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. డీఎంకే నుంచి తమకు ఆహ్వానం వచ్చిన విషయాన్ని ఎక్కడా ప్రస్తావించకుండా, కేవలం ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ రాసిన లేఖను మాత్రమే పార్టీ వేదికగా ప్రచారం చేసుకోవడాన్ని ఈ కోణంలోనే చూడాలని వారు వివరిస్తున్నారు.

ప్రధానికి జగన్ రాసిన లేఖ సారాంశం

నియోజకవర్గాల పునర్విభజనతో దేశంలోని ఏ రాష్ట్రమూ నష్టపోకుండా చూడాలని ప్రధాని నరేంద్ర మోదీని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి కోరారు. ఆయన రాసిన మూడు పేజీల లేఖలో... 'గత 15 సంవత్సరాలు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా గణనీయంగా తగ్గింది. జనాభా నియంత్రణ కార్యక్రమాలను ఆయా రాష్ట్రాలు నిజాయితీగా అమలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. జనాభా ప్రాతిపదికన చేసే డీలిమిటేషన్ ప్రక్రియతో పలు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్న భయాలను పరిగణనలోకి తీసుకోవాలి. వారి సెంటిమెంట్‌ను గౌరవించాలి. లోక్‌సభలో ఏ రాష్ట్రమూ తమ ప్రాతినిధ్య బలాన్ని కోల్పోకుండా అవసరమైతే 84వ రాజ్యాంగ సవరణ చేపట్టాలి. డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టే ముందు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి' అని జగన్ అభ్యర్థించారు.

ఎస్సీ వర్గీకరణపైనా అంతే...

జగన్ అస్పష్ట ధోరణి పునర్విభజనకే పరిమితం కాలేదు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికపైనా తన అభిప్రాయాన్ని చెప్పలేదు. 'మండలిలో ప్రవేశపెడితే వ్యతిరేకిస్తాం' అన్నంత వరకే పరిమితమయింది. ఈ అంశంపై తమ పార్టీ వైఖరిని మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ వెల్లడించారు. ఆయన చేసిన ప్రకటన వైసీపీ వైఖరిపై మరింత గందరగోళాన్ని, అయోమయాన్ని సృష్టించింది. ఏకసభ్య కమిషన్ సిఫారసులకు మద్దతు ఇస్తున్నామనో, ఇవ్వడం లేదనో చెప్పకుండా.. సభలో బిల్లు పెడితే తాము అనుసరించే పద్ధతుల గురించి మాత్రమే మాట్లాడారు. సమస్య ఉందో లేదో తేల్చుకోవడం, ఉంటే పరిష్కారాన్ని మాట్లాడడమన్న నేరుపోకడలకు వైసీపీ దూరంగా జరుగుతోంది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తే మాలలకు, ఇవ్వకపోతే మాదిగలకు దూరం అవ్వాల్సి వస్తుందేమో అన్న భయంతో ఎటూ తేల్చకుండా తప్పించుకునే ధోరణిని అవలంబిస్తున్నారు. జగన్ తీసుకుంటున్న ఈ అస్పష్ట, అనిర్దిష్ట వైఖరులు రాబోయే కాలంలో రాజకీయ ప్రతిబంధకాలుగా మారతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నల్లజర్ల ఘటనపై సర్కారు సీరియస్

- 'అంబేడ్కర్'ను అవమానించినవారిపై కఠిన చర్యలు
- డీజీపీని ఆదేశించిన సీఎం చంద్రబాబు
- నిందితుల అరెస్టుకు ప్రత్యేక పోలీసు బృందాలు

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలోని గాంధీ కాలనీలో భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు శనివారం మాట్లాడారు. అంబేడ్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచాలని సూచించారు. డీజీపీ స్పందిస్తూ.. ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికితీయడానికి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. నిందితుల అరెస్టుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని సీఎంకు వివరించారు. రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని అస్థిరపరిచేందుకు కొన్ని శక్తులు యత్నిస్తున్నాయని, అలాంటివారి పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఇలాంటి ఘటనలకు పాల్పడేవారి పట్ల మరింత కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ హెచ్చరించారు.

ధాన్యం కొనుగోళ్లలో కూటమి సర్కారు రికార్డు

- రైతుల ఖాతాల్లో రూ.8,003 కోట్లు జమ : మంత్రి మనోహర్



తెనాలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల విషయంలో కూటమి ప్రభుత్వం చారిత్రక రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ ఖరీఫ్‌లో 34.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో ఏకంగా రూ.8,003 కోట్లు జమ చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే 18 శాతం అదనంగా ధాన్యాన్ని కొనగలిగామని చెప్పారు. తెనాలిలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో 5,690 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, డబ్బు మాత్రం ఎనిమిది నెలల వరకు రైతులకు ఖాతాల్లో వేసిన దాఖలాలు లేవని తెలిపారు. ఇంకా రూ.1674 కోట్లు చెల్లించకుండానే బకాయి పెట్టి వెళ్లిపోయారని, వాటిని కూడా తాము చెల్లించామని చెప్పారు. కాగా, వచ్చే రబీ పంట కాలానికి కూడా ఇప్పుడు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని.. జొన్న, మొక్కజొన్న, అపరాల వంటి రబీ ఉత్పత్తులను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖలో ఒక్క నెల్లూరు జిల్లాలోనే భారీ కుంభకోణం జరిగిందని, ఈ కుంభకోణంలో మేలు చేసి పెట్టినందుకు గత ప్రభుత్వంలోని పెద్దల నుంచి అత్యంత ఖరీదైన రోలెక్స్ వాచ్‌లు, స్కోడా కార్లను ఉద్యోగులు బహుమతిగా పొందారని, నేతలు కూడా రూ.కోట్లకు పడగలు ఎత్తారని ఆరోపించారు. ఆ గుట్టు కూడా బయటకు తీస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం నాణ్యమైన సన్న బియ్యాన్ని అందించనున్నామని మంత్రి మనోహర్ తెలిపారు.

లెదర్ పార్కు భూముల కబ్జాకు నాడు వైసీపీ కుట్రలు

- చర్మకారులకు సహకార సంఘం: పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చర్మకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నాడు ఉమ్మడి జిల్లాల్లో లెదర్ పార్కుల ఏర్పాటు కోసం పల్నాడు జిల్లాలోని అడిగొప్పులలో 34.65 ఎకరాలు, విజయవాడలో రూ.100 కోట్ల విలువైన భూములను కేటాయిస్తే, వైసీపీ నేతలు ఇళ్ల స్థలాల పేరుతో బినామీల ముసుగులో కొట్టేసేందుకు యత్నించారని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాల రావు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ భూముల్లో ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకూడదని, నిజమైన అర్హులు ఉంటే వారిని గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. చర్మకారులకోసం ప్రత్యేక కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటుచేస్తామని చెప్పారు.

'ఏ 2' సునీల్ యాదవ్ ఫిర్యాదు... ఐదుగురిపై కేసు

ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పులివెందుల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2గా ఉన్న నిందితుడు సునీల్ యాదవ్ ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదైంది. ఇటీవల విడుదలైన 'హత్య' సినిమాలో తన తల్లిని అసభ్యకరంగా చూపించారని, ఆ సినిమాను నిలుపుదల చేయాలని ఎస్పీకి సునీల్ యాదవ్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అలాగే ఈ సినిమాలో తన తల్లిపాత్రకు సంబంధించిన అభ్యంతరకర వీడియో క్లిప్‌లను పులివెందులకు చెందిన కొంతమంది సోషల్ మీడియాలో పోస్టు చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టాలంటూ పులివెందుల పోలీసులకు, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఐదుగురిపై సీఐ నరసింహులు కేసు నమోదు చేశారు. హత్య సినిమాలో కొన్ని అభ్యంతకర సీన్లను సోషల్ మీడియాలో పోస్టులు చేసినందుకు ఈ కేసు నమోదైంది. దీనికి సంబంధించి పవన్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కేసు నమోదైన మిగతా నలుగురి వివరాలు పోలీసులు వెల్లడించలేదు.

ప్రభుత్వం శాశ్వతం.. రాజకీయాలు కాదు

అవి ఎన్నికలకే పరిమితం కావాలి: లోకేశ్



అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలన్న విషయాన్ని ఇప్పటికైనా జగన్‌రెడ్డి తెలుసుకోవాలి. ప్రభుత్వం శాశ్వతం, రాజకీయాలు కాదన్న విషయాన్ని గుర్తించాలి' అని మంత్రి లోకేశ్ అన్నారు. శనివారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. 'ప్రభుత్వం మారినా అభివృద్ధి, సంక్షేమాలు కొనసాగించే ప్రజాస్వామ్య స్ఫూర్తిని మీ విధ్వంస పాలనతో బ్రేక్ చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం...టీడీపీ పాలనలో బకాయిలను తాము ఎందుకు చెల్లించాలంటూ మొండికేసింది. టీడీపీ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం విద్యాశాఖలో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,271 కోట్లు విడతల వారీగా చెల్లిస్తామని మాట ఇచ్చాం. ఇప్పటికే రూ.788 కోట్లు విడుదల చేశాం. తాజాగా రూ.600 కోట్లు విడుదల చేశాం. త్వరలో మరో 400 కోట్లు విడుదల చేస్తాం." అని లోకేశ్ తెలిపారు.

వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్



న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హిందీ సాహిత్యంలో చెరగని స్థానం సంపాదించుకున్న సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త, కవి వినోద్ కుమార్ శుక్లా (88) కు దేశంలోనే అత్యున్నత సాహితీ గౌరవంగా భావించే 2024-జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో నివాసం ఉన్న వినోద్ కుమార్ శుక్లా అనేక నవలలు, కథలు, కవితలు రాశారు. 'దీవార్ మే ఏక్ ఖిడ్కీ థీ' అనే నవల రాసినందుకు ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రముఖ ఒడియా రచయిత్రి ప్రతిభా రే అధ్యక్షతన శనివారం సమావేశమైన జ్యూరీ వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ పురస్కారం ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ పురస్కారాన్ని అందుకున్న హిందీ రచయితల్లో వినోద్ కుమార్ శుక్లా 12వ వారు కాగా, ఛత్తీస్‌గఢ్ నుంచి జ్ఞానపీఠ్ అవార్డు అందుకోనున్న తొలి రచయిత. ఈ ఏడాది జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతను ఎంపిక చేసేందుకు ఏర్పాటైన జ్యూరీలో ప్రతిభా రేతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, ప్రముఖ రచయితలు ప్రభావర్మ, దామోదర్ మోజో, అనామిక, ప్రఫుల్ షిలేదార్, జానకీ ప్రసాద్ వర్మలతో పాటు ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి- కవి ఏ కృష్ణారావు కూడా ఉన్నారు.

357 బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్

న్యూఢిల్లీ, మార్చి 22 : ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్స్ సర్వీసెస్ ట్యాక్స్ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) విభాగం కొరడా ఝళిపించింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్, చెల్లింపుల్లో అవకతవకలకు, నిబంధనల అతిక్రమణకు పాల్పడిన సంస్థలకు చెందిన 357 వెబ్‌సైట్లను ఇప్పటిదాకా బ్లాక్ చేసింది. భారతదేశంలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గ్యాంబలింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మరో 700 ఆఫ్‌షోర్ సంస్థలపై నిఘా పెట్టింది.

హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ హతం

జెరూసలెం, మార్చి 22: హమాస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గురువారం జరిపిన దాడిలో దక్షిణ గాజాలో హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్‌తోపాటు హమాస్ నిఘా, టార్గెటింగ్ యూనిట్‌లకు అధిపతిగా ఉన్న ఒసామా తబాష్‌ను అంతమొందించినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హమాస్ పోరాట వ్యూహాన్ని రూపొందించే బాధ్యతను ఆయన చూసుకునే వాడని, దక్షిణ గాజాలో హమాస్ మిలిటరీ విభాగం ఇంటెలిజెన్స్‌ను సమన్వయం చేయడంతోపాటు ఆ ప్రాంతంలో వారి కార్యకలాపాలకు నాయకత్వం వహించే వాడని ఐడీఎఫ్ పేర్కొంది.

ఆదిత్య పేరు చెప్పొద్దని ఉద్ధవ్ ఫోన్ చేశారు

» సుశాంత్ మేనేజర్ దిశ మృతి ఘటనపై బీజేపీ నేత రాణె

ముంబై, మార్చి 22: బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుట్, ఆయన మేనేజర్ దిశా సాలియన్ మరణాల ఘటనల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతుచిక్కని కారణాలతో 2020 జూన్ 8న దిశ మృతి చెందగా, అది జరిగిన ఆరు రోజులకే జూన్ 14న సుశాంత్ మరణించారు. దిశ మరణంపై శనివారం బీజేపీ సీనియర్ నేత నారాయణ రాణె తీవ్రమైన ఆరోపణ చేశారు. ఆ కేసులో తన కుమారుడు ఆదిత్య ఠాక్రే పేరును మీడియా వద్ద వెల్లడించవద్దంటూ మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తనకు ఫోన్ చేసి చెప్పారని ఆరోపించారు. నాడు జరిగిన ఫోన్ సంభాషణను ఆయన వివరించారు. తాను ఎవరి పేరునూ మీడియాకు చెప్పలేదని, ఒక మంత్రి ప్రమేయం ఉందని అన్నానంటూ సమాధానం ఇచ్చానని రాణె తెలిపారు. ఆ సమయంలో ఆదిత్య ఠాక్రే మంత్రిగా ఉండడం గమనార్హం. మరోవైపు తన కుమార్తె మరణంపై మరోసారి దర్యాప్తు చేయించాలని, ఆదిత్యపై కేసు నమోదు చేయాలని కోరుతూ దిశ తండ్రి సతీష్ బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. తన కుమార్తెపై దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని ఆరోపించారు.

జస్టిస్ వర్మపై విచారణ

ఆదేశాలు జారీ చేసిన సీజేఐ ఖన్నా.. సమగ్ర విచారణకు త్రిసభ్య కమిటీ

» కమిటీలో పంజాబ్, హిమాచల్ సీజేలు, కర్ణాటక హైకోర్టు జడ్జి అనుశివరామన్

» సీజేఐ నిర్ణయానికి వీడియో క్లిప్పింగే కారణం!

» 2018లోనే వర్మపై ఆర్థిక నేరం కేసు



సుప్రీంకోర్టు శనివారం విడుదల చేసిన వీడియోలో కరెన్సీ నోట్లు కాలిపోతున్న దృశ్యం



జస్టిస్ శీల్‌నాగు | జస్టిస్ అనుశివరామన్ | జస్టిస్ సంధావాలియా

న్యూఢిల్లీ, మార్చి 22: అగ్నిప్రమాదంతో వెలుగులోకి వచ్చిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల ఉదంతంపై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా విచారణకు ఆదేశించారు. ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ డీకే ఉపాధ్యాయ్ శుక్రవారం ఇచ్చిన అంతర్గత విచారణ నివేదిక మేరకు.. శనివారం త్రిసభ్య కమిటీని నియమించారు. సమగ్ర విచారణ జరపనున్న ఈ కమిటీలో పంజాబ్-హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ శీల్‌నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ ఉన్నారు. వర్మ అంశంపై సుప్రీంకోర్టు ఓ ప్రకటనను విడుదల చేస్తూ.. "జస్టిస్ యశ్వంత్ వర్మపై తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి" అని పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు సీజే ఇచ్చిన నివేదిక, జస్టిస్ వర్మ వివరణ, ఫొటోలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపింది. సుప్రీంకోర్టు ఇలా ఆధారాలను అప్‌లోడ్ చేయడం మొదటిసారి కాగా.. పూర్తి పారదర్శకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జస్టిస్ వర్మ వివరణలో.. తాను ఆ క్లిప్పింగ్‌లను చూసి, షాక్‌కు గురైనట్లు తెలిపారు. "ఆ దృశ్యాలు మా ఇంటి వద్ద జరిగిన ప్రమాదానివి కాదు. నాపై కుట్ర జరిగినట్లు స్పష్టమవుతోంది" అని వివరణ ఇచ్చారు. కాగా.. ఈ ఉదంతం వెలుగులోకి రాగానే సీజేఐ కొలీజియం భేటీని ఏర్పాటు చేయడానికి ఓ వీడియో క్లిప్పింగ్ ప్రధాన కారణం అని తెలుస్తోంది. ఈనెల 14న వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ వీడియోను చిత్రీకరించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆ క్లిప్పింగ్‌ను ఉన్నతాధికారులకు పంపగా.. వారు సీజేఐకి చేరవేశారు. ఆ క్లిప్పింగ్ ఆధారంగానే వర్మ బదిలీ, అంతర్గత విచారణకు కొలీజియం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అలా ప్రకటించలేదు: ఫైర్స్ డీజీ

జస్టిస్ వర్మ ఇంట్లో ఎలాంటి నోట్లకట్టలు లభించలేదని తాను ప్రకటన చేసినట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయని, అవి అసత్యమని ఢిల్లీ అగ్నిమాపక విభాగం డైరెక్టర్ జనరల్ అతుల్ గర్గ్ స్పష్టంచేశారు. తాను అలా చెప్పలేదని వివరించారు.

సింభోలీ షుగర్ మిల్స్ కేసులో వర్మ

2018లోనే ఓ ఆర్థిక వ్యవహారంలో వర్మ నిందితుడిగా ఉండగా.. గత ఏడాది ఆ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో ఉన్న సింభోలీ షుగర్ మిల్స్(ఎస్ఎస్ఎం)కు వర్మ 2012 వరకు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించేవారు. పరికరాలు, పనిముట్లు అందించే ఉద్దేశంతో చెరుకు రైతులకు నగదు పంపిణీ చేస్తామని పేర్కొంటూ ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ వద్ద ఎస్ఎస్ఎం రూ.97.85 కోట్ల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని రైతులకు ఇవ్వకుండా.. ఇతర ఖాతాలకు బదిలీ చేసింది. రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో.. 2012లోనే ఈ ఎస్ఎస్ఎం బ్యాంకు ఖాతాను నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) ఆర్‌బీఐ ప్రకటించింది. దీనిపై 2018లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ కేసులో వర్మను పదో నిందితుడిగా సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత దర్యాప్తు మందకొడిగా సాగి.. కేసు మూతపడింది. 2024 ఫిబ్రవరిలో ఆ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆ ఆదేశాలను కొట్టివేసింది. దీంతో.. సీబీఐ దర్యాప్తు నిలిచిపోయింది.

ఇదీ.. వర్మ నేపథ్యం..

ప్రయాగ్‌రాజ్‌లో 1969 జన్మించిన యశ్వంత్ వర్మ మధ్యప్రదేశ్‌లోని లా యూనివర్సిటీ నుంచి 1992లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. అదే సంవత్సరం అలహాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2006 వరకు అక్కడే ప్రత్యేక న్యాయవాదిగా పనిచేశారు. 2012-13లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ప్రధాన స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 2014లో అదనపు న్యాయమూర్తిగా నియమితులై.. 2016లో అలహాబాద్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశారు. 2021 అక్టోబరు 11 నుంచి ఢిల్లీ హైకోర్టులో పనిచేస్తున్నారు. కాగా.. శుక్రవారం నుంచి వర్మ సెలవులో ఉన్నారని సమాచారం. ప్రస్తుతం ఆయన ఢిల్లీ హైకోర్టులో సేల్స్ ట్యాక్స్, జీఎస్టీ, కంపెనీ అప్పీళ్ల వంటి కేసులను విచారించే కీలక ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్నారు.

అమెరికాలో 5.32లక్షల మంది తాత్కాలిక వలస వీసాల రద్దు

» నెలరోజుల్లో దేశం నుంచి బహిష్కరణ



వాషింగ్టన్, మార్చి 22: అమెరికా వలస విధానాన్ని సమూలంగా మార్చేసిన అధ్యక్షుడు ట్రంప్.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలిక వలస వీసాపై అమెరికాలో ఉన్న 5,32,000 మందిపై కొరడా ఝళిపించారు. వీరి తాత్కాలిక వలసదారుల హోదాను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో క్యూబా, హైతీ, నికరాగ్వాన్, వెనిజులా దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వీరందరికీ చట్టపరమైన భద్రతను తొలగిస్తున్నట్టు హోం ల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్టు తెలిపింది. మరోవైపు, మాజీ అధ్యక్షుడు బైడెన్, మాజీ ఉపాధ్యక్షురాలు కమల, మాజీ విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా పలువురికి సెక్యూరిటీ క్లియరెన్స్‌ను ట్రంప్ రద్దు చేశారు. ఆయా నేతలకు ప్రభుత్వం అందిస్తున్న ఎస్కార్ట్, ఇతర సదుపాయాలను కూడా రద్దు చేయాలని పలు విభాగాలను ఆదేశించారు. దీంతో ఆయా నేతలకు రోజువారీ బ్రీఫింగ్ ఇకపై ఉండదు. అలాగే, గత ప్రభుత్వంలో నియమితులైన ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ఎవరికీ సమాచారాన్ని చేరవేయరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న ట్రంప్.. "దేశ ప్రయోజనాల రీత్యా వారికి ఇకపై ఇలాంటి సమాచారం ఇవ్వడం సరికాదు" అని తన ఆదేశాల్లో పేర్కొన్నారు.



జూలై 3 నుంచి తానా మహాసభలు

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు ప్రత్యేక ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) 24వ మహాసభలు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. అమెరికాలోని మిచిగాన్(నోవై)లో జరిగే ఈ మహాసభలకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) వేమూరి రాధాకృష్ణకు ఆహ్వానం అందింది. తానా కాన్ఫరెన్స్ ఛైర్మన్ నాదెళ్ల గంగాధర్, మాజీ అధ్యక్షులు జయరామ్ కోమటి, డైరెక్టర్ సునీల్ పాంత్రు, చందు గొర్రెపాటి, శశి దొప్పాలపూడి బృందం వేమూరి రాధాకృష్ణను శనివారం స్వయంగా కలిసి మహాసభలకు ఆహ్వానించింది. అమెరికా, తెలుగు రాష్ట్రాల్లో తానా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తానా ప్రతినిధులు వేమూరి రాధాకృష్ణకు ఈ సందర్భంగా వివరించారు. 3 రోజుల పాటు జరిగే మహాసభల్లో భాగంగా బిజినెస్ సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు కళాకారులు, రచయితలు, వ్యాపారవేత్తలు వివిధ రంగాలకు చెందిన 10వేల మంది ప్రముఖులు ఈ మహాసభల్లో పాల్గొంటారన్నారు.

6% పట్టణ కుటుంబాలకే రక్షిత కుళాయి నీరు

» లోకల్ సర్కిల్స్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 22: దేశంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఆందోళనకర అంశంగా మారింది. కేవలం 6% ఇళ్లకు మాత్రమే మున్సిపాలిటీల నుంచి తాగడానికి నాణ్యమైన కుళాయి నీరు అందుతోందని తాజా సర్వే వెల్లడించింది. 62% కుటుంబాలు సురక్షితమైన తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫయర్స్, ఆర్వో సిస్టమ్స్ వంటి ఆధునిక నీటి శుద్ధి (ఫిల్టరేషన్) విధానాలపై ఆధారపడుతున్నాయని పేర్కొంది. శనివారం 'వరల్డ్ వాటర్ డే' సందర్భంగా లోకల్ సర్కిల్స్ అనే సంస్థ తన సర్వే వివరాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల్లో 30 వేలకు పైగా కుటుంబాలపై సర్వే చేశారు. తమ ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ప్రశ్నించగా.. కేవలం 30% కుటుంబాలు మాత్రమే 'మంచి'గా ఉన్నాయని పేర్కొన్నాయి. అసలు తమకు కుళాయి నీరు సరఫరానే లేదని 12 శాతం మంది చెప్పారు.

పాతికేళ్లు వాయిదా వేయాలి

చెన్నై వేదికగా జేఏసీ నేతల డిమాండ్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను 25 ఏళ్లపాటు వాయిదా వేయాలని, ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాలను యథాతథంగా కొనసాగించాలని అధికార డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్రంపై గట్టిగా గొంతెత్తిన స్టాలిన్‌కు ఏడు రాష్ట్రాల నుంచి గట్టి మద్దతు లభించింది. ఆయన ప్రారంభించిన పోరాటంలో 'మేము సైతం...' అంటూ దక్షిణాదిలోని బీజేపీయేతర పార్టీలకు చెందిన పలువురు సీఎంలు, ప్రముఖులు; పంజాబ్ ముఖ్యమంత్రి భాగమయ్యారు. చెన్నైలో శనివారం ఉదయం అధికార డీఎంకే ఆధ్వర్యంలో జరిగిన తొలి ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశంలో శిక్షించేలా కాదు.. న్యాయ సమ్మతంగా పునర్విభజన జరగాలంటూ వారంతా ఏకకంఠంతో నినదించారు. ఈ పోరాటంలో స్టాలిన్ వెంట ఉంటామని పలువురు నేతలు స్పష్టం చేశారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటం, మరోవైపు న్యాయపరమైన కార్యాచరణ దిశగా పని చేసేందుకు నిపుణులతో కమిటీని ఏర్పాటుచేయాలన్న స్టాలిన్ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అందరూ ఆమోదించారు. లోక్‌సభ స్థానాల పునర్విభజనను 25 యేళ్లపాటు వాయిదా వేస్తూ, పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని జేఏసీ సమావేశం తీర్మానించింది. ఎంపీ స్థానాల సంఖ్యను ఏమాత్రం తగ్గించడానికి వీల్లేదని సమావేశంలో నేతలు డిమాండ్ చేశారు. 'పునర్విభజన వల్ల నష్టపోతామని ఆందోళన చెందుతున్న రాష్ట్రాలకు చెందిన పార్టీలను ఆహ్వానించి కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరపాలి.' అని జేఏసీ కేంద్రాన్ని కోరింది. పునర్విభజనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు చెందిన ఎంపీలతో కోర్ కమిటీని ఏర్పాటుచేసుకుని, పార్లమెంటులో సమన్వయంతోను, స్పష్టమైన వ్యూహంతోను పనిచేయాలని నిర్ణయించింది. జేఏసీ సమావేశ వివరాలను డీఎంకే ఎంపీ కనిమొళి మీడియాకు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు రావాల్సి ఉన్నా, అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవ్వరూ రాలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. వైసీపీ నుండి ప్రతినిధులెవరూ రాకపోయినా, ఈ సమస్యపై ఆ పార్టీ నేత ప్రధానికి లేఖ రాశారని వివరించారు. 'వైసీపీ మీతోనే ఉన్నట్లు భావిస్తున్నారా' అని అడగ్గా.. 'ఆ విషయం మేం చెప్పడం కాదు, లేఖ రాయడం ద్వారా వారే చెప్పారు' అని కనిమొళి వ్యాఖ్యానించారు. తదుపరి జేఏసీ సమావేశం తెలంగాణ రాజధాని హైదరాబాద్ జరుగుతుందని తెలిపారు.

స్టాలిన్‌ను పవన్ కలుస్తారు

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ త్వరలో స్టాలిన్‌ను కలుస్తారని ఒక ప్రశ్నకు సమాధానంగా కనిమొళి తెలిపారు. పునర్విభజనపై కేంద్రప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయడంలేదని, అదే సమయంలో పునర్విభజన తప్పకుండా జరిగి తీరుతుందనే విధంగా నేతల మాటలు ఉన్నాయని అన్నారు. ఇటీవల ప్రధాని మోదీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమలుపై మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఆ ప్రక్రియ చేపడతామని చెప్పడాన్ని బట్టి కేంద్రం దృఢనిశ్చయంతో ఉందని స్పష్టమవుతోందన్నారు.

ఎవరెవరు వచ్చారంటే..

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలో జరిగిన సమావేశానికి పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖ నాయకులు హాజరయ్యారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ (సీపీఎం), తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ (ఆప్), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ (కాంగ్రెస్), బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలు వినోద్‌కుమార్, సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఒడిశా మాజీ మంత్రి సంజయ్‌కుమార్ దాస్ బుర్మా, అమర్ పట్నాయక్ సింగ్ (బీజేడీ), పంజాబ్ రాష్ట్ర శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సర్దార్ బల్వీందర్ సింగ్, దల్జిత్‌సింగ్ సీమా, సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం, కాంగ్రెస్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకరన్, ముస్లిం లీగ్ నేత పీఎంఏ సలామ్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్, ఎంఐఎం ప్రతినిధి ఇంతియాజ్ జలీల్, కేరళకాంగ్రెస్ (మణి) ప్రతినిధి జోస్ కె.మణి, కేరళ కొట్టాయం కాంగ్రెస్ ఎంపీ జార్జి కె.ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. బీజేడీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్‌పట్నాయక్ వీడియోసందేశం పంపారు.



డీలిమిటేషన్‌పై చెన్నైలో నిర్వహించిన జేఏసీ సమావేశానికి హాజరైన సీఎంలు విజయన్, భగవంత్ మాన్, స్టాలిన్, రేవంత్

న్యాయ సమ్మతంగా పునర్విభజన

» తమిళనాడు సీఎం స్టాలిన్ డిమాండ్

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. అదే సమయంలో పునర్విభజన ప్రక్రియ సర్వజనామోదంగా, న్యాయసమ్మతంగా ఉండాలని డిమాండ్ చేశారు. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించేలా ఈ ప్రక్రియ ఉండకూడదన్నదే తమ అభిమతమని ఆయన స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో స్టాలిన్ మాట్లాడారు. ఒక రాష్ట్రానికి చెందిన అధికార పార్టీ ఆహ్వానాన్ని అంగీకరించి ఇంతమంది రాజకీయ పార్టీల నేతలు సమావేశానికి రావడం ఆనందంగా ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే అందరం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను (543) యథాతథంగా ఉంచి పునర్విభజన జరిపితే తమిళనాడులో ఎనిమిది ఎంపీ సీట్లు తగ్గుతాయని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజన వల్ల నష్టపోనున్న రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించామని, న్యాయసంబంధ ప్రక్రియపైనా దృష్టి సారించనున్నామని స్టాలిన్ పేర్కొన్నారు. నిరంతర కార్యాచరణ ద్వారానే హక్కులను పరిరక్షించుకోగలమన్నారు.

మోదీయే అన్నారుగా...?

2023లో తెలంగాణ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ మాటలను స్టాలిన్ గుర్తుచేశారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు 100 నియోజకవర్గాలు కోల్పోతాయని, ఇందుకు ఆ రాష్ట్రాల ప్రజలు సమ్మతిస్తారా? అంటూ నాడు ఆయన ప్రశ్నించారని స్టాలిన్ తెలిపారు. మోదీ మాటలను బట్టి పునర్విభజన వల్ల లోక్‌సభ సీట్లు తగ్గటం ఖాయమనే విషయం తేటతెల్లమవుతోందని అన్నారు.

ఎక్కువ నిధులిస్తూ.. తక్కువ తీసుకోవాలా?

» అసమగ్ర పునర్విభజన అంగీకరించబోం: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ ఖజానాకు దక్షిణాది పెద్ద మొత్తంలో నిధులిస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నదని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. "పన్నుల రూపంలో కేంద్రానికి తమిళనాడు రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తోంది. అదే.. యూపీకి రూపాయికి రూ.2.73; మధ్యప్రదేశ్‌కు రూ.1.73; బిహార్‌కు రూ.6.06 వెనక్కి వస్తున్నాయి. కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి" అని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులను క్రమంగా తగ్గిస్తోందని, చివరకు, జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని తప్పుబట్టారు. జనాభాను నియంత్రించాలని 1971లో కేంద్రం నిర్ణయించినప్పటి నుంచీ దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయని, ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయని, మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తుందని తెలిపారు. దక్షిణాదిని రాజకీయంగా కుదించే ఈ పునర్విభజనను అంగీకరించలేమని, అసమగ్ర పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని, అన్ని రాష్ట్రాలు, పార్టీలు తమ విభేదాలను విస్మరించి మన వాటా దక్కించుకునేందుకు ఏకతాటిపై నిలవాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణాది గళాన్ని బలంగా, సమైక్యంగా మొత్తం భారతదేశానికి వినిపించాలని సూచించారు. పునర్విభజనకు జనాభా దామాషాను ప్రాతిపదికగా చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తామన్నారు. తదుపరి జేఏసీ సమావేశం హైదరాబాద్ నిర్వహిస్తామని తెలిపారు.

దక్షిణాదికి అన్యాయమే: కేటీఆర్

పునర్విభజన వల్ల దక్షిణాదికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడమే కాకుండా, ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరుగబోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి 36 శాతం జీడీపీలో భాగస్వామ్యం వున్న దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం శిక్షిస్తోందని మండిపడ్డారు. దక్షిణాది పట్ల కేంద్రం వివక్ష కొత్తేమీ కాదని, ఇటీవలి కాలంలో ఈ వివక్ష, అన్యాయం మరింత పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం బుల్లెట్ రైళ్లను ఉత్తరాదికి పరిమితం చేస్తూ.. పుండుపైన మరింత ఉప్పు రాస్తోందన్నారు.

పందుల్లా కంటున్నారు..

» ఉత్తరాది ప్రజలపై డీఎంకే మంత్రి దూషణ

» వీడియో ప్రదర్శించి.. బీజేపీ నిరసన

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఆధ్వర్యంలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం జరుగుతున్న నేపథ్యంలోనే తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షుడు అన్నామలై శనివారం సామాజిక మాధ్యమాల్లో వెలువరించిన ఓ వీడియో కలకలం రేపింది. ఓ సభలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అన్బరసన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు దక్షిణాది రాష్ట్రాల ప్రజలంతా కుటుంబ నియంత్రణ పాటించి జనాభాను తగ్గిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు పందుల్లా పిల్లల్ని కని జనాభాను పెంచేశారంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆ వీడియోలో ఉన్నాయి. ఇంకా ఆ మంత్రి మాట్లాడుతూ.. హిందీ నేర్చుకున్న ఉత్తరాది యువకులంతా తన ఇంట పశువులు మేపుకుంటున్నారని, పానీ పూరీలు అమ్ముకుంటున్నారని, తమిళులు హిందీని నేర్చుకుని ఉంటే వారిలాగే ఉత్తర భారతదేశానికి వెళ్లి పానీ పూరీలు అమ్ముకునే దుర్గతి పట్టేదని వ్యాఖ్యానించారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ.. మంత్రి హోదాలోని వ్యక్తి ఉత్తరాదివారిని కించపరిచేలా మాట్లాడడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, జేఏసీ భేటీకి వ్యతిరేకంగా తమిళనాడు అంతటా బీజేపీ నేతలు నిరసనలు తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు నల్ల దుస్తులు ధరించి పలు చోట్ల నిరసనలు చేపట్టారు. పాలనాపరమైన అవినీతి కారణంగా ప్రజల నుంచి చవిచూస్తున్న వ్యతిరేకతను కప్పిపెట్టుకోవడం కోసం కొందరు సీఎంలు జేఏసీ భేటీకి వచ్చారని తమిళిసై విమర్శించారు. కాగా, పునర్విభజనను వ్యతిరేకిస్తున్నవారు... నిజంగానే సమస్య ఉందని భావిస్తున్నారా లేక రాజకీయ ఏజెండాతో వెళుతున్నారా అని ఆర్ఎస్ఎస్ ప్రశ్నించింది. పునర్విభజన ప్రక్రియను కేంద్రం ఇంకా అసలు మొదలే పెట్టలేదని, అలాంటప్పుడు చర్చలేమిటని ఆర్ఎస్ఎస్ జాతీయ సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రశ్నించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.